www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 11-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 206 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 6.47 తదుపరి ఏకాదశి; నక్షత్రం: శతభిషం ఉ. 9.40 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: మ. 3.35-5.04; దుర్ముహూర్తం: మ. 12.21-1.06, మ.2.36-3.21; అమృతఘడియలు: రా.12.28-1.56; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మురళి.. మహా అవినీతి!

డిప్యూటీ కలెక్టర్ ఆస్తులు

150 కోట్లు!

- ఇంట్లో కిలో బంగారం, అరకిలోపైనే వెండి
- ఏసీబీ సీజ్‌లో 33 ఆస్తుల పత్రాలు
- 20 బ్యాంకుల్లో ఖాతాలు, 7 ఇళ్లు, హోటల్ సహా 12 స్థలాలను గుర్తించిన అధికారులు
- మార్కెట్ ధరల మేరకు 150 కోట్లుగా అంచనా
- 80 శాతం ఆస్తులు బినామీల పేరిటే కొనుగోలు
- మురళి అరెస్టు.. ఏసీబీ కోర్టుకు తరలింపు

14



ఎం.ఎస్. మురళి

జగన్ బొమ్మకు బిల్లులు!



ఓ మంత్రి, ఐఏఎస్ మంత్రాంగం.. ఇప్పటిదాకా రూ.120 కోట్లు విడుదల

మరో 150 కోట్ల విడుదలకు యత్నం.. త్వరలో 65 కోట్లు చెల్లించేలా ప్రతిపాదన

గత టీడీపీ ప్రభుత్వంలో నిబంధనల ప్రకారం పనులు చేసిన ఎంతోమంది కాంట్రాక్టర్లు ఇప్పటికీ బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. గత జగన్ సర్కారు కక్ష సాధింపు ధోరణితో రకరకాల కొర్రీలు వేసి పెండింగ్‌లో పెట్టింది. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నవారికి ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో బిల్లులు క్లియర్ చేయకుండా... జగన్ ప్రభుత్వంలో అడ్డగోలు పనులు చేసిన వారికి మాత్రం చెల్లింపులు చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో భూముల సమగ్ర సర్వే పేరిట సర్వే రాళ్ల కొనుగోలు, వాటిపై జగన్ చిత్రాలు చెక్కించడం, పాస్ పుస్తకాల నిండా జగన్ ఫొటోలు వేయడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా తప్పుపట్టారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేయించాల్సి ఉంది. అలాంటిది... ఈ పనులకు సంబంధించి ఇటీవల 120 కోట్ల బిల్లులు చెల్లించారు. మరో 150 కోట్లు కూడా ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అసలు కూటమి ప్రభుత్వంలో ఏం జరుగుతోంది? బిల్లుల చెల్లింపు వెనుక మతలబు ఏమిటి?

- ఇందులో రిటైర్డ్ ఐఏఎస్ బినామీ కంపెనీ
- నాడు అడ్డగోలుగా సమగ్ర భూ సర్వే
- సర్వే రాళ్లపై జగన్ చిత్రాలు
- పాసుపుస్తకాల నిండా ఆయన ఫొటోలే
- కూటమి ప్రభుత్వం వచ్చాక పాసుపుస్తకాల రద్దు, సర్వే బంద్
- చిత్రంగా విచారణకు బదులు చెల్లింపులు
- గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పటికీ చెల్లించని వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ఫొటోలతో ఉన్న పాసుపుస్తకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో పీడ విరగడైందని రైతులు సంబరపడ్డారు. తప్పుల తడక అయిన సమగ్ర భూ సర్వేను ఆపేయడంతో దరిద్రం వదిలిందని ఊపిరి పీల్చుకున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. ఇంతవరకు బాగానే ఉంది. అదేమిటో కానీ ఓ మంత్రి, ఓ సీనియర్ ఐఏఎస్ జట్టు కట్టి జగన్ ప్రభుత్వంలో రీ సర్వే పేరిట జరిగిన ఖర్చులకు ఇప్పుడు

మిగతా 13వ పేజీలో...

తెర వెనుక ఇలా..

కాంట్రాక్టర్లకు బిల్లులు సజావుగా చెల్లించేలా సహకరిస్తున్న సీనియర్ ఐఏఎస్‌కు గతంలో రీ సర్వే జరిగే సమయంలోనే డ్రోన్ల కొనుగోలు, పాసు పుస్తకాల ముద్రణ టెండర్లలో భారీగానే లబ్ధి చేకూరిందని ప్రచారం జరుగుతోంది. దీంతో కూటమి ప్రభుత్వంలో ఆయన తన పలుకుబడి ఉపయోగించి తెరవెనక మంత్రాంగం నడుపుతున్నట్లు తెలిసింది. ఇందుకోసం తనకు సన్నిహితుడైన కీలక మంత్రిని రంగంలోకి దింపి లాబీయింగ్ చేయిస్తున్నారని తెలిసింది. జగన్ ప్రభుత్వంలో రీ సర్వే పేరిట కొనుగోళ్లు, చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేయించాల్సిన కూటమి ప్రభుత్వం... ఆ కాంట్రాక్టర్లకు శరవేగంగా బిల్లులు చెల్లించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

అహంకారం.. ఆర్భాటం వద్దు



13


- అందరితో సౌమ్యంగా, గౌరవంగా మెలగండి
- ప్రజలతో మమేకమై బాధ్యతగా పనిచేయండి
- పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి
- నామినేటెడ్ పదవులు పొందినవారికి సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి అభివృద్ధికి ముందడుగు!

- మౌలిక సదుపాయాల కల్పన సాకారం
- ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం తాజా ఆమోదం
- నిధులపై ఢిల్లీలో నేడు త్రైపాక్షిక చర్చ



14



అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్

అధికారులను బెదిరిస్తే సుమోటో కేసులు

- వారిపై ఈగ వాలినా బెదిరించిన వారే బాధ్యులు
- ఐపీఎస్‌లు లక్ష్యంగా గత ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తప్పు.. సుమోటోగా చర్యలు
- ఏ ఆడబిడ్డకు ఇబ్బంది కలిగినా ఊరుకోను
- నేరగాళ్లకు కులమతాలు ఉండవు
- సింగపూర్ తరహా శిక్షలు అమలు చేయాలి
- గతంలో సీఎం పర్యటనల పేరిట చెట్లు నరికారు
- వాల్టా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం
- అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ హెచ్చరిక
- అమరుల త్యాగాలు వృథా కానివ్వబోమని వ్యాఖ్య

14

సూపర్ 6కు ఊతం!

అభివృద్ధికి అందలం.. నేడే బడ్జెట్ సమర్పణ

- రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లకు కలిపి 2.39 లక్షల కోట్లకు ఇప్పటికే ఆమోదం
- రూ.2.9 లక్షల కోట్లతో 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్
- ఇరిగేషన్, రహదారులకు పెద్దపీట
- దేవదాయం, జ్యుడీషియల్, మద్యం, ల్యాండ్ గ్రాబింగ్‌పై బిల్లులు
- శాసనసభలో కేశవ్, మండలిలో కొల్లు సమర్పణ



బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారం అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద భద్రతా సిబ్బంది తనిఖీలు

10 రోజులపాటు సమావేశాలు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలకు పెద్దపీట... అభివృద్ధిని అందలం ఎక్కిస్తూ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు సాగనున్నాయి. సోమవారం ఉదయం 10 గంటల తర్వాత శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెడతారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెడతారు. శాసనమండలిలో బడ్జెట్‌ను గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి నారాయణ ప్రవేశపెడతారు. 22వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు జరిగే అవకాశాలున్నాయి. ఇరిగేషన్ ప్రాజెక్టులు,

మిగతా 13వ పేజీలో...

హామీలు మహా హామీలు

- మహారాష్ట్ర ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించిన మహాయుతి, ఎంవీఏ
- ఉచిత రేషన్, మహిళా భద్రత
- రుణమాఫీలు, ఉద్యోగాల కల్పన
- వృద్ధాప్య, మహిళా పింఛన్ల పెంపు
- పోటాపోటీగా కూటముల హామీలు
- 20 లక్షల మంది విద్యార్థులకు.. నెలకు 10 వేల స్టైపెండ్: అమిత్‌షా
- రాయితీపై ఏటా 6 గ్యాస్ సిలిండర్లు
- 18 ఏళ్ల యువతులకు లక్ష సాయం
- 100 యూనిట్ల ఉచిత విద్యుత్తు
- రూ.4 వేల నిరుద్యోగ భృతి: ఖర్గే



ప్రచార సభలో సీఎం శిందే, డిప్యూటీ సీఎంలు ఫడణవీస్, అజిత్

ముంబై, నవంబరు 10: పదిరోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో.. అధికార కూటమి మహాయుతి, విపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఓటర్లపై వరాల జల్లులు కురిపించాయి. మహాయుతి తరఫున 'సంకల్ప్ పత్ర' పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఎంవీఏ తరఫున 'మహారాష్ట్రనామ' పేరుతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ఈ మేరకు తమ మ్యానిఫెస్టోలను ప్రకటించారు. యువత, పేదలు, రైతులు, మహిళాభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఇరు కూటములు ప్రాధాన్యతనివ్వడం

మిగతా 2వ పేజీలో...

వాడీవేడి 'మహా' సమరం

- సమస్త బలగాలనూ మోహరించిన కూటములు
- హస్తం వ్యూహాత్మక ప్రచారం
- పలు రాష్ట్రాల నేతల పర్యటన
- మోదీ సుడిగాలి ప్రచారం
- ఆయన వెంట షా, యోగి
- వివాదాస్పదమవుతున్న వ్యాఖ్యలు.. ఈసీ సీరియస్

2

ఎస్సీ, ఎస్టీ, బీసీలపై కాంగ్రెస్ కుట్ర

రిజర్వేషన్లు లాక్కోవాలనేది వారి వ్యూహం: ప్రధాని మోదీ

ప్రభుత్వం మారినా ఇసుక రీచ్‌లో

పెత్తనం మాదే!

ట్రాక్టర్‌తో ఢీకొట్టి టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేతల హత్యాయత్నం

- గుంటూరు జిల్లాలో దాష్టీకం
- వెన్నెముక, పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలు

9



దక్షిణాదికి దండన!

- జనాభాను నియంత్రించినా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా నష్టం
- 5 రాష్ట్రాల్లో పెరుగుతున్న వృద్ధుల సంఖ్య
- 20 శాతానికి వృద్ధాప్య డిపెండెన్సీ నిష్పత్తి
- నియోజకవర్గాల పునర్విభజనతోనూ నష్టం

2

సజ్జల భార్గవ్‌పై అట్రాసిటీ కేసు

14

- జగన్ మేనల్లుడు అర్జున్‌రెడ్డి, వర్రాపైనా
- బాధితుడి ఫిర్యాదు.. పులివెందులలో కేసు
- అసభ్య పోస్టులు తీసేయాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని వర్రా డిమాండ్
- చంపి పాతిపెడతానని బెదిరింపు!

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యత దెబ్బతీసేందుకు

కాంగ్రెస్ కుట్ర

» ఆపై రిజర్వేషన్లు లాక్కోవాలని వ్యూహం: ప్రధాని మోదీ



గుంవ్లా(ఝార్ఖండ్), ముంబై, నవంబరు 10: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను విడగొట్టి వారి రిజర్వేషన్లను లాక్కోవాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు కలిసుంటే పార్టీ మనుగడ కష్టమని కాంగ్రెస్‌కు తెలుసని, అందుకు వారిని విడగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యతకు కాంగ్రెస్ వ్యతిరేకంగానే ఉందని, వారి మధ్య ఐక్యత లేనంతవరకూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేసి దేశాన్ని దోచుకుందని ఆరోపించారు. ఈ మేరకు ఝార్ఖండ్‌లో పలుచోట్ల ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మాట్లాడారు. ఝార్ఖండ్‌లో కులాల మధ్య చిచ్చుపెట్టాలని కాంగ్రెస్- జేఎంఎం కూటమి యత్నిస్తోందని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్- జేఎంఎం కుట్రల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అధికారం చేజిక్కించుకోవడం కోసం వారు ఎంతవరకైనా వెళ్తారని అన్నారు.

రాజ్యాంగం రెడ్‌బుక్‌ని నక్సలిజంతో పోల్చుతారా?

» 2017లో ప్రధాని అదే రెడ్‌బుక్‌ని అప్పటి రాష్ట్రపతికి ఇవ్వలేదా: ఖర్గే



ముంబయి, నవంబరు 10 : రాజ్యాంగం రెడ్‌బుక్‌ని అర్బన్ నక్సలిజంతో పోలుస్తారా... అంటూ ప్రధాని మోదీ, బీజేపీలను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. అటువంటి ప్రతినే 2017లో ప్రధాని మోదీ అప్పటి రాష్ట్రపతి కోవింద్‌కి ఇచ్చారని గుర్తుచేశారు. అందుకు సంబంధించిన ఫొటోని ఖర్గే విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. నవంబరు 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మహా వికాస్ అఘాడీ(ఎంవీయే) మేనిఫెస్టో ఆదివారం విడుదల చేసిన ఆయన అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ... ఈ వ్యాఖ్యలు చేశారు. వివిధ సామాజిక వర్గాల స్థితిగతులను తెలుసుకుని వెనుకబడిన వర్గాల వారికి లబ్ధి చేకూర్చేందుకే కాంగ్రెస్ కులగణన చేయాలని డిమాండ్ చేస్తుందే తప్ప ప్రజలను విభజించేందుకు కాదన్నారు. అలాగే రెడ్ బుక్ రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ ప్రధాని మోదీ, బీజేపీ చెబుతున్నట్లు అది ఖాళీ పుస్తకం కాదన్నారు. ప్రధానిని మళ్లీ ప్రాథమిక పాఠశాలలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. కాగా రెడ్‌బుక్ చేతబూని రాహుల్‌గాంధీ అర్బన్ నక్సల్స్, అరాచక శక్తుల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవల ఆరోపించారు.


గొత్తికోయలపై నివేదిక ఇవ్వండి!

» కేంద్రం, ఏపీ సహా నాలుగు రాష్ట్రాలను కోరిన జాతీయ ఎస్టీ కమిషన్

న్యూఢిల్లీ, నవంబరు 10: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు హింస నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోయిన గొత్తికోయ గిరిజనుల పరిస్థితిపై సవివర నివేదిక ఇవ్వాలని కేంద్ర హోంశాఖతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలను జాతీయ ఎస్టీ కమిషన్ కోరింది. దీనిపై చర్చించేందుకు డిసెంబరు 9న నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని హోంశాఖ కార్యదర్శి, ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను అభ్యర్థించింది. గొత్తికోయలకు అండగా నిలిచేలా తగిన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని లేఖలో సిఫారసు చేసింది. వామపక్ష తీవ్రవాదం కారణంగా ఛత్తీస్‌గఢ్ నుంచి దాదాపు 50 వేల మంది గొత్తికోయలు వలస వెళ్లినట్లు ఒక అంచనా. వారంతా ఇప్పుడు ఏపీ, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర అటవీ ప్రాంతాల్లోని 248 చోట్ల నివసిస్తున్నారు.

వాడివేడిగా మహా సమరం!

» సమస్త బలగాలను మోహరించిన మహాయుతి, ఎంవీఏ కూటములు
» వ్యూహాత్మకంగా కాంగ్రెస్ ప్రచారం
» పలు రాష్ట్రాల నేతలు రంగంలోకి
» బీజేపీ వెనుకబాటుతో మోదీ సుడిగాలి ప్రచారం.. ఆయన వెంట షా, ఆదిత్యనాథ్




బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న అమిత్ షా, ఎంవీయే కూటమి మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమంలో ఖర్గే

న్యూఢిల్లీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో మరో పది రోజుల్లో ఎన్నికలు జరగనుండగా అధికార మహాయుతి కూటమి, ప్రతిపక్ష మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి సమస్త బలగాలను మోహరించి గెలుపుకోసం శ్రమిస్తున్నాయి. ఎంవీఏలో శివసేన(ఠాక్రే), ఎన్సీపీ (పవార్), కాంగ్రెస్ పార్టీలున్నాయి. ఆ కూటమి తరఫున శరద్ పవార్, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవలి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం త్రుటిలో తప్పిపోవటంతో మహారాష్ట్రను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోవద్దని కాంగ్రెస్ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది. దీంట్లో భాగంగానే తమ పార్టీ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకల నుంచి సీఎంలు, డిప్యూటీ సీఎంను రప్పించి.. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ గ్యారెంటీల అమలు గురించి ప్రజలకు చెప్పిస్తోంది. కాంగ్రెస్ రాష్ట్రాల్లో హామీలను అమలు చేయటంలేదన్న ప్రధాని మోదీ తదితర బీజేపీనేతల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ ఈ వ్యూహరచన చేసింది. కాగా, ప్రచారపర్వంలో ఎంవీఏకు దీటుగా మహాయుతి నేతలు నితిన్ గడ్కరీ, దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ షిండే ప్రచారం చేయలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహాయుతిలో బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్‌పవార్) పార్టీలున్నాయి. రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దిక్కైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విదర్భ ప్రాంతంలో తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుండగా, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్.. తన నియోజకవర్గం నాగ్‌పూర్ సౌత్ వెస్ట్‌లో విజయం కోసం చెమటోడుస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ తరఫున ప్రచారం చేసే గట్టి స్థానిక నేతలెవరూ లేని పరిస్థితి నెలకొనడంతో ప్రధాని మోదీ శుక్రవారం నుంచి స్వయంగా రంగంలోకి దిగారు. ఆయనతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉత్తర మహారాష్ట్రలోని ధులే సభతో ప్రచారానికి శ్రీకారంచుట్టిన మోదీ.. సుడిగాలిలా పలు బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొనడంతో మహాయుతికి ఊపు వచ్చింది. ఇప్పటి వరకూ నాగ్‌పూర్, నాసిక్, నాందేడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన మోదీ.. ఆర్టికల్ 370 రద్దును కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న ఆ పార్టీ గతంలో అంబేడ్కర్‌ను అవమానించిందన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సైతం కాంగ్రెస్ అవమానించిందన్నారు. మరఠ్వాడాలో రైతుల సమస్యలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. మరోవైపు 'విడిపోతే హతమవుతాం' అంటూ హిందువులను ఉద్దేశించి యోగి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి ఆశించిన ఫలితాలు సాధించకపోవటానికి కారణం వోట్ జిహాద్ అంటూ ఫడణవీస్ చేసిన వ్యాఖ్యలపైన ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. మరోసారి ఆ విధంగా మాట్లాడితే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది. లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు ఎంవీఏ కూటమికి ఓట్లు వేశారన్న సంగతిని చెప్పటానికి ఫడణవీస్ వోట్ జిహాద్ అనే పదం వాడారు. ముస్లింలకు 10% రిజర్వేషన్ కల్పిస్తే ఎంవీఏకు మద్దతిస్తామంటూ ఉలేమా కౌన్సిల్ చేసిన ప్రతిపాదననూ బీజేపీ వివాదాస్పద అంశంగా మారుస్తోంది. దీనిపై కాంగ్రెస్ రాష్ట్రఅధ్యక్షుడు నానా పటోలే స్పందిస్తూ.. ఇది పచ్చి అబద్ధమని, తాము ఆ డిమాండ్‌కు అంగీకరించలేదన్నారు. ఇక కాంగ్రెస్ గ్యారెంటీల పేరుతో ప్రజలకు ఇస్తున్న హామీలను ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయ డంలేదని మోదీ చెప్పగానే.. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలు రేవంత్‌రెడ్డి, సుఖ్వీందర్‌సింగ్ సుక్కు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లను మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలోకి కాంగ్రెస్ తెచ్చింది. హామీలన్నీ నెరవేరుస్తున్నామని, కావాలంటే తమ రాష్ట్రాలకు వచ్చి చూడాలని వీరుముంబైలో విలేకర్ల సమావేశంలో మోదీకి సవాల్ విసిరారు.

దళితులు, ముస్లింలు కీలకం

లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాల్లో ఎంవీఏ కూటమి 31స్థానాల్లో విజయం సాధించింది. ఈ గెలుపునకు ప్రధానంగా సహకరించింది ముస్లిం, దళిత ఓటుబ్యాంకు మద్దతేనన్న విశ్లేషణలువచ్చాయి. గిరిజనులు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత, కొన్ని ప్రాంతాల్లో మరాఠాలూ భారీ ఎత్తున ఎంవీఏకు మద్దతిచ్చినట్లు వెల్లడైంది. ఈ కూటమి ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ఓటుబ్యాంకుపై ఆశలు పెట్టుకుంది. 30 నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా 10-40% వరకు ఉంది. పలు ముస్లిం సంస్థలు ఎంవీఏను బలపరుస్తున్నాయి.



కెనడా పోలీసుల అదుపులో ఖలిస్థాన్ ఉగ్రవాది డల్లా

న్యూఢిల్లీ, నవంబరు 10: ఖలిస్థాన్ ఉగ్రవాది అర్షదీప్ డల్లాను కెనడాలోని హాల్టన్ రీజనల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అతడు హర్దీప్ సింగ్ నిజ్జర్ అనుచరుడిగా గుర్తింపు పొందాడు. డల్లాకు పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ, లష్కర్ ఏ తోయిబాతోను సంబంధాలు ఉన్నట్టు గతంలోనే ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్, ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. మరోవైపు, డల్లాకు అనుచరులుగా వ్యవహరిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఆదివారం పంజాబ్ పోలీసులు తెలిపారు. గత నెలలో ఫరీద్‌కోట్‌లో గురుప్రీత్ సింగ్ హరి నవ్‌ను, మధ్యప్రదేశ్‌లో మరో వ్యక్తిని హత్య చేసిన ఘటనలో ఆదిత్య కపూర్ అలియాస్ మఖాన్, రవీందర్ సింగ్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా, కెనడాలో హిందూ ఆలయాలపై దాడులకు నిరసనగా ఆదివారం ఢిల్లీలోని కెనడా రాయబార కార్యాలయం వద్ద వందలాది మంది హిందువులు, సిక్కులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

హేమాహామీలు

(మొదటి పేజీ తరువాయి)

గమనార్హం..! నైపుణ్య గణన నిర్వహించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని అమిత్‌షా.. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి బాలికలకు ఉచితంగా టీకాల కార్యక్రమాన్ని ఖర్గే ప్రకటించారు. మహారాష్ట్రలో మతమార్పిడులను నిరోధించేలా కఠిన చట్టాలను తెస్తామని షా.. కులగణన నిర్వహించి తీరుతామని ఖర్గే ఉద్ఘాటించారు. కాగా.. ఈ నెల 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. 23న ఫలితాలు విడుదలవుతాయి.

మహాయుతి హామీలివే..

- వృద్ధాప్య పింఛన్లు రూ.2,100కు పెంపు
- 'లడ్కీ బెహన్ స్కీమ్' కింద ప్రతి నెల ఇస్తున్న రూ.1500ను రూ.2100కు పెంపు
- 2027నాటికి రాష్ట్రంలో 50లక్షల మంది మహిళలను లక్షాధికారులను చేయడం
- స్కిల్ సెన్సస్ నిర్వహించి, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా యువతకు శిక్షణ
- యువతకు 25 లక్షల కొత్త ఉద్యోగాల కల్పన
- 20 లక్షల మంది విద్యార్థులకు నెలకు రూ.10 వేల చొప్పున స్టైపండ్
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కృత్రిమ మేధ(ఏఐ) శిక్షణ
- వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక సాయం
- 45వేల గ్రామాలకు కొత్త రోడ్ల నిర్మాణం.. ప్రజలకు ఆరోగ్య బీమా
- వ్యవసాయ రుణాల మాఫీ, ఆహార భద్రతకు హామీ, నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణ. ఎరువులపై ఎస్‌జీఎస్టీ తిరిగి చెల్లింపు.
- పునరుత్పాదక ఇంధనంపై దృష్టిసారిస్తూ విద్యుత్తు బిల్లులను 30% మేర తగ్గించేందుకు చర్యలు
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 'విజన్ మహారాష్ట్ర 2028' విడుదల
- 50 లక్షల మంది మహిళలను 2027లోగా లక్షాధికారులను చేయడం
- మహారాష్ట్రను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం

ఎంవీఏ హామీలు..

- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి 9-16 సంవత్సరాల వయసు గల బాలికలకు ఉచితంగా టీకాల పంపిణీ
- రాష్ట్రంలో కులగణన
- మహిళా ఉద్యోగులకు రుతుస్రావ సమయంలో రెండు ఐచ్ఛిక సెలవులు
- స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ) సాధికారతకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ
- మహిళలకు ఏటా రూ.500కే ఆరు గ్యాస్ సిలిండర్లు
- మహిళా భద్రతకు 'నిర్భయ్ మహారాష్ట్ర' పాలసీ
- 18వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న బాలికలకు రూ.లక్ష ఆర్థిక సాయం
- రైతులకు రూ.3 లక్షల వరకు రుణమాఫీ. సక్రమంగా రుణాలను తిరిగి చెల్లించేవారికి రూ.50 వేల ప్రోత్సాహకం
- యువజన సంక్షేమానికి యూత్ కమిషన్ ఏర్పాటు. డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి
- 2.5 లక్షల ప్రభుత్వ కొలువుల భర్తీ
- ఎంఎస్ఎంఈలకు చేయూతనిచ్చేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ
- ప్రతినెలా 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు. నెలకు 300 లోపు యూనిట్లు వాడేవారికి వర్తింపు.

51వ సీజేఐగా జస్టిస్ ఖన్నా నేడు బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ, నవంబరు 10: సుప్రీంకోర్టు 51వ సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. 1960 మే 14న జన్మించిన ఆయన ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయవాద విద్యను అభ్యసించారు. 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆయన ఆర్టికల్ 370 రద్దుకు సమర్థన, ఎన్నికల బాండ్ల పథకం రద్దు, ఈవీఎంలపై పిటిషన్ కొట్టివేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు సహా అనేక చారిత్రక తీర్పులిచ్చిన ధర్మాసనాలలో భాగంగా ఉన్నారు. ఇప్పటి వరకు సీజేఐగా ఉన్న జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టులో అంత్యత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఖన్నా ఆ బాధ్యతలు చేపట్టనున్నారు.

కశ్మీర్‌లో ఎదురు కాల్పుల్లో

ఆర్మీ అధికారి వీరమరణం



శ్రీనగర్, నవంబరు 10: జమ్మూ-కశ్మీర్‌లోని కిష్టావర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ ఆర్మీ అధికారి ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. అడవిలో ఉగ్రవాదుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతుండగా ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 16 కార్ప్స్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ నాయబ్ సుబేదార్ రాకేశ్ కుమార్ మరణించారు. గురువారం సాయంత్రం నజీర్ అహ్మద్, కుల్దీప్ కుమార్ అనే విలేజ్ డిఫెన్స్ గార్డులను ఉగ్రవాదులు కిడ్నాప్ చేసి, హత్య చేశారు. దాంతో ఉగ్రవాదుల కోసం కుంట్వారా, కేశ్వాన్ అడవుల్లో ఆర్మీ, పోలీసు విభాగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. శనివారం నుంచి కిష్టావర్‌లోని భార్త్ రిడ్జ్ వద్ద సంయుక్త ఆపరేషన్ మొదలయింది. ఆదివారం అడవిలో ఉగ్రవాదులు, జవాన్లు ఎదురుపడడంతో కాల్పులు చోటుచేసుకున్నాయి.

మాస్కోపై 34 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

మాస్కో, నవంబరు 10: రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. ఆదివారం 70 డ్రోన్లను ప్రయోగించి దాడికి యత్నించింది. రాజధాని మాస్కోను లక్ష్యంగా చేసుకొని 34 డ్రోన్లతో దాడి చేసిందని, యుద్ధం మొదలైనప్పటి నుంచి మాస్కోపై జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి అని రష్యా సైన్యం ప్రకటించింది. అయితే ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశామని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు చెప్పారు.

దక్షిణాదికి దండన!

» జనాభాను నియంత్రించినప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా నష్టం

న్యూఢిల్లీ, నవంబరు 10: జనసంఖ్య విషయంలో భారతదేశం చైనాను దాటేసి అగ్రస్థానానికి చేరుకుంది! అయినా.. ఎక్కువ మంది పిల్లలను కనాలంటూ ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపునివ్వడం సంచలనం సృష్టించింది!! నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదితో పోలిస్తే అధిక జనాభా ఉండే ఉత్తరాది రాష్ట్రాల ఎంపీ సీట్లు పెరుగుతాయన్న ఆగ్రహం స్టాలిన్‌దైతే.. యువ జనాభా తగ్గిపోవడం వల్ల కలిగే నష్టాలపై ఆందోళన చంద్రబాబుది. మొదట్నుంచీ జనాభా నియంత్రణ విషయంలో ముందంజలో ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో.. వృద్ధుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ), ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్(ఐఐపీఎస్) ఇటీవల విడుదల చేసిన 'ఇండియా 2023 ఏజింగ్ రిపోర్ట్' ప్రకారం.. 2021లో దేశ జనాభాలో 10.1 శాతంగా ఉన్న వృద్ధుల (60ఏళ్లు దాటిన వారి) సంఖ్య 2036 నాటికి 15 శాతానికి, 2050 నాటికి 20 శాతానికి పెరగనుంది. అంటే ఇప్పటితో పోలిస్తే అప్పటికి దేశ జనాభాలో యువకుల సంఖ్య తగ్గి వృద్ధుల సంఖ్య ఎక్కువయిపోతుందన్నమాట. కేరళలో 2021 2036 నాటికి వృద్ధుల జనాభా 16.5 శాతానికి చేరుతుందని యూఎన్ఎఫ్‌పీఏ అంచనా. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రేటు 19శాతం, తమిళనాట 20.8శాతంగా ఉంది. అదే బిహార్ జనాభాలో వృద్ధుల సంఖ్య 2036 నాటికి 11శాతంగానే ఉంటుందని అంచనా. యువ జనాభా సంఖ్య అధికంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎల్లప్పుడూ పొందుతూ ఉండాలంటే.. అందుకు సంపూర్ణ సంతాన సాఫల్య రేటు (టీఎఫ్ఆర్- ఒక మహిళ సగటున కనే పిల్లల సంఖ్య) కీలకం. 1950లో దేశ సంపూర్ణ సంతాన సాఫల్య రేటు సగటు 6.1గా ఉండేది. 1980 నాటికి అది 4.6కు.. 2022 నాటికి 2.01కి పడిపోయింది. తమిళనాట ఈ రేటు 1.4గా ఉండగా.. ఏపీ, తెలంగాణ, కేరళలో 1.5గా ఉంది. 2017-18లో దేశవ్యాప్తంగా వృద్ధుల హృద్రోగ చికిత్సకు పెట్టిన మొత్తం ఖర్చులో దక్షిణాది రాష్ట్రాల వ్యయం 32శాతం (జనాభాలో ఈ రాష్ట్రాల వాటా కేవలం 20%)గా ఉండగా.. ఉత్తరాదిన హిందీ మాట్లాడే ఎనిమిది రాష్ట్రాల (దేశ జనాభాలో సగం ఈ రాష్ట్రాల్లోనే ఉన్నారు) వ్యయం కేవలం 24 శాతం మాత్రమే.

సీట్లూ తగ్గుతాయ్!

దేశ ప్రయోజనాల నిమిత్తం జనాభా నియంత్రణలో చురుగ్గా వ్యవహరించిన పాపానికి ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా కూడా మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పార్లమెంటు సీట్ల సంఖ్య పెంపుపై ఉన్న స్తంభన.. 2026 నాటికి ముగుస్తుంది. ఆ తర్వాత.. తాజా జనగణన ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉంటుంది. దీనివల్ల సహజంగానే జనాభా అధికంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎంపీ సీట్లు భారీగా పెరుగుతాయి. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో ఎంపీ సీట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 174 నుంచి 284కు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో దక్షిణాదిన కొన్ని రాష్ట్రాలకు ఉన్న సీట్లే పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా దేశ రాజకీయాల్లో, విధానపరమైన నిర్ణయాలను ప్రభావితం చేయడంలో.. దక్షిణాది రాష్ట్రాల మాటకు విలువ లేకుండా పోయే ముప్పు ఏర్పడుతుంది. సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం ఏర్పడి విభజన రాజకీయాలకు తెరలేచే ప్రమాదమూ లేకపోలేదనే ఆందోళన ఉంది. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన ఆదాయంలో రాష్ట్రాలకు కేంద్రం పంచే వాటా జనాభా ఆధారంగానే కాబట్టి.. దక్షిణాది వాటా ప్రస్తుతం ఉన్న 18% నుంచి 16.2 శాతానికి తగ్గిపోతుంది. ఇలా.. అన్ని రకాలుగా దక్షిణాది రాష్ట్రాలు నష్టపోయే ప్రమాదం ఉంది.

స్వింగ్‌లో ట్రంప్ క్లీన్ స్వీప్

» మొత్తం 7 స్వింగ్ రాష్ట్రాలు ట్రంప్‌కే జై

వాషింగ్టన్, నవంబరు 10: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 7 స్వింగ్ రాష్ట్రాల్లో విజయం సాధించి ట్రంప్ క్లీన్ స్వీప్ చేశారు. తాజాగా ఆరిజోనాలో విజయం సాధించి మరో 11 ఓట్లను తన ఖాతాలో వేసుకున్నారు. రిపబ్లికన్‌ల తరఫున బరిలో నిలిచిన డొనాల్డ్ ట్రంప్‌కు మొత్తం 312 ఎలక్టోరల్ ఓట్లు రాగా డెమోక్రాట్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌కు 226 ఓట్లు వచ్చాయి. కాగా, తన తాజా కార్యవర్గంలోకి నిక్కీ హేలీ, మైక్ పాంపియోలను తీసుకోవడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టిన ట్రంప్ గతంలో వారు దేశానికి చేసిన సేవలకు ధన్యవాదాలు తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో మాజీ రాయబారిగా పనిచేసిన నిక్కీ హేలీ.. ట్రంప్ తాజా నిర్ణయంపై స్పందించారు. గతంలో ట్రంప్‌తో కలిసి పనిచేయడం తనకు ఆనందాన్నిచ్చిందని, రాబోయే నాలుగేళ్లలో అమెరికాను మరింత పటిష్ఠం చేయాలని ఆమె ఆకాంక్షించారు. భారత సంతతికి చెందిన నిక్కీ హెలీ గతంలో సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేశారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌తో పాటు మాజీ రాయబారి రిక్ గ్రెనెల్, ఫ్లోరిడా సెనేటర్ మార్కో రుబియో, రాబర్ట్ ఎఫ్.కెన్నెడీలకు ట్రంప్ కార్యవర్గంలో కీలక పదవులు దక్కే అవకాశం ఉంది.

చుట్టూ సైబర్ దొంగలు.. ఆదమరిస్తే అంతే!

» పార్ట్ టైం ఉద్యోగాల నుంచి హనీ ట్రాప్ దాకా.. ఎన్నెన్నో మార్గాల్లో వల వేస్తున్న నేరస్థులు
» పలు సూచనలతో యూజీసీ హ్యాండ్ బుక్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు లాంటి వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారా? భారీ డిస్కౌంట్ల పేరుతో ఊరించే ప్రకటనల లింక్‌లు క్లిక్ చేస్తున్నారా? అయితే మీరు సైబర్ మోసగాళ్ల వలలో చిక్కే ప్రమాదం ఉన్నట్టే. దేశంలో సైబర్ మోసాలు పెద్దఎత్తున పెరుగుతున్నాయి. ఎంతోమంది వీటి బారిన పడి లక్షలు, కోట్లు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల్లో అవగాహన కలిగించటం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 'ఏ హ్యాండ్ బుక్ ఆన్ బేసిక్స్ ఆఫ్ సైబర్ హైజీన్' పేరుతో ఇటీవల ఒక ఈ-బుక్ విడుదల చేసింది. సైబర్ నేరగాళ్లు ఏ విధంగా మోసాలకు పాల్పడుతున్నారు, వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఎలా వ్యవహరించాలన్న అంశాల్ని దీంట్లో తెలియజేశారు. ఆ వివరాలు..

సైబర్ నేరాలు: పార్ట్ టైం ఉద్యోగాలు, వర్క్‌ఫ్రం హోం, లైక్‌లు, షేర్లు, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, ఫెడెక్స్ పార్సిల్, డ్రగ్స్ కేసు, డిజిటల్ అరెస్ట్.. ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. హనీ ట్రాప్, సెక్స్‌టార్షన్, ట్రోలింగ్, పోర్నోగ్రాఫ్, కెరీర్ తదితర మార్గాల్లోనూ వారు కన్నేస్తున్నారు. ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న వారినీ టార్గెట్ చేసుకొని మెసేజీలు, కాల్స్ చేస్తున్నారు. యాప్‌లను ఇన్‌స్టాల్ చేసే సమయంలో అవతలి వారికి యాక్సెస్ ఇస్తే సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- పుట్టినతేదీ, గ్రాడ్యుయేషన్ పూర్తయిన ఏడాది, తల్లిదండ్రుల పేర్లు.. లాంటి వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియాలో పెట్టొద్దు. ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతా, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు పంచుకోవద్దు.
- స్పామ్ ఈ-మెయిల్స్, సోషల్ మీడియాలో అనుమానాస్పద ఫ్రెండ్ రిక్వెస్టులపై స్పందించవద్దు. అనుమానాస్పద వెబ్‌సైట్ లింకులను తెరవొద్దు. తెలియని మొబైల్ అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకోవద్దు.
- ఉచితం, భారీ డిస్కౌంట్లు అంటూ వచ్చే ప్రకటనలకు అనాలోచితంగా స్పందించవద్దు.
- అనేక మొబైల్ యాప్‌లు.. డౌన్‌లోడ్ చేసుకునే ముందు కాంటాక్ట్, కెమెరా, క్యాలెండరు యాక్సెస్ (అనుమతి) అడుగుతాయి. ఆయా యాప్‌ల గురించి క్షుణ్ణంగా తెలిస్తేనే వాటికి అనుమతించాలి. అనవసరంగా యాక్సెస్ అడిగే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దు.
- ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ప్రతిసారీ పాస్‌వర్డ్ నమోదు చేయకుండా.. 'రిమెంబర్ మీ', 'రిమెంబర్ పాస్‌వర్డ్' వంటి ఆప్షన్లు ఉంటాయి. వాటిని సేవ్ చేయడం అంటే మోసాలకు అవకాశం ఇచ్చినట్టే.
- ఇంట్లో వాడుతున్న ఏదైనా ఉపకరణం పాడైతే సదరు కంపెనీకి ఫిర్యాదు చేసేందుకు కస్టమర్ కేర్ నెంబర్ కోసం గూగుల్‌లో వెదుకుతారు. ఇటీవలి కాలంలో ఆయా కంపెనీల కస్టమర్ కేర్ నెంబర్ల పేరుతోనూ సైబర్ మోసగాళ్లు వల పన్ని ఉంటున్నారు. కాబట్టి, కంపెనీ నెంబర్ కోసం కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌నే సందర్శించాలి.
- పబ్లిక్ వైఫై, ఫ్రీ వైఫై జోన్లలో అందించే ఇంటర్‌నెట్‌తో ఆర్థిక లావాదేవీలు, చెల్లింపులు జరపొద్దు. వ్యక్తిగత ఇంటర్‌నెట్‌నే వినియోగించాలి.
- వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సన్నిహితులతో కూడిన ఫొటోలు, వీడియోలు, ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, క్రెడిట్, డెబిట్ కార్డుల లాంటి డాక్యుమెంట్లు, వైద్యానికి సంబంధించిన సమాచారం.. లాంటివి సెల్‌ఫోన్లలో పెట్టుకోకపోవడమే మేలు.

సనాతన ధర్మశాస్త్ర ప్రబోధకుడు.. కందాడై రామానుజాచార్య కన్నుమూత

» టీటీడీ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలు
» అష్టాదశ పురాణాలపై.. మూలగ్రంథం ఆధారంగా ప్రబోధాలు
» వేద సాహిత్య రచన, ప్రవచనంలో ప్రావీణ్యుడు



హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంస్కృతంలో పోగుపడిన భారతీయ సనాతన ధర్మశాస్త్ర విజ్ఞానాన్ని పిడికిట పట్టి.. తెలుగు వారి లోగిళ్ల ముందు రాశిగా పోసిన వ్యాకరణ పండితుడు డాక్టర్ కందాడై రామానుజాచార్య(81) ఇకలేరు. ధర్మ అధ్యయనం, ధర్మ ప్రబోధమే ఊపిరిగా తుది వరకు జీవించిన ఆయన.. కొంతకాలంగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుమతి, కుమారుడు వనమాలి, కుమార్తె హరిప్రియ ఉన్నారు. మరో కుమారుడు మురళి ఏడాది క్రితం గుండెపోటుతో కన్నుమూశారు. రామానుజాచార్య స్వస్థలం ఉమ్మడి నల్లగొండ జిల్లా చీదేళ్ల. తన పదో ఏట హైదరాబాద్, సీతారాంబాగ్‌లోని వేదాంతవర్ధిని సంస్కృత పాఠశాలలో వేదాభ్యాసాన్ని ప్రారంభించారు. కోయిల్ కందాడై శఠకోప రామానుజాచార్య శిష్యరికంలో వ్యాకరణ విద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ(సంస్కృతం) పూర్తిచేశారు. అలంకార మణిహారం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను.. పీహెచ్‌డీలో బంగారు పతకాన్ని అందుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అనుబంధంగా ఉన్న.. శ్రీ వెంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృత కళాశాలలో అధ్యాపకుడిగా, ప్రధానాచార్యుడిగా, ప్రత్యేక అధికారిగా 2004 వరకు సుదీర్ఘ కాలం సేవలందించారు. టీటీడీ ధర్మప్రచార మండలి సభ్యుడిగా కొంతకాలం కొనసాగారు. అష్టాదశ పురాణాలపై మూల గ్రంథం ఆధారంగా ప్రవచనాలు ఇవ్వగలిగిన అతి కొద్ది మంది ధర్మ ప్రచారకర్తలలో కందాడై ఒకరు.

వేద సాహిత్య సేవ

రామాయణ, మహాభారత, భాగవతాలు, పురాణ, ఇతిహాసాలపై కందాడై కొన్ని వందల ప్రవచనాలిచ్చారు. పలు టెలివిజన్, వార్తా పత్రికల్లో 'ధర్మ సందేహా లు' పేరుతో వేల మంది అనుమానాలకు సశాస్త్రీయ వివరణ తో సమాధానాలిచ్చారు. ఎన్నో సనాతన ధర్మశాస్త్ర గ్రంథాలను సంస్కృతం నుంచి తెలుగులోకి తనదైన వ్యాఖ్యానంతో అనువదించారు. వాటిల్లో భాగవతం, పద్మపురాణం, నారద పురాణం, కూర్మ పురాణం, స్కాంద పురాణం, హరివంశ మహాపురాణం, పరాశర స్మృతి, తెలుగు మాసాల వైశిష్ట్యాన్ని తెలిపే రచనలు ప్రచురితమయ్యాయి. ఏకాదశి వైభవంలోని పన్నెండు వేల శ్లోకాలను తెలుగులోకి అనువదించారు. కందాడై రామానుజాచార్య భౌతిక కాయాన్ని.. మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచార్య, ఆధ్యాత్మిక వేత్తలు అహోబిల రామానుజ జీయరు, రామచంద్ర జీయరు, దేవనాథ జీయరు, శ్రీవైష్ణవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కండ్లకుంట యాదగిరాచార్యులు సందర్శించి, నివాళులు అర్పించారు. చిన్న జీయరు స్వామి శేష వస్త్రం పంపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కందాడై రామానుజాచార్య అంత్యక్రియలు ఆదివారం నాగోల్‌లోని శ్మశాన వాటికలో ముగిశాయి.

జీర్ణకోశ వ్యాధులకు ఎఫ్ఎంటీ చికిత్స

- త్వరలో స్టూల్ బ్యాంకులు రానున్నాయి
- ఈ థెరపీలో ఆరోగ్యవంతుల మలం నుంచి సేకరించిన 'గట్ మైక్రోబయోమ్' వాడతారు
- ప్రయోగాత్మకంగా హైదరాబాద్ ఏఐజీలో ఎఫ్ఎంటీ థెరపీ
- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి
- హెచ్ పైలోరీ బ్యాక్టీరియాతో తస్మాత్ జాగ్రత్త
- నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ బ్యారీ మార్షల్


డాక్టర్ నాగేశ్వరరెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్ముందు జీర్ణ సంబంధమైన వ్యాధుల చికిత్సలో 'ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంట్ (ఎఫ్ఎంటీ) థెరపీలు కీలక పాత్ర పోషిస్తాయని, ఇందుకోసం స్టూల్ (మలం) బ్యాంకులు అందుబాటులో రానున్నాయని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. శని, ఆదివారాల్లో ఏఐజీలో 8వ వార్షిక వైద్య సదస్సు నిర్వహించారు. జీర్ణకోశ వ్యాధుల చికిత్సలో పేగుల్లోని బ్యాక్టీరియా (గట్ మైక్రోబయోమ్) ప్రాధాన్యత అంశంపై డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడారు. ఆరోగ్యవంతుల మలం నుంచి ప్రత్యేక ప్రక్రియ ద్వారా సేకరించిన గట్ మైక్రోబయోమ్‌తో ఎఫ్ఎంటీ థెరపీ నిర్వహిస్తారని తెలిపారు. ఈ గట్ మైక్రోబయోమ్‌ను రోగి జీర్ణశయాంతర పేగుల్లోకి ప్రవేశపెడతారని, ఈ విధానం క్లిష్టమైన ఇన్ఫెక్షన్లను నయం చేయడంలో సహాయపడుతుందన్నారు. విదేశాల్లో నిర్వహించిన అధ్యయనాల్లో ఎఫ్ఎంటీ థెరపీ ద్వారా రోగుల గట్ మైక్రోబయోమ్‌లో గణనీయమైన మెరుగుదల కనిపించినట్లు తేలిందని వివరించారు. దీనిపై తాము మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నామని, కొందరికి ప్రయోగాత్మకంగా ఏఐజీ ఆస్పత్రిలో ఎఫ్ఎంటీ థెరపీ ప్రారంభించామన్నారు. దీని ద్వారా ప్రధానంగా ఐబీడీ (ఇన్‌ఫ్లమేటరీ బౌల్ డిసీజ్), ఐబీఎస్ (ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్), సీడీఐ (క్లోస్ట్రిడియమ్ డిఫిసిల్ ఇన్ఫెక్షన్) వంటి వ్యాధులను నయం చెయ్యవచ్చన్నారు. గట్ మైక్రోబయోమ్ ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుందని, మనం తినే ఆహారం నుంచి పోషకాలను గ్రహిస్తుందన్నారు. మన పొట్ట నిండా మంచి, చెడు బ్యాక్టీరియాలు కోట్లాదిగా ఉంటాయని, మల పరీక్ష ద్వారా వాటి ప్రొఫైల్ చేయవచ్చని డాక్టర్ నాగేశ్వరరెడ్డి చెప్పారు. మంచి, చెడు బ్యాక్టీరియాల పోరాటంలో చెడుది పట్టు సాధిస్తే మనిషి అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. అనవసరంగా సిజేరియన్ చేయడం, బిడ్డకు పాలివ్వక పోవడం, యాంటీబయాటిక్స్ అతిగా వినియోగించడం వల్ల చెడు బ్యాక్టీరియా వ్యాపిస్తుందన్నారు. మంచి బ్యాక్టీరియాకు పెరుగు మంచి మూలమన్నారు. బయట కొన్న పెరుగు కంటే ఇంట్లో చేసిన పెరుగు మంచిదన్నారు. కూరగాయలు, పండ్లలో ఉండే ప్రీబయోటిక్స్, టైరోసిన్ కలిగిన బాదం కూడా మంచి బ్యాక్టీరియాకు వనరులని తెలిపారు. స్థూలకాయంతో బాధపడుతున్న వారు కఠిన ఆహార నియమాలు పాటించినా, తగినంత వ్యాయామం చేసినప్పటికీ బరువు తగ్గకపోతే చెడు బ్యాక్టీరియా కారణమని భావించాల్సి ఉంటుందన్నారు.

ప్రమాదకరంగా 'హెచ్ పైలోరీ'

భారతదేశంలో ప్రమాదకరమైన హెచ్ పైలోరీ బ్యాక్టీరియా పెరుగుతోందని, దీనిపై ప్రజల్లో చైతన్యం అవసరమని నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ బ్యారీ మార్షల్ సూచించారు. అల్సర్లు, క్యాన్సర్లకు కారణమయ్యే ఈ బ్యాక్టీరియా శరీరంలో ఉన్నట్లు త్వరగా గుర్తించగలిగితే రెండు వారాల చికిత్సతో పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. దీని బారినపడకుండా ఉండాలంటే పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవడం, చేతుల శుభ్రత పాటించడం అవసరమన్నారు. తెలంగాణ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

- నోబెల్ గ్రహీత బ్యారీ మార్షల్

ఏలూరు మెడికల్ కాలేజీకి ఎల్లాప్రగడ పేరు

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్యరంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఏలూరు కాలేజీకి ఆయన పేరు పెడుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏలూరు కాలేజీకి డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరును తాను ప్రతిపాదించగానే సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారంటూ ఆయనకు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

'పల్లె పండుగ' పనులు సంక్రాంతికి పూర్తవ్వాలి

- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'పల్లె పండుగ' పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా అక్టోబరు మూడో వారంలో మొదలైన పనులు సంక్రాంతి పండుగ లోపు పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. పనుల స్థితిగతులపై అధికారులతో ఆరా తీసిన పవన్ త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత ఇంజనీర్లతో పాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఎప్పటి కప్పుడు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రధాని దృష్టికి 'విశాఖ ఉక్కు సెంటిమెంట్'

- త్వరితగతిన పోలవరం పూర్తి చేస్తాం: కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ


విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

జంగారెడ్డిగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయి. ప్రధాని మోదీ రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ఖర్చయినా కేంద్రమే భరించి ప్రాజెక్టును పూర్తి చేస్తాం' అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆలోచన ప్రధాని మోదీది కాదు. ఆంధ్రులకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సెంటిమెంట్ అని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లాం' అన్నారు.

విజిలెన్స్ కేసులు నిలిపివేయాలి: పీఆర్ ఇంజనీర్ల సంఘం

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో (2014-19)లో జరిగిన సిమెంట్ రోడ్ల పనులపై, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపుతో పెట్టిన ఏసీబీ, విజిలెన్స్ కేసులను తక్షణమే నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ పంచయాతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. సంఘ సమావేశం ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో నిర్వహించారు. తిరుపతిలో డిసెంబరు 15న జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర, కార్యదర్శి బి.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సాధికార సంస్థకు గుల్బెంకియన్ ఫౌండేషన్ రూ.కోటి విడుదల

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పోర్చుగల్‌కు చెందిన కలౌస్టే గుల్బెంకియన్ ఫౌండేషన్ ఏపీ రైతుసాధికార సంస్థకు రూ.కోటి విడుదల చేసింది. ప్రకృతి వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న రైతుసాధికార సంస్థకు ఇటీవల గుల్బెంకియన్ ఫౌండేషన్ అవార్డు అందజేసింది. ఈ అవార్డు కింద ప్రకటించిన రూ.3 కోట్లలో మూడో వంతు నిధులు విడుదల చేసింది. ఈ నిధులను ప్రపంచస్థాయిలో ప్రకృతి సేద్య ప్రోత్సాహానికి వినియోగించాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు రైతుసాధికార సంస్థ వర్గాలు తెలిపాయి.

ముగిసిన హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హేతువాద, నాస్తికోద్యమంతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరం అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జరుగుతున్న హేతువాద సంఘం రాష్ట్ర మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడారు. విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ సైన్స్‌తోనే సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం హేతువాద సంఘం జాతీయ, రాష్ట్ర నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడుగా నార్నె వెంకట సుబ్బయ్య(ఏపీ), ఉపాధ్యక్షులుగా పి.విష్ణుమూర్తి(యానాం), టి.బాలచంద్రం(తెలంగాణ)లను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా ఎంకే బేగ్ (ప్రకాశం) ఎన్నికయ్యారు.

మెమో 57ను అమలు చేయండి

విజయవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అమలుకు ముందు నియమించినా, అనివార్య కారణాలతో సీపీఎస్‌లోకి వచ్చిన వారికి పాత పెన్షన్ పునరుద్ధరించే విషయంలో కేంద్రం ఇచ్చిన సెంట్రల్ మెమో 57ను ఎప్పుడు అమలు చేస్తారని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీఐడీసీ చైర్మన్‌గా డేగల ప్రభాకర్

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా డేగల ప్రభాకర్‌ను నియమిస్తూ పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభాకర్ బాధ్యతలు తీసుకున్న రోజు నుంచి రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

భీమవరంలో ఐదో రోజూ ఐటీ దాడులు

భీమవరం క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో ఐదో రోజైన ఆదివారం కూడా ఆదాయపన్ను శాఖ దాడులు కొనసాగాయి. శ్రీనివాస్ సన్నిహితులు, వ్యాపార భాగస్వాములు ఏడుగురు నివాసాల్లోనూ సోదాలు చేసి, ఒకరి నివాసం నుంచి 10 కిలోల బంగారం, భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

18న టీటీడీ బోర్డు తొలి సమావేశం

తిరుమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి తొలి సమావేశం ఈ నెల 18వ తేదీన జరుగనుంది. ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవనంలో సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

శ్రీవారి సేవలో పార్లమెంటరీ కమిటీ

తిరుమల శ్రీవారిని పార్లమెంటరీ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ భర్తుహరి మహతాబ్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


లోకనాథం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్ట్ వరత్తూరులో అప్పుల బాధతో రైతు శీలం లోకనాథం(40) ఆత్మహత్యకు పాల్పడ్డారు. పంటనష్టాలు, అనారోగ్యం వల్ల చేసిన అప్పులు రూ.13 లక్షలకు చేరడంతో శనివారం రాత్రి పొలం వద్ద ఆయన పురుగుల మందు తాగారు. ఆస్పత్రికి తరలించగా అర్ధరాత్రి మరణించారు.

'గజ' దాడులకు ఇక చెక్!

- పొలాలు, జనావాసాలపై ఏనుగుల దాడుల కట్టడిపై ప్రభుత్వం దృష్టి
- చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కొత్తగా రెండు కుంకీ ఎలిఫెంట్ క్యాంపుల ఏర్పాటుకు చర్యలు
- శిక్షణ కోసం కర్ణాటకకు వెళ్లిన 21 మంది ట్రాకర్లు, ముగ్గురు అటవీ అధికారులు


శిక్షణ కోసం కర్ణాటకకు బయల్దేరిన ట్రాకర్లు, అటవీశాఖ అధికారులతో సీసీఎఫ్ యశోదాబాయి


రామకుప్పం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న ఏనుగుల దాడులను నిరోధించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కొత్తగా రెండు కుంకీ ఎలిఫెంట్ క్యాంపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. చిత్తూరు, అన్నమయ్య, శ్రీకాకుళం, విశాఖ జిల్లాకు చెందిన 21మంది ట్రాకర్లతోపాటు ముగ్గురు అటవీశాఖ అధికారులు శిక్షణ కోసం కర్ణాటకలోని దుబారీ కుంకీ ఎలిఫెంట్ క్యాంపునకు పంపించింది. చిత్తూరు జిల్లా కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలతోపాటు తిరుపతి, శ్రీకాకుళం, అన్నమయ్య, విశాఖ జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పంటపొలాలు, జనావాసాలపై గజరాజుల దాడులు నిత్యకృత్యమయ్యాయి. ఏనుగులు రోజూ ఎక్కడో చోట పంటలపై దాడులు చేస్తూ నష్టాన్ని కలిగిస్తున్నాయి. మందల నుంచి విడిపోయిన ఒంటరి గజరాజులు మదపుటేనుగులుగా మారి రైతుల ప్రాణాలను కూడా బలిగొంటున్నాయి. అదే సమయంలో పంటలను కాపాడుకునేందుకు పొలాల చుట్టూ ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు కంచెల బారిన పడి వాటి ప్రాణాలూ కోల్పోతున్నాయి. అంతేకాకుండా అడవుల నుంచి బయటకు వచ్చి రోడ్లను దాటే క్రమంలో వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నాయి. వీటన్నింటినీ నివారించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

కుంకీ ఆపరేషన్లే మార్గం

ఏనుగులు అడవుల నుంచి బయటకు రాకుండా చూసేందుకు కుంకీ (శిక్షణ పొందిన ఏనుగులు) ఆపరేషన్లే మార్గమని అటవీశాఖ భావించింది. ఇందులో భాగంగా కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను ఏపీకి తీసుకొచ్చేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య, అటవీ మంత్రితో చర్చలు జరిపారు. దీనిపై కర్ణాటక ప్రభుత్వంతో ఏపీ అటవీ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం ననియాలలో మాత్రమే కుంకీ ఎలిఫెంట్ క్యాంపు ఉంది. రాష్ట్రంలో ఎక్కడైనా గజరాజుల దాడులు తీవ్రమైతే ఏనుగులను కట్టడి చేసేందుకు ఈ క్యాంపు నుంచే కుంకీ ఏనుగులను తీసుకెళ్లాల్సి వస్తోంది. అంతేకాకుండా ఆపరేషన్ల నిర్వహణకు కర్ణాటక, తమిళనాడుల నుంచి మావటీలను తీసుకురావాలి. వీరికి స్థానికంగా అడవులపై అవగాహన లేకపోవడం వల్ల కుంకీ ఆపరేషన్లు ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. దీంతో చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక్కోటి చొప్పున కుంకీ ఎలిఫెంట్ క్యాంపుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేంద్రాల్లో కుంకీ ఏనుగుల సంరక్షణ, ఆపరేషన్లకు పలువురు ట్రాకర్లు, అటవీ అధికారులకు శిక్షణ ఇప్పించి.. మావటీలు, సహాయ మావటీలుగా తీర్చిదిద్దాలని అటవీ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చిత్తూరు, అన్నమయ్య, శ్రీకాకుళం, విశాఖ జిల్లాకు చెందిన 21 మంది ట్రాకర్లతోపాటు అటవీ శాఖ అధికారులు అవతారం, సుధాకర్, రమేష్‌లను కర్ణాటక రాష్ట్రంలోని నాగరహోలు అటవీ ప్రాంతం దుబారీ కుంకీ ఎలిఫెంట్ క్యాంపులో శిక్షణకు ఎంపిక చేశారు. శనివారం వీరికి ననియాల కుంకీ ఎలిఫెంట్ క్యాంపులో అనంతపురం రేంజ్ సీసీఎఫ్ యశోదాబాయి, చిత్తూరు డీఎఫ్‌ఓ భరణి, పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్‌లు దిశానిర్దేశం చేశారు. తొలి విడతగా నెల రోజుల శిక్షణలో మదపుటేనుగులను పట్టుకోవడం, ఏనుగుల జాడ గుర్తింపు, వాటి దారి మళ్లించడం, కుంకీ ఏనుగుల సంరక్షణ తదితర అంశాలు ఉంటాయని అధికారులు తెలిపారు. 21 మంది ట్రాకర్లు, ముగ్గురు అటవీ శాఖ అధికారులు దుబారీకి బయలుదేరి వెళ్లారు.

కొమరాడ మండలంలో ఏనుగుల సంచారం

పార్వతీపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వరకు పార్వతీపురం మండలంలో సంచరించిన గజరాజులు ఆదివారం కొమరాడ మండలానికి చేరుకున్నాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి కొమరాడ మండలం నందాపురం చేరుకున్న ఏనుగులు గ్రామ సమీపంలోని తోటల్లోకి వెళ్లిపోయాయి. మరోవైపు అటవీశాఖాధికారులు పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.


కొమరాడ మండలం నందాపురం సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

గల్ఫ్ బాధితులకు లోకేశ్ అండ

- కష్టాల్లో ఉన్నవారికి ఆపన్నహస్తం
- ఏజెంట్ల చేతిలో మోసపోయిన 20 మంది తెలుగువారికి విముక్తి
- స్వస్థలాలకు వచ్చేందుకు సాయం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పొట్ట కూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఎందరో తెలుగువాళ్లు మోసపోతున్నారు. అక్కడ కష్టాల్లో కూరుకుపోతున్నారు. ఇలాంటి బాధితులను ఆదుకునేందుకు మంత్రి నారా లోకేశ్ ఆపన్న హస్తం అందిస్తున్నారు. వారి చీకటి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సాయం చేస్తున్నారు. తన దృష్టికి వస్తున్న సమస్యలపై వెంటనే స్పందిస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా మోసపోయి గల్ఫ్‌లో చిక్కుకున్న దాదాపు 20 మందిని స్వస్థలాలకు రప్పించారు. తాము ఇబ్బందుల్లో ఉన్నామని వాట్సాప్, ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా మెసేజ్‌లు పంపిన వారికి అండగా నిలిచారు. ప్రభుత్వ పరంగానే కాక టీడీపీకి అనుబంధంగా పని చేసే ఎన్నారై టీడీపీ బృందాలను రంగంలోకి దించి కష్టాల నుంచి గట్టెక్కించారు. ఇలా లోకేశ్ నుంచి సాయం పొందిన బాధితులు.. ముగిసి పోయిందనుకున్న తమ జీవితాల్లో ఆయన వెలుగులు నింపారని అంటున్నారు.

జీవితాంతం గుర్తు పెట్టుకుంటా

హౌస్ మెయిడ్ పని కోసం ఏజెంట్ ద్వారా ఒమన్‌కు వెళ్లాక రాత్రింబవళ్లు పని చేయించేవారు. ముక్కు, నోటి నుంచి రక్తం వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఏజెంటు నన్ను మోసం చేసిన విషయాన్ని నా మామ, మరిదికి ఫోన్‌లో తెలియజేశాను. మా కుటుంబసభ్యులు రాజానగరంలో టీడీపీ నేతల ద్వారా ఈ విషయాన్ని మంత్రి లోకేశ్‌కు తెలియజేశారు. ఆయన ఎన్నారై టీడీపీ నాయకులు చెప్పడంతో వారు నేనున్న ప్రాంతాన్ని గుర్తించారు. తనకు లక్ష ఇస్తే కానీ నన్ను వెనక్కి పంపనంటూ అక్కడి ఏజెంట్ చెప్పారు. దీంతో ఆ దేశంలోని ఎంబసీతో మాట్లాడి నన్ను స్వస్థలానికి పంపారు. మంత్రి లోకేశ్ చేసిన సాయం జీవితాంతం గుర్తు పెట్టుకుంటా.

- కొత్తపల్లి ప్రియాంక, రఘునాథపురం, తూర్పుగోదావరి జిల్లా

లోకేశ్ చొరవతో స్వస్థలానికి

ఇంట్లో పని చేయడానికి అని చెప్పి సౌదీ అరేబియాకు తీసుకెళ్లి ఎడారిలో గొర్రెలు, ఒంటెలకు కాపలా పెట్టారు. సరైన భోజనం పెట్టేవారు కాదు. నోటి వెంట రక్తం వచ్చినా పట్టించుకోలేదు. నా పరిస్థితిని తెలియజేస్తూ సెల్‌లో వీడియో తీసి మిత్రులకు పంపాను. వారు ఎక్స్ ద్వారా మంత్రి లోకేశ్‌కు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి ఎన్నారై టీడీపీ వారిని నా వద్దకు పంపారు. ఎంబసీతో మాట్లాడి నేను మళ్లీ స్వస్థలం రావడానికి సాయం చేశారు. లోకేశ్ మేలు జీవితంలో మర్చిపోలేను.

- సరెళ్ల వీరేంద్రకుమార్, ఇసుకపూడి, తూర్పుగోదావరి జిల్లా

కువైట్‌కు వెళ్లి మోసపోయా

నెలకు రూ.52 వేలు జీతం ఇస్తారని, వంట పని చేయాలని చెబితే ఏజెంట్ ద్వారా కువైట్ వెళ్లాను. తీరా అక్కడకు వెళ్లాక హౌస్ మెయిడ్ పని అప్పగించడంతో నేను మోసపోయానని తెలిసింది. రోజుకు 20 గంటలకుపైగా పని చేయించేవారు. అంతేగాక జీతం రూ.22 వేలే ఇచ్చారు. విరామం లేకుండా పని చేయించడంతో నా ఎడమ చేయి నరం దెబ్బతింది. నా కష్టాలను నా భర్తకు చెప్పాను. ఆయన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఏపీ ఎన్నార్టీ, ఎన్నారై టీడీపీ వారిని అప్రమత్తం చేశారు. ఎన్నారై టీడీపీ వారు ఎంబసీ, ఏజెంట్లతో మాట్లాడి నన్ను స్వస్థలానికి పంపే ఏర్పాట్లు చేశారు. అక్కడ తీవ్ర అనారోగ్యం పాలైన నేను హైదరాబాద్‌లో వైద్యం చేయించుకున్నాను. మంత్రి లోకేశ్‌కు మా కుటుంబం రుణపడి ఉంటుంది.

- నమిడి ప్రమీల, అనపర్తి, తూర్పుగోదావరి జిల్లా

గ్రామీణ విలేకరులే నా గురువులు

- బెజవాడతో అనుబంధానికి సాహిత్యం, పుస్తక ప్రదర్శనలే పునాదులు
- ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్ వెల్లడి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం


విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

విజయవాడ, విజయవాడ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పత్రికారంగంలో ఏ స్థాయిలో ఉన్నా నేర్చుకుంటూ ఉండాలని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. తాను పత్రికారంగంలో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రజల జీవితాలను చాలా దగ్గరగా పరిశీలించడాన్ని వృత్తిలో భాగంగా అలవరుచుకున్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలోను, సాహితీమిత్రులు నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలోను శ్రీనివాస్ పాల్గొన్నారు. 1984లో ఉదయం పత్రిక మొదటి బ్యాచ్‌లో ట్రైనీ సబ్ ఎడిటర్‌గా తన పాత్రికేయ జీవితం విజయవాడలోనే ప్రారంభమైందని ఆయన తెలిపారు. విజయవాడలో పాత్రికేయ ఉద్యోగ జీవితాన్ని బాగా ఆస్వాదించానని అన్నారు. ఇక్కడి వాతావరణం మాత్రమే ఇబ్బందిగా ఉండేదిగానీ, ఆహారం, విహారం ఎంతో ఆహ్లాదకరంగా ఉండేవని గుర్తు చేసుకున్నారు. సాహిత్యం, బుక్ ఫెస్టివల్, ఇక్కడి సమాజంతో సజీవ సంబంధాలను కొనసాగించడానికి పునాదులయ్యాయని చెప్పారు. పత్రికల్లో విధులు నిర్వర్తించినప్పుడు యాజమాన్యం అభిప్రాయంతోపాటు సమాజ కోణమూ ముఖ్యమేనని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు తాను అనుకూలంగా ఉండేవాడినని, అయితే, ఇది తన వ్యక్తిగత అభిప్రాయంగానే ఉండేదన్నారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాల పాఠకులను మెప్పించడం చాలా క్లిష్టమైన వ్యవహారంగా మారిందన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో 17 ఏళ్ల ప్రయాణంలో ప్రజల జీవితాలను చాలా దగ్గరగా పరిశీలించానన్నారు. జిల్లాల్లో వివిధ కేంద్రాలకు వెళ్లినప్పుడు, విలేకరులను వెంటబెట్టుకుని గ్రామీణ ప్రజలతో మాట్లాడినప్పుడు అనేకానేక విషయాలు బోధపడేవన్నారు. గ్రామీణ విలేకరులే తనకు గురువులని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో ఇన్వెస్టిగేషన్ జర్నలిజం తగ్గిపోయిందని తెలిపారు. వ్యవస్థలో ఏ మూలన చూసినా అవినీతి కనిపిస్తోందన్నారు. ప్రజాసమస్యలతో పత్రికలు సంబంధాలను కొనసాగించాలని, ఈ పనే 'ఆంధ్రజ్యోతి' చేసిందన్నారు. ఉద్యమ సంఘాలు, బాధిత సంఘాలతో పత్రికా సంబంధాలు కొనసాగించిందని వివరించారు. తాను 'సందర్భం' శీర్షికతో రాసిన కాలమ్ చదివిన పాఠకులు ఫోన్లు చేస్తుంటే ఎంతో ఆనందంగా ఉండేదన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ముందుచూపుతో వ్యవహరించేవారు ఎంతోమంది ఉన్నారని చెప్పారు. అనంతరం శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నేతలు ఐవీ సుబ్బారావు, చావా రవి, కె.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య శ్రేయోభిలాషులకు స్వేచ్ఛనిచ్చా

తాను 'ఆంధ్రజ్యోతి' నుంచి తప్పుకొన్నానేగానీ, జర్నలిజం నుంచి కాదని, డిజిటల్ మీడియా రంగంలోకి ప్రవేశించే ఆలోచన ఉన్నదని కె.శ్రీనివాస్ అన్నారు. సాహితీమిత్రులు నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలో పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ప్రస్తుతం పత్రికల్లో సంపాదకులుగా ఉన్నవారికి మునుపటి సంపాదకులకు ఉన్నంత స్పేస్ లేదన్నారు. ఒక్కో పత్రిక ఒక్కో వర్గానికి కొమ్ముకాస్తే వార్తల్లో వాస్తవికత ఉండదు కదా అని ప్రశ్నించగా, రెండు, మూడు పత్రికలను చదివినప్పుడు సత్యం ఆవిష్కృతమవుతుందన్నారు. పత్రికారంగం పదేళ్ల నుంచి కుంటుపడుతోందని పేర్కొన్నారు. 2019 ముందు పత్రికారంగానికి 50ఏళ్ల వరకు ఢోకా లేదని భావించారనీ, కొవిడ్ తర్వాత ఈ అభిప్రాయం పూర్తిగా తిరగబడిందన్నారు. "డిజిటల్ మీడియా వార్తకు లక్షల్లో వ్యూస్ ఉంటాయి. కానీ, వాటికి జనంలో విశ్వసనీయత ఉండదు. పత్రికకు ఉండే విలువ డిజిటల్ మీడియాకు ఉండదు. జగన్ ఓటమే దీనికి ఉదాహరణ. దస్తావేజులు ఇవ్వకుండా డిజిటలైజ్ చేస్తామనడంతో జనంలో అభద్రతాభావం ఏర్పడింది. డిజిటల్‌మీడియా, పత్రికారంగంపై కూడా జనంలో ఇదే భావన ఉంది" అని వివరించారు. సంపాదకుడిగా.. 'ఆంధ్రజ్యోతి'లో వివిధ పేజీలో అన్ని ప్రాంతాల వారికి అవకాశాలు ఇచ్చాననీ, ప్రజాస్వామ్య శ్రేయోభిలాషులకు మంచి స్వేచ్ఛను ఇచ్చానన్న సంతృప్తి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు ఖాదర్ మోహియుద్దీన్, బండ్ల మాధవరావు,శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను అన్ని విధాలా ఆదుకుంటాం: మంత్రి లోకేశ్

- కొలనుకొండలో పద్మశాలి భవన్‌కు శంకుస్థాపన


కొలనుకొండలో పద్మశాలి భవన్ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో చేనేతలను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి-విజయవాడ బైపాస్‌లోని కొలనుకొండలో పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (పివా) ఆధ్వర్యంలో చేపడుతున్న నూతన పద్మశాలి భవన్ శంకుస్థాపనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరిలో అంతర్జాతీయ ప్రమాణాలతో వీవర్స్‌శాల ఏర్పాటు చేసి చేనేత కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. చేనేత మహిళలకు పెద్ద ఎత్తున ఆధునిక రాట్నాలు పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాల ద్వారా పేద విద్యార్థులు, చేనేత కుటుంబాలకు పివా అండగా నిలుస్తూ చేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు.


పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగిస్తున్న భక్తులు, దర్శనం కోసం కంపార్టుమెంట్‌లో వేచి ఉన్న భక్తులు(ఇన్‌సెట్)



శ్రీగిరిపై కార్తీక కాంతులు

శ్రీశైలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు కలిసి కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్షేత్రానికి తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులలో రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీప హారతులు, నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. కార్తీకమాసం శని, ఆది, సోమవారం రోజులలో భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులందరికీ స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు.

జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ పునరుద్ధరించాలి

- ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

విజయవాడ (వన్‌టౌన్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ పేరిట గతంలో ఇచ్చిన జీవోను పునరుద్ధరించాలని ఏపీయుడబ్ల్యూజే విజయవాడ యూనిట్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ఆదివారం జరిగిన సంయుక్త సమావేశంలో ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ కొత్త అక్రిడిటేషన్లు, జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్, తదితర అంశాలపై రాష్ట్ర నాయకత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో హౌసింగ్ స్కీమ్ విషయంలో జారీ చేసిన ఉత్తర్వులపై చర్చించారు. రాజధాని ప్రాంతంలో 30 ఎకరాలు అమరావతి సొసైటీకి కేటాయించారని, సీఆర్‌డీఏ హ్యాపీనెస్ట్-3 కింద నాలుగు కేటగిరీల్లో అపార్టుమెంట్లను నిర్మించి ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. జర్నలిస్టుల వాటా కింద చెల్లించాల్సిన నగదుతో పాటు ప్రభుత్వం చెల్లించాల్సిన రాయితీని కూడా అప్పట్లో ఖరారు చేశారని తెలిపారు. జర్నలిస్టుల ఇంటి కల నిజం చేయటానికి తిరిగి ఆ ఉత్తర్వులను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిబంధనల పేరిట కొర్రీలు వేయకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్లు జారీ చేయాలని తీర్మానించారు. రాష్ట్రస్థాయి ఎన్నికల నిర్వహణకు యూనియన్ అర్బన్ తరపున మోదుమూడి మురళీకృష్ణను ఎన్నికల అధికారిగా నియమిస్తూ మరో తీర్మానం చేశారు.

రాయకుండా సలపరిస్తున్నదే ఎక్కువ!

– పెద్దింటి అశోక్ కుమార్

ఎండిన మానేరు లోంచి ఓ కథల 'ఊటబాయి' పుట్టింది. నెర్రెలు బారిన మానేరు నేల లోంచి ఓ 'సంచారి' తీతువు పిట్టయి 'ఊరికి ఉప్పులం' పుట్టిందని సైరన్ మోగించాడు. దశాబ్దాల ఆధిపత్యపు 'దాడి'ని నిరసిస్తూ ఒక 'లాంగ్ మార్చ్' మొదలైంది. ఉపాధ్యాయ ఉద్యమాలతో సాహిత్యంతో 'జిగిరి' దోస్తుయి నడిచిన ఒక వర్తమాన సాహిత్య వాగ్దానం పెద్దింటి అశోక్ కుమార్. ప్రపంచీకరణ మార్పులను కథావస్తువులుగా తీసుకుని, రైతుకూలీల జీవితాలకంటే మరింత దిగువకు చూపును తెచ్చి అట్టడగు జీవితాలను సాహితీకరించిన అక్షరం ఆయనది. పల్లె జీవనాడిని పట్టుకుని, ప్రజల బాషను, పొక్కగాని పాముల్లా తొక్కులాడుతున్న పాత్రలను ఒక బాధ్యతగా నవలలుగా చెక్కుతున్న శిల్పకారుడాయన.

ఇంటర్వ్యూ ■ మీసాల ఉదయ్ కుమార్
94928 44817

నవలా శిల్పం

ఒక రచన ముందు కథలా మొదలై తర్వాత నవలగా మారిన సందర్భాలేమైనా ఉన్నాయా?

'ఎడారి మంటలు' నవలను ముందుగా కథగా రాయాలనుకున్నాను. మా ఊరి నుంచి వలస వెళ్లి గల్ఫ్ ఎడారిలో గొర్రెల కాపరిగా చిక్కుకున్న యువకుడి కథ అది. కథ మొదలుపెట్టాక విస్తారమైన ఆ జీవితాన్ని కథలో చెప్పలేననిపించి నవలగా రాశాను. కథ అంటే జీవితంలో ఒక చిన్న సంఘటన. కానీ నవల అంటే విస్తారమైన జీవితం.

పదకొండు భాషల్లోకి అనువాదమైన 'జిగిరి' నవలకి ప్రేరణ ఏమిటి? ప్రపంచీకరణతో మారుతున్న జీవితాలను చూపెట్టడానికి గుడ్డేలుగు (ఎలుగుబంటి)ని ఆడించే పాత్రను ఎందుకు ఎన్నుకోవాలనిపించింది?

తరానికి తరానికి మధ్య ఆలోచనలు, మానవత్వపు లక్షణాలు ఎలా మారుతున్నాయి అన్న ఆలోచనే 'జిగిరి' నవలకు ప్రేరణ. క్రూరమృగాలు మనుషులతో స్నేహం చేసి మానవత్వాన్ని నేర్చుకుంటాయి. కానీ మానవత్వంతో బతకాల్సిన మనిషి అవకాశాలకు అనుగుణంగా మృగంలా మారిపోతాడు. మనిషిలా మారిన మృగానికీ మృగంలా మారిన మనిషికీ మధ్య ఘర్షణను చెప్పాలనుకుని గుడ్డేలుగులను ఆడించే వాళ్ల జీవితాన్ని ఎన్నుకున్నాను.

నవలకు ప్లాట్ ముందే అనుకుంటారా? మొదలుపెట్టాక నవలను అంతిమ రూపానికి తెచ్చే పని ఎలా ఉంటుంది?

నవలకైనా కథకైనా ప్లాట్‌ను ముందే అనుకుంటాను. మనసును మెలిపెట్టే అంశాలనే వస్తువుగా ఎన్నుకుంటాను. గుండెలో మసిలి మసిలిన తర్వాతనే కొంత పరిశోధన చేసి నోట్స్ రాసుకుని నవల రాస్తాను. నవలని రెండు మూడు డ్రాఫ్టుల్లో పూర్తి చేస్తాను. ఈ క్రమంలో పరిశోధనలో కొత్త అంశాలు తెలిసినా, లేక పాత్రల స్వభావం మారినా దాని ముగింపు మారుతుంది. అప్పుడు మరొక డ్రాఫ్ట్ రాయాల్సి వస్తుంది. ముఖ్యంగా నవల రాయడం మొదలుపెట్టాక కొన్ని పాత్రలు నా చేతుల్లో ఉండవు.


> నవలకైనా కథకైనా ప్లాట్ ముందే అనుకుంటాను. మనసును మెలిపెట్టే అంశాలనే వస్తువుగా ఎన్నుకుంటాను. గుండెలో మసిలి మసిలిన తర్వాతనే కొంత పరిశోధన చేసి నోట్స్ రాసుకుని నవల రాస్తాను.

గంగిరెద్దుల వారి జీవితాల మీద రాసిన 'సంచారి' నవలకు ఎలాంటి పరిశోధన అవసరమైంది? పరిశోధనా క్రమంలో మీకు గుర్తుండిపోయిన జ్ఞాపకం ఏదైనా...?

కులవివక్ష ఇప్పటికి సమాజంలో బలంగా ఉంది. గంగిరెద్దుల కులానికి చెందిన ఒక వ్యక్తి సంచార జీవితాన్ని కాకుండా భద్రమైన జీవితాన్ని కోరుకుని ఒక ఊరిలో ఓ ఇల్లు కట్టుకోవాలి అనుకుంటే అతను ఎదుర్కొన్న సమస్యలు ఏమిటన్నది ఈ నవల సారాంశం. మా సిరిసిల్ల దగ్గర గంగెద్దుల కొండాపురం అనే ఒక ఊరు ఉంటుంది. అక్కడ ఎక్కువగా వాళ్ళే ఉంటారు. వారం పది రోజులు వాళ్ళ వెంట తిరిగి, వాళ్ళ ఆచార వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను పరిశీలించి రాసిన నవల ఇది. నేను అక్కడకు వెళ్ళిన ఒక రోజున– ఒక ఇంట్లో గంగిరెద్దు చనిపోతే మనిషి పోయినంతగా తల్లడిల్లిపోతూ దానికి అంత్యక్రియలు చేశారు. ఇది గుర్తుండిపోయిన జ్ఞాపకం.

తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రాసిన 'లాంగ్ మార్చ్' నవలను ఒక విద్యార్థి దృక్కోణం నుంచో, ఉద్యోగి దృక్కోణం నుంచో గాక, ఒక రైతు దృక్కోణం లోంచే చెప్పాలని ఎందుకు అనిపించింది?

'లాంగ్ మార్చ్' నవల 2011 మార్చ్‌లో టాంక్‌బండ్ మీద జరిగిన 'మిలియన్ మార్చ్' నేపథ్యంగా తెలంగాణ ఉద్యమ రూపాన్ని చెప్తుంది. నవలలో అన్నీ వాస్తవంగా జరిగిన సంఘటనలే. కొంత నాటకీయత జోడించాను. దీన్ని ముందుగా ఒక విద్యార్థి కోణం లోంచి చెప్పాలనుకున్నాను. కానీ అప్పటికే ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు వివిధ వృత్తుల వారు జేఏసీలుగా ఏర్పడి ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. గ్రామాల్లో రైతులు కూడా తెలంగాణ రావాలని ఎంతో ఆరాట పడుతున్నారు. ఆ విషయమే చెప్పాలనుకుని ఒక రైతు కోణం లోంచి రాసాను.



గల్ఫ్ ఎడారిలో ఒంటరిగా చిక్కుకున్న గొర్లకాపరి జీవితాన్ని 'ఎడారి మంటలు' నవలగా 2000లోనే రాశారు. ఈ నవలకై ఆ కాలంలో ఎలాంటి పరిశోధన చేయాల్సి వచ్చింది?

'ఎడారి మంటలు' నవల రాయకముందే ఎడారి వలస జీవితాల మీద 12 కథలు రాశాను. అవి 'వలస బతుకులు' పేరుతో సంకలనంగా వచ్చాయి. 'ఆజాద్' వీసా మీద వెళ్లి ఎడారిలో చిక్కుకొని గొర్ల కాపరిగా మారిన మా ఊరి వ్యక్తి జీవితాన్ని సజీవంగా చిత్రించాను. అప్పటికి మా ఊర్లో ఇంటింటికీ ఒక వ్యక్తి గల్ఫ్ దేశాల్లో ఉన్నాడు. రోజూ ఎవరో ఒకరు వచ్చేవారు పోయేవారు. వాళ్ళ దగ్గర కూర్చొని మాట్లాడి విషయాలు, ఫొటోలు సేకరించాను. అప్పటికి ఈ వీడియోలు, సెల్ ఫోన్లు లేవు కాబట్టి ఫోటోలూ, క్యాసెట్ల ఆధారంగా ఈ నవలను రాసాను.

గ్రామీణ పర్యావరణం మీద నవల రాయాలన్న ఆలోచన మీకెందుకు వచ్చింది. 'దాడి' నవలలో మూడు తరాల జీవన చిత్రాన్ని అభివృద్ధి కోణం లోంచి చూడాలా, విధ్వంసం కోణం లోంచి చూడాలా?

విధ్వంసమే! మనిషి కూటికోసం నీటికోసం గూటికోసం అడవి మీద చేసిన దాడి ఈ నవల. సబ్ మెర్సిబుల్ పంపులతో వేల ఫీట్ల లోతుల్లోంచి నీటిని తోడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని దానిని అభివృద్ధి అనుకున్నాం. కానీ దోసెడు మట్టి తీస్తే దోసెడు నీళ్ళూరే నేలలు వట్టిపోతాయని, తాగునీటి కొరత వస్తుందని గ్రహించలేకపోయాం. పెద్ద పెద్ద గుట్టలను ఎక్కే జేసీబీలను, చెట్లు నరికే పరికరాలను కనుగొని అడవులన్నింటినీ నరికి వ్యవసాయ భూములను చేసి అదే అభివృద్ధి అనుకున్నాం. కానీ పిట్ట వాలే చెట్టు లేకుండా చేసి పర్యావరణ విధ్వంసం చేస్తున్నామనుకోలేదు. ఒకప్పుడు ఊరు చిన్నది అడవి పెద్దది. కానీ నేడు అడవి కనుమరుగైపోయి ఊర్లో పశువులు లేకుండాపోయి మొత్తం వ్యవసాయ క్షేత్రంగా మారిపోయింది. ఇదీ ఒక విధ్వంసమే. ఇదంతా అభివృద్ధి చాటున జరుగుతున్న విధ్వంసం. ఇంకో యాభై ఏండ్ల తర్వాత నీడ లేక, నీరు లేక పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్నే 'దాడి' నవల. రేపు ప్రపంచ యుద్ధాలంటూ జరిగితే అవి నీళ్ళ కోసమే అన్న చేదు నిజాన్ని చెప్పిన గ్రామీణ పర్యావరణ నవల.

ఉప్పులం అంటే ముప్పు కదా. ప్రజాకర్షక పథకాలు ఎందుకు అభివృద్ధిలో భాగం కాలేకపోతున్నాయి. 'ఊరికి ఉప్పులం' నవల ముగింపు మరో నవలకు ప్రారంభమా?

అవును. ప్రజాకర్షక పథకాలు మోచేతికి బెల్లంలాంటివి. అప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనం కలిగించినా అవి ఉత్పత్తి కారకాలు కావు. వాటితో లాభం కంటే నష్టమే ఎక్కువ. వాటి వల్ల గ్రామంలో వచ్చిన మార్పులను, అధికార పార్టీలు రాజకీయ నిరుద్యోగుల కోసం పుట్టించిన గ్రామ స్థాయి పదవులు ప్రజల్లో ఎలాంటి విరోధాలను పుట్టించాయి అన్న అంశాన్ని, 2000 సంవత్సరం తరువాత మారిన పల్లె జీవితాలను ఈ నవలలో రాసాను. దీని ముగింపు వద్దే మరో నవల పుడుతుంది. ఆ మెటీరియల్ కూడా ఉంది. ఇలా రాసిన సాహిత్యం కంటే ఇంకా రాయకుండా గుండెలో మసలుతూ, సలపరిస్తున్న సాహిత్యమే ఎక్కువ.

సోమ సుందర్ శత జయంతి సభ

ఆవంత్స సోమసుందర్ శత జయంతి మహా సభ నవంబర్ 17 ఉ.10గంటల నుంచి చల్లా జగన్నాథ శాస్త్రి కళామందిర్, విద్యుత్ నగర్, కాకినాడలో జరుగుతుంది. 'ఆవంత్స సోమసుందర్' గ్రంథావిష్కరణతో ప్రారంభమయ్యే సభలో చందు సుబ్బారావు, మండలి బుద్ధ ప్రసాద్, రెంటాల శ్రీవేంకటేశ్వర రావు, పన్నాల సుబ్రహ్మణ్య భట్టు, పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరు శివప్రసాద్, చిరంజీవినీ కుమారి, ఆలూరి విజయ లక్ష్మి, హెచ్ఎస్‌వీకే రంగారావు తదితరులు పాల్గొంటారు.

సోమసుందర్ లిటరీ ట్రస్టు

కథా రచయితల సమాలోచన

తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం, కాకినాడ ఆధ్వర్యంలో 'కథ – ఏమిటి, ఎందుకు, ఎలా' శీర్షికన నవంబర్ 24న జరిగే కథా సదస్సులో పి. చిరంజీవినీ కుమారి, నండూరి రాజగోపాల్, మహ్మద్ ఖదీర్ బాబు, ఆలూరి విజయ లక్ష్మి, వాడ్రేవు వీరలక్ష్మీ దేవి, దాట్ల దేవదానం రాజు, జి. వెంకట కృష్ణ, చోరగుడి జాన్సన్, అద్దేపల్లి ప్రభు, శిఖామణి, ఎల్.కె. సుధాకర్, కుప్పిలి పద్మ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారు. పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్: 94915 04045.

తూ.గో.జిల్లా రచయితల సంఘం

సామాజిక అంశాలతో కథల పోటీ

అక్షరాల తోవ సంస్థ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కథల పోటీలో మూడు ఉత్తమ కథలకు రూ.2వేలు, మూడు మంచి కథలకు రూ.500 నగదు బహుమతులు ఉంటాయి. కథ ఎ4 సైజులో డీటీపీలో ఐదు పేజీలకు మించరాదు. కథలను డిసెంబర్ 10 లోపు పోస్ట్ / కొరియర్ ద్వారా చిరునామా: రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్ రోడ్, ఖమ్మం – 507001కు పంపాలి. వివరాలకు: 98492 77968.

అక్షరాల తోవ

సోమవారం 11 నవంబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'జ్ఞానజ్యోతి' పురస్కార ప్రదానం

తెలుగు సాహిత్య రంగంలో కృషి చేస్తున్న పరిశోధక రచయితకు ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం ఏటా ఇచ్చే 'జ్ఞానజ్యోతి' పురస్కారాన్ని 2024కి గాను వెలమల సిమ్మన్న స్వీకరిస్తారు. రూ.3వేల నగదు, జ్ఞాపిక, సన్మాన పత్రం, శాలువాలతో నవంబర్ 17 సాయంత్రం విజయవాడ లోని మహాత్మ గాంధీ రోడ్డు లోగల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రచయితకు సత్కారం ఉంటుంది. చిల్లర భవానీదేవి, పాపినేని శివశంకర్, కె. రమాదేవి తదితరులు పాల్గొంటారు.

చలపాక ప్రకాష్

'అంతరంగ వీక్షణం' ఆవిష్కరణ

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నవంబరు 17ఉ.10 గంటలకు విజయవాడ బందరురోడ్డులో గల ఠాగూర్ గ్రంథాలయంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రావు ముఖాముఖిల సంకలనం 'అంతరంగ వీక్షణం' ఆవిష్కరణ జరుగుతుంది. వర్ల రామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సభకు జి. లక్ష్మీనరసయ్య అధ్యక్షత వహిస్తారు. విశిష్ట అతిథులు– సుంకర గోపాల్, అన్నవరపు బ్రహ్మయ్య, సత్యాజీ.

కలిమిశ్రీ

ప్రజాజీవితం, కళావిలువల మేళవింపు నా 'భూమిస్వప్నం'


నా మొదటి పుస్తకం

■ నందిని సిధారెడ్డి


ప్రతి కవి ప్రయాణంలో మొదటి పుస్తకం కలల తీపి గుర్తు. రచయితగా నిలబడటానికి దోహదపడే ముఖ్య భూమిక. నా మొదటి కవితా సంపుటి 'భూమి స్వప్నం'. 1987 మార్చిలో వెలుగు చూసింది. 1976–86 మధ్య కాలంలో రచించిన కవితల లోంచి ఎంపిక చేసిన కవితల సంపుటి. ఆ పదేళ్ల కాలం నా నవ యౌవన కాలం. ఎప్పుడూ ఉత్సాహం. ఏదో తపన. కవిత్వ మోహం. విరివిగా పోటీపడి రాసేవాళ్లం. పత్రికలు అనేకం. ప్రచురణావకాశాలు అనేకం. కవిగా, రచయితగా గుర్తింపు పొందిన తర్వాతనే పుస్తకం వేసుకోవాలన్న భావన బలంగా ఉండేది. నిరుద్యోగం, ఆర్థిక లేమి ఒక కారణం. ప్రాచుర్యం పొందిన తర్వాత పుస్తకం వస్తేనే సాహిత్య లోకం పట్టించుకుంటుందన్న మా ముందుతరం కవుల అనుభవం మరో కారణం. అట్లా కల, కలగా ఉంటూ, వాయిదా పడుతూ కవితలు సంపుటిగా వస్తేనే తూచటానికి, అంచనా వెయ్యటానికి వీలవుతుందన్న సలహాలు ఎదురయ్యేదాకా తొందరపడలేదు.

చుట్టూ విస్తరిస్తున్న విప్లవ వాతావరణం నా కవిత్వానికి ప్రేరణ. శిల్పం పట్ల శ్రద్ధ వహించాలని అప్పట్లో తరచూ జరిగిన చర్చల సారం నా సృజనకు పూరణ. "మా మౌనం మూగతనం కాదు, గోడకు వేలాడే తుపాకీ కూడా మౌనంగా ఉంటుంది" అంటూ విప్లవోద్యమంలో నా కవితా పాదాల్ని గోడల మీద నినాదాలుగా రాసిన క్రమం గొప్ప ఉద్వేగం.

1986 సంవత్సరం పుస్తకం తేవాలని ప్రయత్నం మొదలుపెట్టాను. అప్పటికి ప్రచురించబడిన కవితలే రెండు వందల పైనున్నాయి. అన్నిటి మీదా సహజ ప్రేమ ఉన్నా నిర్దాక్షిణ్యంగా వడబోస్తే వంద తేలాయి. మరోసారి వస్త్రగాలం పడితే మరో సగం యాభై. అన్నింట్లో మార్గదర్శి శివారెడ్డే. 33 ఎంపిక చేశాం. మొదటి సంపుటి కదా, పేరు బాగుండాలి. అది పెద్ద సమస్య. అప్పటిదాకా నేననుకున్నది 'రుతుపవనం'. శివారెడ్డి తల ఊపలేదు. నెల దాటింది. దీర్ఘకవిత శీర్షిక 'ఆకురాలు అరణ్యం' చెప్పాను. ఆమోదం లేదు. మరో నెల. కొత్త కవిత రాశాను. శీర్షిక 'భూమిస్వప్నం'. శివారెడ్డికీ, దేవిప్రియకు, శీలావీర్రాజుకూ నచ్చింది. టైటిల్ ఫైనల్ అయింది. పుస్తకం పేరు 'భూమిస్వప్నం'.



మొదటి పుస్తకం కదా, ముందుమాట మరో సమస్య. గురువు గారు గనుక సినారెను, విమర్శకుడు గనుక కె.కె. రంగనాథచారినీ కోరాను. త్వరగానే రాసిచ్చారు. 'ఆర్ద్రత + తీవ్రత = సిధారెడ్డి కవిత' అని సినారె రాసింది నచ్చింది. కె.కె.ఆర్ పది పేజీలు రాశాడు. ఎక్కడా కవి పేరు గానీ, కవిత పేరు గానీ, పుస్తకం పేరు గానీ లేకుండా 'నేటి కవి' అని రాశాడు. ఆందోళన చెందాను. ఇబ్బంది పడుతూనే వెళ్ళి చెప్పాను. మార్పు చేస్తానంటే ఇచ్చాను. మార్చలేదు. అదీ తిరిగి ఇవ్వలేకపోయాడు. ఆందోళన పెరిగింది. తర్వాత శివారెడ్డినీ, దేవిప్రియనూ కోరితే రాశారు. 'బందారం కనిపెంచిన మందారం', అంటూ దేవిప్రియ కూర్చిన మాట ఇప్పటికీ ప్రచారంలో ఉంది. బందారం మా ఊరు. 'రాబోయే పదేళ్ల కాలం సిధారెడ్డి ఏమిటో నిర్ణయిస్తుందని శివారెడ్డి భావించాడు. ముందుమాటలు పుస్తకం చివర ప్రచురించాను.



"కన్నీళ్లూ కత్తులూ అయి జీవించుమనే అవ్వకూ బాపుకూ" అంకితమిచ్చాను. 'అవ్వ', 'బాపు' అని ధైర్యంగా రాశావన్నాడు సినారె.

తర్వాత ముఖచిత్రం కోసం శీలా వీర్రాజుతో కూర్చున్నాను. తృప్తి పడలేదు. అట్లా వెదుకుతున్నప్పుడు 'ఉదయం' ఆదివారం సంచికలో ప్రచురించిన ఒక ఫొటో నన్ను బాగా ఆకర్షించింది. ఇసుక తిన్నెల మీద ఆచ్ఛాదన లేని బాలుడు నడిచి వెళ్ళే దృశ్యం. అప్పటి ఆదివారం ఉదయం సంపాదకుడు దాట్ల నారాయణ మూర్తి రాజును కలిసి అడిగాను. ప్రేమతో వెదికి ఫొటో ఇచ్చాడు. ఫొటోగ్రాఫర్ పేరు అడిగాను. తెలియదన్నాడు. వీర్రాజు చేతిలో పెట్టాను. ముఖచిత్రం, వెనుక చిత్రం తయారైనాయి. శీలా వీర్రాజు అక్షరాలు శోభ కూర్చాయి. శీలావీ, మిత్రుడు వాసిలి వసంతకుమార్ పూనికతో మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్ నుంచి మంజీరా రచయితల సంఘం, మాధురీ పబ్లికేషన్స్ సంయుక్త ప్రచురణగా 'భూమిస్వప్నం' వెలువడింది. నగర కేంద్ర గ్రంథాలయం చిక్కడపల్లిలో మార్చి 6, 1987న సి. నారాయణ రెడ్డి 'భూమిస్వప్నం'ను ఆవిష్కరించాడు. నా కవిత్వాన్ని ఇష్టపడే డి. వెంకట్రామయ్య కె. శివారెడ్డి, దేవిప్రియ మాట్లాడారు. 'భూమిస్వప్నం' వెలువడిన ఆ సంవత్సరమే ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, ఆ తర్వాత 1988 సంవత్సరం 'ఇందూరు భారతి' దాశరథి అవార్డు అందుకోవటం ఉత్సాహానికి ఉత్సాహం.

ఆ రోజుల్లో తెలుగు సాహిత్యంలో రెండు ధోరణులు వ్యాప్తిలో ఉండేవి. మా తరాన్ని బలంగా ప్రభావితం చేసిన విప్లవ సాహిత్యం. విప్లవ సాహిత్యంలో శిల్పం లోపించి నినాదాలే చెలామణీ అవుతున్నాయన్న రూపవాదుల ధోరణి. రెంటినీ అన్వయించుకున్నాం. ప్రజాజీవితాన్ని, కళావిలువల్ని మేళవించిన సమన్వయ కవితా సృజన 'భూమిస్వప్నం'. ఇప్పటికీ నేను విశ్వసించేది అదే. ఇష్టమైన వాక్యం– 'కవిత్వం వేడుక కాదు. గాయాల గొంతుక'.



కారా మాస్టారి కథ కాని కథ

'కుట్ర' కథకి ఒక విశిష్టత ఉంది. కాళీపట్నం రామారావు కథా ప్రపంచంలో మొదటి దశ 1948లో 'ప్లాటుఫారమో' అన్న కథతో మొదలై 1955లో రాసిన 'అశిక్ష–అవిద్య' అన్న కథతో ముగుస్తుంది. 1956 నుంచి 1963 వరకు మాస్టారు కథ రాయలేదు. మళ్లీ 1964 నుంచి 1972 వరకు, అనగా 'తీర్పు' కథతో మొదలుపెట్టి 'కుట్ర' కథ వరకు, 16 కథలు రాసేరు. ఇది రెండో దశ. చాలా పరిణతి చెందిన కథలు ఈ దశలో వచ్చాయి. పీడితుల పక్షం తీసుకుంటూ, రాజకీయ సామాజిక ఆర్థిక అంశాలను చర్చించే కథలు ఈ రెండో దశ లోనే ప్రధానంగా వచ్చాయి. 'యజ్ఞం' లాంటి గొప్ప కథ కూడా ఈ దశలోదే.



ఈ దశలో వచ్చిన కథల్లో చివరి కథే 'కుట్ర'. కారా మాస్టారు తన దృక్పథాన్ని చాలా స్పష్టంగా సూటిగా ప్రకటించిన కథ ఇది.

అందుకే 'కుట్ర' కథని గురించి ప్రముఖ కథ, నవల విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఇలా అంటారు– "తాను ఇన్ని కథలు రాసినా తన ప్రాపంచిక దృక్పథం అతి గోప్యంగా ఉండిపోయిందేమో, పాఠకులకు అందలేదేమో అన్న సంశయంతో కాబోలు 'కుట్ర' అన్న కథ కాని కథను రాసి రచన మానేశాడు. 'కుట్ర' కథేనా, అందులో కథాంగాలు ఉండవలసిన చోట, ఉండవలసిన తీరులో ఉన్నాయా అని ఆలోచించి ప్రయోజనం లేదు. 'కుట్ర' కథగా ప్రారంభమై రచయిత మానసిక అలసత్వం వల్లనో, అసమర్థత వల్లనో అలా ఉపన్యాసంలా అయిపోలేదు. ఇప్పుడు ఉన్నదే రచయిత ఎంచుకున్న రూపం. కాబట్టి మనం అందులోని భావజాలానికి, ప్రాపంచిక దృక్పథానికే ప్రాధాన్యత ఇచ్చి ఆలోచించడం మంచిది. అప్పుడు ఆలోచనపరుడుగా కారా ఎదిగిన ఎత్తులు తెలుస్తాయి."

నిబద్ధుడైన కథకుడు కారా. ఈ మాట నేను ఎందుకంటున్నానంటే 1972లో మాస్టారు ఈ 'కుట్ర' కథను రాసేరు. 1970–76 మధ్య విచారణ జరిగి 140 మంది ముద్దాయిలు, 897 మంది సాక్షులు ఉన్న, ప్రపంచంలోనే అతిపెద్ద కేసైన, పార్వతీపురం కుట్ర కేసు ఈ కథకు భూమిక. అక్కడ నుంచి మొదలుపెట్టి– కుట్ర అని అసలు దేనిని అంటారో, కుట్ర ఎక్కడ జరిగిందో జరుగుతున్నదో విశదపరిచే ఎత్తుకు ఎదిగింది ఈ కథ. కారా మాస్టారు 1972 నుంచి 1992 వరకు మరొక్క కథ రాయలేదు. 1972 తర్వాత శ్రీకాకుళ గిరిజన విప్లవోద్యమం సెట్ బ్యాక్‌కి గురైన తర్వాత ఇరవై ఏళ్ల పాటు మాస్టారి నుంచి కథ రాలేదు. మాస్టారు విప్లవోద్యమ కాలంతో ఎంతగా పెన వేసుకుపోయారన్నది ఈ సెట్ బ్యాక్‌ని గమనంలో ఉంచుకుని మనం ఒక నిర్ధారణకు రావొచ్చు. తర్వాత 1992 అక్టోబర్‌లో 'రచన' సచిత్ర మాసపత్రికలో 'సంకల్పం' అనే కథ అచ్చైంది. తర్వాత 2006లో శ్రీకాకుళ సాహితి మిత్రులు తెచ్చిన 'జంఝావతి కథల సంకలనం'లో వచ్చిన 'అన్నెమ్మ నాయురాలు' కథే కారా మాస్టారి చివరి కథ.

***

1970 నాటి తిరుగుబాటు ఆలోచనలు నిర్మించుకున్న చరిత్రకు సాక్షీభూతం 'కుట్ర' కథ. అక్షరాలా 897మంది సాక్షుల సమక్షంలో, 140మంది ప్రభుత్వాన్ని కూల్చేసే కుట్రని పన్నారని ప్రభుత్వం ఆరోపణ చేసిన నేపథ్యంలో, ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టిన విస్పష్ట కథగా 'కుట్ర'ని పేర్కొనవచ్చు.

ఈ కథలో కుట్ర నిజస్వరూపాన్ని చెప్తారు కాళీపట్నం. రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నట్టు భ్రమింప చేస్తూ పెట్టుబడిదారులు దోపిడీ విధానాలను అమలు చేసే క్రమాన్ని ఇందులో చెబుతారు. ఆ కథాకాలంలో మొదలైన దోపిడీ ఇప్పుడు ఎంత లోతులకు చొరబడిందో మనకు తెలిసిందే. సంపద కేంద్రీకరణ తీరు కళ్ల ముందు కనిపిస్తున్నదే. ఆ విధంగా వర్తమానానికి అనువర్తించబడ్డ కథ 'కుట్ర'. వాస్తవ దోపిడీ వాతావరణ నిజస్థితిని డొక్క చింపి చూపెట్టిన కథ 'కుట్ర'.

"పట్నంలోయేదో కేసొతోందట యిన్నావా?" అని ఇద్దరు స్నేహితుల మధ్య సంభాషణతో మొదలౌతుంది కథ. "దగ్గిర దగ్గిర నూటేభై మంది ముద్దాయిలూ.. వెయ్యిమంది సాక్షులూ..." ఈ మాటలతో వారు పార్వతీపురం కుట్రకేసు గురించే మాట్లాడుకుంటున్నారని మనకు రూఢీ అవుతుంది. ఇద్దరు స్నేహితుల్లో ఒకరంటారు. "కుట్రంటే– ఇద్దరో ముగ్గురో మధ్య రహస్యంగా ఏదైనా జరిగితే అది కుట్ర. నూర్నాటేభైమంది జనమేటి, ఆళ్ళ పక్షాన కాదు, నీ పక్షాన పలకడానికొచ్చినోళ్ళే వెయ్యిమంది సాక్షులు! అంత సాక్షింలో జరిగిందీ అంటే అది పబ్లిగ్గా జరిగిందన్నమాట. అలాటిది ఏటన్నా కావచ్చు గాని కుట్రనడానికి మాత్రం కాదు. నన్నడిగితే దాన్ని కుట్రనడమే ఓ పెద్ద కుట్రంటాను. ఏటి– తిరుగుబాటనడానికి నీకు నామోషీ దేనికి?"

ఈ సంభాషణ నుంచి కథ నెమ్మదిగా కథకుడి వద్దకు వెళ్లి, దేశ రాజకీయార్థిక అవగాహన లోంచి, దృక్పథ చైతన్యం లోంచి ఒక మోనోలాగ్‌లా, ఒక ఉపన్యాసంలా నడుస్తుంది. అసలు కుట్ర ఏదో తేటపరుస్తుంది కాబట్టి కథ అనుకున్న గమ్యాన్నే చేరింది. కారా రాసిన ప్రధానమైన కొన్ని కథల్లాగే ఈ కథ కూడా వర్గదృష్టి ఉన్న కథే.

> 'కుట్ర' కథలో కుట్ర నిజస్వరూపాన్ని చెప్తారు కాళీపట్నం రామారావు. రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నట్టు భ్రమింప చేస్తూ పెట్టుబడిదారులు దోపిడీ విధానాలను అమలు చేసే క్రమాన్ని ఇందులో చెబుతారు. ఆ కథాకాలంలో మొదలైన దోపిడీ ఇప్పుడు ఎంత లోతులకు చొరబడిందో మనకు తెలిసిందే. సంపద కేంద్రీకరణ తీరు కళ్ల ముందు కనిపిస్తున్నదే. ఆ విధంగా వర్తమానానికి అనువర్తించబడ్డ కథ 'కుట్ర'.

కథలో ఒక దగ్గర– "నన్నడిగితే కుట్రనదగ్గదేదేనా జరిగితే రాజ్యాంగం రాసినకాడే జరిగుండాల. పంచవర్ష ప్రణాళికలు ఏసిన్నాడు డెఫినెట్‌గా జరిగింది. జరిగిందనడానికి దాఖలాలున్నాయి మన కళ్ళముందే. అసలు కుట్ర అది," అంటుంది కథ చెప్తున్న పాత్ర. ఇది రచయిత దృక్కోణంగా మనకు తెలియకనే తెలుస్తుంది.

***

ఈ కథ వర్తమానంలో ఏఏ కోణాలకు వర్తిస్తుంది? అని ప్రశ్న వేసుకుంటే– ఈ కథ 1972 లో అచ్చయింది, పార్వతీపురం కుట్ర కేసు 1976లో ముగిసింది, ఇప్పుడు మనం 2024లో ఉన్నాం– ఈ ఏభై ఏళ్లలో దేశం మొత్తం మీద ఎన్నో అబద్ధాల కుట్ర కేసులను చూస్తున్నాం. అందుకు సాయిబాబా కేసు ఒక పెద్ద ఉదాహరణ. మతం గురించి కూడా కథ లోని పాత్ర మాట్లాడుతుంది. ఇది కూడా వర్తమానానికి వర్తించేదే. ఇది– ఈ కథ ద్వారా తక్షణం చర్చించాల్సిన కొత్తకోణం అని ఇప్పటి మతోన్మాద సందర్భంలో నేను అనుకుంటున్నాను. కథ లోనే ఆ చర్చకు ఆస్కారం ఉంది కూడా.

మన దేశానిది కేపిటలిస్టు ఎకానమీనా, సోషలిస్టు ఎకానమీనా అని చర్చ లాంటిది ఒకటి పెడతాడు ఈ కథలోని పాత్ర ద్వారా రచయిత. ప్రభుత్వం చేసే ట్రిక్కుని బయటపెడతాడు. ఆ ట్రిక్కు ఇలా వుంటుంది: "మొదట్నుండీ మన నాయకుల ఆలోచనా ధోరణీ, జాతికి ఆళ్ళు నేర్పి పెట్టిన ఆలోచనా పద్ధతీ, ఒకటుంది గదా! మాటొరసకి– బ్రిటిష్ వాళ్ళు మన మిత్రులా? కాదు కాదు. అయితే శత్రువులా? అబ్బెబ్బే ఎంత మాత్రం కాదు. హిందూ మతాచారాలు మంచివా చెడ్డవా? చెడ్డవే చెడ్డవే. కాని వాటిల్లో మూఢత్వాన్ని తొలగిస్తే, ప్రపంచం మొత్తం మీద ఆ మత విశ్వాసమంత గొప్పది మరింకోటి లేదు."

ఇక్కడ మతానికి సంబంధించిన మాటలు వర్తమాన సందర్భానికి అనువర్తించుకోదగ్గవే. కథ లోని ఈ పాయింట్ ప్రస్తుతం చర్చించదగ్గ పాయింట్ అని అనుకుంటున్నాను.

***

"గాంధీగారి కోతులు కళ్ళూ చెవులూ నోరూ మూసీసుకోవాలనీ, మూసీసుకోండని చెప్పి యింకా వినప్పోతే బలవంతాన మూసీడానికి ప్రయత్నించొచ్చు. కానీ–" అన్న అసంపూర్ణ వాక్యంతో కథ ముగుస్తుంది. "కానీ" తర్వాత వుండేది 'తిరుగుబాటే' అని కథకుని ఉద్దేశం. అన్యాయంపై అధర్మంపై ప్రజ ఎలుగెత్తక తప్పదని ఆయన ఉద్దేశం. అది వాస్తవం కూడా. కథ ప్రారంభంలో ఒక డైలాగ్ ఉంటుంది. "నన్నడిగితే దాన్ని కుట్రనడమే ఓ పెద్ద కుట్రంటాను. ఏటి తిరుగుబాటనడానికి నీకు నామోషీ దేనికి?" అని. ఈ వాక్యాన్ని బలంగా నిరూపించడానికి కథకుడు ఈ కథని చెప్పాడని నేను భావిస్తున్నాను. జాగ్రత్తగా గమనిస్తే ఈ కథలో ఒక వలయం ఉంది. కథ ప్రారంభంలో తిరుగుబాటును కాంక్షించి, కథ ముగింపులో తిరుగుబాటు జరిగి తీరుతుందని చెప్పడం, అదే పరిణామసూత్రం అని ప్రకటించడం. ఇది నిస్సందేహంగా శిల్ప రహస్యమే. కథకుని సృజనాత్మక నిర్మాణ చాతుర్యమే. విప్లవ కథకి ఉండాల్సిన పురోగామి లక్షణాలతో 'కుట్ర' కథని ఒక వైవిధ్యమైన విప్లవ కథగా నేను నిర్ధారిస్తున్నాను.

■ బాలసుధాకర్
96764 93680

ఒక శ్వాస.. కొన్ని అంతర్లయలు

దూరాన్ని నువ్వే నిర్ణయిద్దువు గాని
ప్రయణాన్ని ఇవ్వు చాలు

గుండెలో విరిగిన
గడియారం ముల్లును పీకిపారేసి
కొద్దికొద్దిగా కదులుతున్న కాలాన్నివ్వు చాలు

అనేకానేక నవ్వు తెరల మధ్య
వేళ్ళతో మీటితే
ఒలికిపోయి ప్రవహించే
నిండు పాత్రల పరిచయాల్ని ఇవ్వు చాలు

హంగుల నింగి నీడల కుబుసాల్ని
విదుల్చుకొని వచ్చేస్తాను–
రైతుతో పాటు
బురదలో కూరుకుపోయి
బరువెక్కే పాదాల్నివ్వు చాలు

ఇరుకిరుకు లోయల మధ్య
కలిసి పరీవాహకత్వమైన
పురాజ్ఞాపకపు
పరిమళాన్నివ్వు చాలు

నీటి ఎడారి మేటల మీద
మోకరిల్లి ప్రార్థిస్తాను
నా పెదాలకు
ప్రకృతికి అర్థమయ్యే
నాలుగు పదాలనివ్వు చాలు

■ కందుకూరి దుర్గాప్రసాద్
96189 29018

• మాటామంతీ..

మొగల్రాజపురంలోని శిఖర పబ్లిక్ స్కూల్లో సాహితీమిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్‌తో మాటామంతీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సాహితీ మిత్రులతో శ్రీనివాస్ ముఖాముఖి మాట్లాడి పత్రికారంగం, ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు.



వనం.. జనం



8లో

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపం పర్యాటకులతో ఆదివారం కళకళలాడింది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో వచ్చిన వారు ద్వీపంలోని అందాలను చూసి పరవశించారు. బోటు షికార్లతో సందడి చేశారు.

జై దుర్గా భవానీ



6లో

దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. కార్తీక మాసం, సెలవు దినం కావటంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈవో రామారావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమ్మవారిని భక్తులు శీఘ్రంగా దర్శించుకునేందుకు వీలు కల్పించారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

8లో

దేశానికే వెలుగునిచ్చే కేంద్రంగా ఎన్టీటీపీఎస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. గత వైసీపీ ఐదేళ్ల పాపాలు ఆ ప్లాంటు ప్రతిష్ఠను మసకబారేలా చేశాయి. ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేశాయి. నేతల ధనదాహం, అధికారుల అలసత్వంతో వెలుగునిచ్చే కేంద్రం కాస్త బూడిద కాలుష్యం వెదజల్లే కేంద్రంగా మారిపోయింది. వైసీపీ అతినీతిని తమకు అంటించుకొని సంస్థ ఉద్యోగులు సైతం బూడిద వ్యాపారులుగా తయారయ్యారు. ఫలితంగా ఎన్టీటీపీఎస్ నుంచి వచ్చే బూడిద కాలుష్యంతో కొండపల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు చుట్టు పక్కల ఉన్న శాంతినగర్, ఈలప్రోలు, గుంటుపల్లి, జూపూడి, కిలేశపురం, కేతనకొండ, మూలపాడు, కొటికలపూడి గ్రామాలు, విజయవాడ రూరల్ మండలంలోని పైడూరుపాడు, రాయనపాడు గ్రామాల ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు.





ఎన్టీటీపీఎస్ పాత చిమ్నీల ద్వారా బయటకు వస్తున్న బూడిద (ఇన్‌సెట్‌లో) జాతీయ రహదారిపై వెళుతున్న టిప్పర్ నుంచి వెలువడుతున్న బూడిద

అంతా బూడిదే!

వాయు కాలుష్య కేంద్రంగా ఎన్టీటీపీఎస్ | మంచులా కమ్మేస్తున్న బూడిద

ఆస్పత్రులపాలవుతున్న కొండపల్లి, ఇబ్రహీంపట్నం, సమీప గ్రామాల ప్రజలు

బూడిద వ్యాపారులుగా మారిన ఉద్యోగులు

ఎన్టీటీపీఎస్ మాకొద్దని రోడ్డెక్కుతున్న స్థానికులు



ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులపై బూడిద కొడుతున్న మహిళ

ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి : ఎన్టీటీపీఎస్‌లో 210 మెగా వాట్ల ఉత్పత్తి చేసే ఆరు యూనిట్ల నుంచి 1,260 మెగావాట్లు, 500 మెగా వాట్ల యూనిట్, 800 మెగా వాట్ల యూనిట్ నుంచి రోజుకు 2,560 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇందుకు రోజుకు సుమారు 30 వేల టన్నుల బొగ్గు వినియోగిస్తున్నారు.. బొగ్గు వినియోగించిన అనంతరం వచ్చే బూడిదను బూడిద చెరువులోకి పంపగా సైలోస్ ద్వారా వచ్చే బూడిదను ప్లాంట్ నుంచి టిప్పర్లు, లారీల ద్వారా బయటకు పంపుతున్నారు. అయితే 800 మెగావాట్ల యూనిట్‌కు సైలోస్ ఏర్పాటు చేయకుండానే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని, వచ్చే బూడిదను కింద పోసి లోడింగ్ చేసి లారీల ద్వారా తరలించడం వల్లే ప్లాంట్ ఏరియాతో పాటు చుట్టు పక్కల గ్రామాలపై పెద్ద ఎత్తున బూడిద మంచు వర్షం కురిసినట్లు కురుస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపుల ద్వారా పంపే బూడిద ప్లాంట్‌లో కొన్ని పరికరాలు సరిగ్గా పని చేయకపోవడం వల్ల కూడా బూడిద పెద్ద ఎత్తున బయటకు వచ్చేస్తుందనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా దగ్గరగా ఉన్న ఈలప్రోలు గ్రామస్థులైతే ఈబూడిద వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా తలుపులు వేసుకొని ఇళ్లలో ఉంటున్నామని వాపోతున్నారు. వారి కార్లను సైతం గొల్లపూడి తదితర ప్రాంతాల్లో బంధువుల అపార్ట్‌మెంట్లలో నిలుపుకుంటున్నట్లు తెలుస్తోంది.

వైసీపీ ప్రభుత్వంలో సీఎస్ఆర్ ఫండ్ నిల్

టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు సుమారు రూ.9 కోట్లు నిధులు విడుదల కాగా వాటితో కొండపల్లి, ఇబ్రహీంపట్నం, ఇతర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఇంకా రూ.21 కోట్లు రావాల్సి ఉంది. వాటి గురించి కాలుష్య నియంత్ర మండలి సభ్యులు పోరాడుతున్నారు.

ఎన్విరాన్‌మెంట్ ఫండ్ ఏమైనట్లు?

పర్యావరణ పరిరక్షణకు కేటాయించిన ఫండ్ ఏమైనట్లని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్విరాల్‌మెంట్ ఫండ్ వందల కోట్లతో కాలుష్య బాధిత గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు పెట్టి ప్రజలకు, పశువులకు వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు సరఫరా చేయాల్సి ఉంది. ఇలా నెల నెలా జరగాల్సి ఉన్నా ఎక్కడా అలా పెట్టిన దాఖలు లేవు. మరి నిధులు ఏమైనట్లు అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎక్కడా ఒక్క మొక్క పెట్టినట్లు గానీ, వాటికి ట్రీ గార్డులు పెట్టిన గానీ దాఖలు లేవు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గ్రీనరీ కింద అడిగితే కొండపల్లి రిజర్వు ఫారెస్టును చూపించి చేతులు దులుపుకున్నారు.

మిగతా 6లో..


ఎల్‌పీఎం గుదిబండ!

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన కొత్త విధానంతో రైతులకు అవస్థలు

* తగ్గిపోయిన రిజిస్ట్రేషన్లు.. పడిపోయిన ఆదాయం
* కూటమి ప్రభుత్వం వచ్చినా ఎల్‌పీఎం కొనసాగింపుపై ఆందోళన
* భవిష్యత్తులో కోర్టు కేసులకు ఊతం

శాశ్వత భూహక్కులు కల్పిస్తామన్న పేరుతో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ పార్శిల్ మేనేజ్‌మెంట్ (ఎల్‌పీఎం) విధానం రైతులకు గుదిబండగా తయారైంది. ఒక భూ యజమానికి ఎన్ని సర్వే నంబర్లలో భూములు ఉన్నా ఒకే ఎల్‌పీఎం పరిధిలోకి వస్తుంది. ఇటువంటి విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తుండటం, ఉమ్మడి జిల్లాలో రీ సర్వే సమగ్రంగా జరగకపోవటం, జరిగిన చోట ల్యాండ్ పార్శిల్స్ విస్తీర్ణం ఎక్కువ, తక్కువగా ఉండటం వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్స్ పరంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులు ఇబ్బంది పడటంతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ భారీగా ఆదాయాన్ని కోల్పోతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



ఎల్‌పీఎం వల్ల జరుగుతున్న నష్టాలు ఇవీ..

రామయ్య అనే వ్యక్తి తన 10 ఎకరాల విస్తీర్ణంలో ఐదు ఎకరాల భూమిని సోమయ్య అనే వ్యక్తికి విక్రయించాలనుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేసుకుందామని వెళితే వీలు పడటంలేదు. దీనికి కారణం ఎల్‌పీఎం నంబర్ ఆధారిత రిజిస్ట్రేషన్ విధానాన్ని కొనసాగించటం. ఎల్‌పీఎం నంబర్‌లో సబ్ డివిజన్లు జరిగితేనే రామయ్య అమ్మాలనుకుంటున్న ఐదు ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరుగుతుంది. సబ్ డివిజన్ చేసుకోవాలంటే 30 రోజుల సమయం పడుతుంది. ప్రభుత్వం మూడు రోజుల్లో చేయాలని నిర్దేశించినా రెవెన్యూ శాఖలో ఇది జరగాలంటే నెల రోజులు కాదు కదా మూడు నెలలు పట్టవచ్చు. దీని వల్ల సదరు రైతు సకాలంలో భూమిని అమ్ముకోలేపోతున్నాడు. ప్రజలకు పరోక్షంగా తీవ్ర ఇబ్బందులు తీసుకువస్తున్న ఈ అంశాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

• కృష్ణారావు అనే వ్యక్తి తన ఎల్‌పీఎం నంబర్ 10లోని తన 10 ఎకరాల భూమిలో ఐదు ఎకరాలను బ్యాంకుకు తనఖా పెట్టి రుణం తీసుకోవాలనుకున్నాడు. తీరా తనఖా రిజిస్ట్రేషన్ జరిగితే.. మొత్తం 10 ఎకరాలు బ్యాంకుకు తనఖా అయిపోయింది. గిఫ్ట్ డీడ్‌లు, సేల్ డీడ్లకు సబ్ రిజిస్ట్రార్లు కనీసం సబ్ డివిజన్ చేసుకోమని

మిగతా 6లో..

భవానీ దీక్ష స్వీకరణ నేటి నుంచే

వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో భవానీ దీక్ష స్వీకరణ కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. ఉదయం ఏడు గంటల నుంచి ఆలయంలో మాలధారణలు చేయనున్నారు. డిసెంబరు 25వ తేదీ వరకు దీక్షలు కొనసాగుతాయి. కార్తీక మాసం దశమి ఏకాదశి తిధి ద్వయంలో శుభముహూర్తాన దీక్షల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు మండల దీక్షలను స్వీకరించవచ్చు. డిసెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు అర్ధమండల దీక్షా ధారణలు జరుగుతాయి.



సదస్సులో ప్రసంగిస్తున్న ఏఆర్ సింధు

అంగన్వాడీని ప్రభుత్వ విభాగం చేయాలి

» స్వర్ణోత్సవ సభలో వక్తలు

గవర్నర్‌పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీని ప్రభుత్వ విభాగం చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆలిండియా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు డిమాండ్ చేశారు. ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అంగన్వాడీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేటికీ దేశంలో 80 శాతం మంది పేదరికంలోనే ఉన్నారని, వారిలో 70 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారన్నారు. అంగన్వాడీ వ్యవస్థను పథకంగా కొనసాగించడమే దీనిని సరిచేయడానికి మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో దీనికి తగిన నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. టెక్నాలజీని వాడి అంకెల గారడీ చేస్తూ వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియకుండా ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. ఈ ఏడాది అక్టోబరు 2 నుంచి వచ్చే సంవత్సరం అక్టోబరు 2వ తేదీ వరకు ఐసీడీఎస్ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తూ పలు కార్యక్రమాలు, ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ, 42 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, ప్రభుత్వం వద్దకు అంగన్వాడీల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సదస్సుకు ఫెడరేషన్ అధ్యక్షురాలు జి.బేబిరాణి అధ్యక్షత వహించారు. సదస్సులో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి తదితరులు ప్రసంగించారు.

రాష్ట్ర అవార్డుకు సైన్సు మాస్టారు



జగ్గయ్యపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేటలో జీవీజే బాలుర ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గార్లపాటి చంద్రశేఖర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 1995లో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి వేదాద్రి మెయిన్ స్కూల్‌లో చేరి, యూపీ స్కూల్‌గా స్థాయోన్నతి పొందేలా విద్యార్థుల సంఖ్యను పెంచారు. 30మంది ఉన్న బలుసుపాడు స్కూల్‌ను యూపీ స్కూల్‌గా మారేందుకు శ్రమించారు. నాగమయ్యబజార్ స్కూల్‌కు సొంత భవనం లేకపోవటంతో ఐదేళ్ల పాటు అద్దె భవనంలో పాఠశాలను నిర్వహించి శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయించారు. మక్కపేటలో ప్రధానోపాధ్యాయుడిగా 50 మంది విద్యార్థులున్న స్కూల్‌ను 260 మందికి చేరాలా పనిచేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. గతేడాది ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావుల నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన చంద్రశేఖర్‌ను ఆదివారం ఎమ్మెల్యే తాతయ్య అభినందించారు.



పిల్లల కోసం వసతిగృహం గేటు వద్ద తల్లిదండ్రుల పడిగాపులు

మా పిల్లల్ని చూసుకోనివ్వరా..!

» బాలికల వసతిగృహం వద్ద తల్లిదండ్రుల ఆందోళన

మైలవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెలరోజులకు ఒకసారి తమ పిల్లలను చూడాలంటే గంటల తరబడి గేటు బయట ఇబ్బందులు పడాలా.. అని మైలవరంలోని ఎస్టీ బాలికల వసతిగృహ ప్రిన్సిపాల్‌పై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పిల్లలను చూసేందుకు వచ్చిన వారిని లోనికి అనుమతించేందుకు ప్రిన్సిపాల్ వెంకటరమణ నిరాకరించారు. ఉదయం 10 గంటలకు వస్తే మధ్యాహ్నం 2 గంటల తర్వాత లోనికి అనుమతించడం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు వరుసగా మూడు రోజుల పాటు దొండకాయ పచ్చడి పెట్టారని, తాగునీరు శుభ్రంగా ఇవ్వడం లేదని, పిల్లల ప్రోగ్రెస్ కూడా ఇవ్వడం లేదన్నారు. లోపాలు బయటపడతాయనే లోనికి అనుమతించడం లేదని వారు ఆరోపించారు. దీనిపై ప్రిన్సిపాల్ వివరణ ఇస్తూ.. పిల్లలను చూసేందుకు రెండో ఆదివారం తల్లులకు మాత్రమే అనుమతి ఉంది. తండ్రులకు లేదు. ఇంటి నుంచి భోజనం తీసుకురాకూడదు. భోజనం, టిఫిన్ విషయంలో ఎప్పుడైనా వచ్చి పరిశీలించుకోవచ్చన్నారు.

ఎల్‌పీఎం గుదిబండ!

(5వ పేజీ తరువాయి)

చెప్పటానికి అవకాశం ఉంది. తనఖా అగ్రిమెంట్లకు అయితే ఈ అవకాశం లేదు. దీంతో భారీసంఖ్యలో తనఖా రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయి.

● ఒక గ్రామంలో 500 ఎల్‌పీఎం నంబర్లు ఉన్నాయనుకుందాం. ఇందులో ఎల్‌పీఎం నంబర్ 5లో రామయ్యకు ఎన్‌హెచ్-65 వెంబడి రెండు ఎకరాలు, దాని పక్కనే మరో రెండు ఎకరాలు, ఇంకో చోట ఎకరం ఉంది. భూ సేకరణ చేయాల్సి వస్తే ఒకే ఎల్‌పీఎం నంబర్ కింద మార్కెట్ విలువను అసెస్‌మెంట్ చేయటం జరుగుతుంది. విస్తరణకు హైవే పక్కన ఉన్న రెండు ఎకరాలకు రూ. కోటి నిర్ణయిస్తే.. ఎల్‌పీఎం నంబర్ పరిధిలోని మిగిలిన వాటికి కూడా పరోక్షంగా అదే విలువను నిర్ణయించినట్టు అవుతోంది. భవిష్యత్తులో భూ సేకరణ చేయాల్సి వచ్చినా, మిగిలిన భూములు కూడా తీసుకోవాల్సి వచ్చినపుడు ఎల్‌పీఎం నంబర్‌లో ఫలానా మార్కెట్ విలువ నిర్ణయించారని కోర్టును ఆశ్రయించే అవకాశాలు ఉంటాయి.

● ప్రతి ఏటా భూముల ధరలు నిర్ణయించాల్సిన సందర్భంలో కూడా సమస్యలు తప్పటం లేదు. ప్రభుత్వం కొత్తగా భూముల ధరలను నిర్దేశించమని చెబితే పరిస్థితి ఏమిటో అర్థం కావటం లేదు. ఉమ్మడి జిల్లాలో రీ సర్వే సమగ్రంగా జరగలేదు. జాతీయ రహదారి - 16 పక్కన ఒక గ్రామంలో సర్వే జరిగింది. మరో గ్రామంలో సర్వే జరగలేదు. ఎల్‌పీఎం నంబర్ల ప్రాతిపదికన మార్కెట్ విలువలను పెంచితే.. వేర్వేరు చోట్ల ఉన్న భూములకు ఒకే విలువ నిర్ణయమవుతుంది. హైవే పక్కన ఉన్న భూమికి మరోచోట ఉన్న భూమికి కూడా ఒకే విలువ వర్తిస్తుంది.

● రీ సర్వే అనంతరం వెంకట్రావు అనే రైతుకు చెందిన 10 ఎకరాల విస్తీర్ణం 11 ఎకరాలుగా వచ్చింది. వాస్తవంగా క్షేత్ర స్థాయిలో 10 ఎకరాలు మాత్రమే ఉంది. ఈ తప్పులు సరికాకపోవటం వల్ల వెంకట్రావు దగ్గర 10 ఎకరాలే ఉన్నప్పటికీ ఆ భూమిని కొనుగోలు చేస్తున్న నారాయణరావు 11 ఎకరాలకు స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి వస్తోంది. అలాగే సోమయ్య అనే రైతుకు 10 ఎకరాల భూమి ఉంటే సర్వే తర్వాత 9 ఎకరాలుగా ఉంది. దీంతో తన 10 ఎకరాలను అమ్ముకున్నా.. 9 ఎకరాలు మాత్రమే విక్రయించాల్సి వస్తోంది.

● రిజిస్ట్రేషన్ ముందు సబ్ డివిజన్ జరిగినా .. ఆ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయితే తప్ప ఆస్తి హక్కుల బదిలీ జరగవు. సబ్ డివిజన్ జరిగిన తర్వాత రిజిస్ట్రేషన్ జరగకపోతే .. ఆ ఎల్‌పీఎం నంబర్ సబ్ డివిజన్స్ రికార్డులలో జంక్ వ్యాల్యూగా ఉంటాయి.

● సర్వే నంబర్ అనేది స్థిరమైనది. భౌగోళిక కోఆర్డినేట్లతో చూస్తే అది ఎప్పుడూ మారదు. ఆస్తిని గుర్తించటం, దాని విలువను అంచనా వేయటం చాలా సులభంగా ఉంటుంది. ఎల్‌పీఎం అనేది డైనమిక్ ఎంట్రీగా ఉంటుంది. రిజిస్ట్రేషన్స్ విషయంలో భౌగోళిక స్థానాన్ని అందించదు. సర్వే నంబర్ విధానంలో మార్పులు ఉండవు. అదే ఎల్‌పీఎం నంబర్ ఎప్పటికప్పుడు మారుతూ వస్తోంది. దీని వల్ల నిషేధిత భూములను గుర్తించటం కష్టమౌతోంది.

కార్తీకాన ఆలయాలు కిటకిట

» దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్/మోపిదేవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తీకమాసం, ఆదివారం సెలవు దినం కావటంతో ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్యూలలో, ఆలయం వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఈవో రామారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాశ్‌తో కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో సహస్రలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లేశ్వర స్వామి సన్నిధిలో సహస్రలింగాలకు అభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన తదితరాలను నిర్వహించారు. ఆకాశదీపాన్ని వెలిగించి ధ్వజారోహణం చేశారు.





దుర్గగుడి క్యూలలో వేచి ఉన్న భక్తులు

సుబ్బారాయుడికి ఒక్కరోజే రూ.10 లక్షలకుపైగా ఆదాయం

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్తీక దీపారాధనలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి రోజువారి నిర్వహించే అర్జిత సేవా కార్యక్రమాల ద్వారా ఆదివారం ఒక్కరోజు రూ.10,59,330లు సమకూరినట్టు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

టోల్‌గేట్ ఉద్యోగి అనుచిత ప్రవర్తన

వన్‌టౌన్ : దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుడిపై టోల్‌గేట్ వద్ద ప్రైవేటు ఉద్యోగి చేయిచేసుకున్నాడు. భవానీపురం జోజి నగర్‌కు చెందిన మెట్టు పిచ్చిరెడ్డి కుటుంబసభ్యులతో ద్విచక్ర వాహనంపై ఆదివారం దుర్గమ్మ దర్శనానికి వచ్చాడు. దర్శనం అనంతరం కొండపై నుంచి దిగుతుండగా టోల్‌గేట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఓ కారు పిచ్చిరెడ్డిని ఢీకొనబోయింది. దీంతో పిచ్చిరెడ్డి అక్కడ విధులు నిర్వహిస్తున్న టోల్‌గేట్ ఉద్యోగి సాయిని వాహనాలు ఆపి టిక్కెట్లు తీసుకునేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలని సూచించాడు. దీంతో ఆవేశంగా సాయి సమీపంలో ఉన్న పొంగలి గిన్నెతో పిచ్చిరెడ్డిని కొట్టాడు. భక్తులందరూ టోల్‌గేట్ ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సాయిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



స్వామివారి సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు



అప్పటి వరకు దీక్ష అయినా, మాలధారణ అయినా అయ్యప్పస్వామిదే. ఈ దీక్షలను చూసిన తర్వాత దుర్గమ్మకు ఇటువంటి దీక్షలు ఉంటే బాగుంటుందని నాటి అర్చకులు భావించారు. నాడు పుట్టిన ఈ ఆలోచన తెలుగు రాష్ట్రాల్లో నేడు లక్షలాది మందిని భవానీ దీక్షల వైపు నడిపించింది.



భవానీ దీక్షలకు 42 ఏళ్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



» 1982 నుంచి భవానీ మాలధారణ
» నాడు ఐదుగురితో దీక్ష ప్రారంభం
» నేడు 15లక్షలకు చేరిన మాలధారణలు
» దుర్గామల్లేశ్వర పీఠం గురూజీ నాగరాజుశాస్త్రి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)
ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు 1982 ముందు వరకు ఎలాంటి దీక్షలు, మాలధారణ లేదు. అయ్యప్పస్వామికి ఉన్నట్టుగానే కనకదుర్గమ్మకు ఒక మాల ఉంటే బాగుంటుందని ముగ్గురితో మొదలైన ఆలోచనకు 1982లో అంకురార్పణ జరిగింది. నాడు ఐదుగురితో మొదలైన దీక్షలు ఇప్పుడు 10లక్షలకు పైగా చేరుకున్నాయి. ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి పీఠం ఆధ్వర్యంలో సోమవారం నుంచి భవానీదీక్షల మాలధారణలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఇంద్రకీలాద్రిపై 42వ సంవత్సరం మాలధారణలు జరుగుతున్న సందర్భంగా పీఠాధిపతి యద్దనపూడి నాగరాజుశాస్త్రి(రాజాజీ గురూజీ)తో ప్రత్యేక ఇంటర్వ్యూ.



రాజాజీ

? ఇంద్రకీలాద్రి భవానీ దీక్షలు ఎప్పుడు ప్రారంభమయ్యాయి

● ఇంద్రకీలాద్రిపై 1980వ సంవత్సరంలో దుర్గామల్లేశ్వరస్వామి పీఠం ఉండేది. ఇది దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తోంది. ఆ రోజుల్లో అయ్యప్పస్వామి మాలలు బాగా ధరించేవారు. అయ్యప్ప దీక్ష మాదిరిగా కనకదుర్గమ్మ దీక్ష తీసుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచన నాడు వచ్చింది. దీక్షను తీసుకోవాలంటే కొన్ని నియమాలు, నిబంధనలు ఉంటాయి. 1982వ సంవత్సరంలో నేను, రాచకొండ కామేశ్వరశాస్త్రి, యనమండ్ర మల్లేశ్వరశాస్త్రి కలిసి భవానీదీక్షల గురించి ఆలోచించాం. ఈ ఆలోచన వచ్చిన తర్వాత మాతోపాటు నాటి ఆలయ ప్రధానార్చకులు లింగంభట్ల రామకృష్ణశర్మ, రాచకొండ లక్ష్మణశాస్త్రి ఐదుగురు కలిసి కంచి పీఠానికి వెళ్లాం. అప్పటి కంచి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతిని కలిసి విషయం చెప్పాలనుకున్నాం. మేము వెళ్లే సరికి ఆయన పీఠంలో లేరు. కంచికి 40 కిలోమీటర్ల దూరంలో ఆయన ఒక యాగంలో బిజీగా ఉన్నారు.

? చంద్రశేఖర సరస్వతి స్వామి ఏమన్నారు

● స్వామిజీని కలిసి కనకదుర్గమ్మకు ప్రత్యేక దీక్ష తీసుకుని, మాలధారణ చేయాలనుకుంటున్నామని వివరించాం. దీనికి చంద్రశేఖర సరస్వతి శుభం పలికారు. అయ్యప్పస్వామి దీక్షలా కనకదుర్గమ్మకు దీక్ష తీసుకోవచ్చని చెప్పారు. అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్న భక్తులు నలుపు రంగు దుస్తులు ధరిస్తారు కాబట్టి కనకదుర్గమ్మకు ఎరుపు రంగు అంటే ప్రీతికరం అయినందున మాలధారణలో ఆ రంగు దుస్తులను ధరించాలని స్వామిజీ సూచించారు. తర్వాత మమ్మల్ని ఆశీర్వదించి దీక్షకు సంబంధించిన ఏర్పాటు చేసుకోమని ఆదేశించి పంపించారు.

? తొలిసారిగా ఎంతమంది మాలధారణ చేశారు

● కంచి పీఠాధిపతి 1982లో కనకదుర్గ దీక్షకు ఆమోదం తెలిపిన తర్వాత తొలిసారిగా మేము ఐదుగురం కలిసి భవానీదీక్షలు తీసుకున్నాం. కొండపై పీఠం ఉన్నందున ఇక్కడే దీక్షలు తీసుకున్నాం. చంద్రశేఖర సరస్వతి వద్దకు వెళ్లిన ఐదుగురు మొదటిసారిగా మాలధారణ చేశాం. ఆ సంవత్సరమే భవానీ మాలధారణకు అంకురార్పణ జరిగింది. అయ్యప్ప మాలధారణ మాదిరిగా కార్తీక శుద్ధ ఏకాదశి నుంచి మాలధారణలు మొదలవుతాయి. నేటికీ ఇదే కొనసాగుతోంది.

? ఇప్పుడు మాలధారణల సంఖ్య ఎంత

● తొలుత భవానీదీక్ష ఐదుగురితో మొదలైనా తర్వాత ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. 1983లో పది మంది, 1984లో 20 మందికి దీక్షలు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రతీఏడాది అమ్మవారి మాలధారణలు చేసే వారిసంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ప్రతి ఏడాది 10-15లక్షల మంది భవానీ దీక్షలు తీసుకుంటున్నారు. దీక్షధారుల్లో ఉత్తరాంధ్ర భక్తులు అధిక సంఖ్యలో ఉంటారు. మొదటిసారిగా భవానీ దీక్ష తీసుకున్న తర్వాత విజయవాడలో అమ్మవారి మాలధారణ కోసం ప్రచారం చేశాం. విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలో కొందరు మాలధారణకు ముందుకొచ్చారు. భవానీ దీక్షల గురించి పీఠం ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లోను ప్రచారాలు ప్రతి ఏడాది జరుగుతాయి.

వ్యాపార కేంద్రంగా బందరు

» ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలకు స్థలం
» ఎంఎస్ఎంఈ ద్వారా రుణాలు, నిరుద్యోగ యువతకు శిక్షణ
» మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



అతిథులను సత్కరిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువ పారిశ్రామికవేత్తలందరికీ శిక్షణ ఇస్తూ రుణాలు, వనరులు కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సత్య కన్వెన్షన్ హాలులో 72 వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులు మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మరో ఏడాదిలో మచిలీపట్నంలో 60 పరిశ్రమల సాపనకు ప్రణాళిక రూపొందించామని, యువ పారిశ్రామికవేత్తల లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. బందరు పోర్టు ఏర్పడుతున్నందున సీఎం చంద్రబాబు పోర్టు ఆధారిత అనుబంధ పరిశ్రమలతో పాటు యువత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు కావలసిన వనరులు, శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. మచిలీపట్నంలో మరో జ్యూయలరీ పార్కు ఏర్పాటు చేసి వివిధ వ్యాపార సంస్థలకు బ్యాంకు రుణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇందుకు కావలసిన స్థలాన్ని అన్వేషిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ వంద ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయించి నిరుద్యోగ సమస్యను పారద్రోలుతామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల మాట్లాడుతూ, రాష్ట్రాన్ని వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు చంద్రబాబు కృషిచేస్తున్నారని, ఈ అవకాశాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, కష్టపడి పనిచేస్తే వ్యాపార రంగంలో రాణించవచ్చన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ముద్దుల గిరీష్ మాట్లాడుతూ, ప్రభుత్వం ముందుకు వస్తే మచిలీపట్నంలో వ్యాపార రంగాలు అభివృద్ధి చెందే అవకాశాలున్నాయన్నారు. వ్యాపార రంగంలో విజయాలు సాధించిన పలువురు వ్యాపార వేత్తలను మంత్రి రవీంద్ర సత్కరించారు.

బీసీలకు సముచిత స్థానం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : గీత కార్మికులకు ఇచ్చిన వాగ్దానం మేరకు త్వరలో 340 వైన్‌షాపులకు నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో హర్ష కళాశాల ప్రాంగణంలో వీరంకి గురుమూర్తిని గౌడ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చిన సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను గౌడ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు త్వరలో బీసీల రక్షణ చట్టం తీసుకుని వస్తామన్నారు. రాష్ట్రమంతటా తిరిగి బీసీల సమస్యపై అధ్యయనం చేసి నివేదికను సీఎం చంద్రబాబుకు సమర్పించామన్నారు. రాష్ట్రంలో బీసీ కులాలు ఎక్కువ శాతం ఉన్నందున బీసీలకు కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం లభించిందన్నారు. వీరంకి గురుమూర్తికి గౌడ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. గీత కార్మికులు తీసే కల్లును పులియబెట్టి కొన్ని ఔషధాలను వెలికితీసేందుకు పరిశోధన చేపడుతున్నామన్నారు. వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ, తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ బీసీ సెల్ నేత కొనకళ్ల బుల్లయ్య, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకుడు కేవీవీ సత్యనారాయణ, బి.నాగబాబు, ఎస్.రాంబాబు, గౌడ ఉద్యోగుల సంఘ నాయకులు రాము, ఎం.శ్యామ్‌నాథ్, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వీరంకి గురుమూర్తిని సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గౌడ సంఘాల నాయకులు

నూతన విద్యా సంస్కరణలతో ప్రమాదం!

» మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

గన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా సంస్కరణల ప్రమాదాన్ని గుర్తించకపోతే విద్యార్థి, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, కొత్త ఉద్యోగాలు రాక యువత భవిష్యత్ అగమ్య గోచరం అవుతుందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. గన్నవరం రోటరి ఆడిటోరియంలో షేక్ సాబ్జి వేదికలో రెండు రోజుల పాటు జరిగిన యూటీఎఫ్ కృష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారంతో ముగిసాయి. సభలకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన శర్మ మాట్లాడుతూ 50ఏళ్ల విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. నూతన ఆర్థిక సంస్కరణల ప్రభావం ఉద్యోగులపై ఎక్కువగా ఉంటుందన్నారు. పాము మీద కోపంతో పక్షి ముంగిసను తీసుకువచ్చినట్టు ప్రస్తుత ఉపాధ్యాయుల పరిస్థితి ఉందని, కాపాడేందుకు పెట్టుకున్న ముంగిస తిరిగి పక్షిని తినేసిందని దీన్ని బట్టి పాలకులు ఎవరైనా విద్యారంగాన్ని తినేస్తారనే విషయాన్ని ఉపాధ్యాయులు గమనించాలన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయలేక ఇంకో అడుగు ముందుకు వేసి కార్పొరేట్ విద్యకు పెద్ద పీట వేసినా ఆశ్చర్యపడాల్సింది లేదన్నారు. ఈ ప్రభావం పాఠశాలలపై పడుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసే పరిస్థితి లేదని దీనిపై పోరాడేందుకు సంఘటితంగా ఉండే సంఘాలు తగ్గిపోతున్నాయన్నారు. 94శాతం మంది ప్రయివేటు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ప్రవేటైజేషన్ అంటేనే సెంట్రలీకరణ అన్నారు. కార్పొరేట్ కాలేజీలు, ఆస్పత్రులు గ్రామాల్లో పెట్టరని పట్టణాల్లో పెట్టి అందరిని అక్కడికి రప్పిస్తారన్నారు. ప్రభుత్వ రంగంలో అయితే అది జరగదన్నారు. దేశంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిలో 15శాతం మందికి మాత్రమే అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తున్నాయని, మిగిలిన వారు సచివాలయాల్లో, వలంటీర్‌లలో ఇంజనీర్‌లు ఉండటమే దానికి నిదర్శనమన్నారు. విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలే శరణ్యమన్నారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు కేఏ ఉమామహేశ్వరరావు, ఎస్పీ మనోహర్, నక్కా వెంకటేశ్వర్లు, జె.లెనిన్ బాబు, ఎన్.ప్రభాకర్, హుస్సేన్, మరీదు వరప్రసాద్, రాజాబాబు, రవిబాబు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

అంతా బూడిదే!

(5వ పేజీ తరువాయి)

శిథిలావస్థలో చిమ్నీలు

ఎప్పుడో నిర్మించిన 210 మెగా యూనిట్లలో ఉన్న పాత చిమ్నీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని తొలగించాల్సి ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఆ చిమ్నీల నుంచి పెద్ద ఎత్తున కాలుష్యం వస్తుంది. తక్షణం వాటిని తొలగించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

ఎన్టీటీపీఎస్ నుంచి బూడిద మంచులా పడటం, రవాణా చేసే టిప్పర్ల నుంచి రోడ్డుపై గుట్టలు గుట్టలుగా పడటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కూడా ఇదే కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. పొగ మంచులా బూడిద కమ్మేయడంతో రహదారి పక్కనే ఆగి ఉన్న లారీని కారు ఢీ కొని సత్యనారాయణపురానికి చెందిన తల్లీకూతుళ్లు కాసుల కవిత, హర్షిత మృతి చెందారు. బూడిద చెరువు నుంచి బూడిదను రవాణా చేసే టిప్పర్లకు ఉన్న రంధ్రాల నుంచి నీటితో పాటు బూడిద కారుతోంది. ఇలా కారిన బూడిద వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు 100కు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. సుమారు 10 మందికి పైగా మరణించగా, పలువురు క్షతగాత్రులయ్యారు. రహదారులపై కారే బూడిదను ఎన్టీటీపీఎస్ అధికారులు శుభ్రం చేయాల్సి ఉండగా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పోరాటం ఫలించేనా!

మా ప్రాణాలు హరించే ఎన్టీటీపీఎస్ మాకొద్దు అంటూ వారం రోజుల కిందట కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు ఎన్టీటీపీఎస్ కొత్త గేటు ఎదుట సుమారు నాలుగు గంటల పాటు బైటాయించి నిరసన తెలిపారు. బూడిద చేతులతోనే అల్పాహారం తిని రోడ్డు ఊడ్చి ప్లాంట్లో పోసి పెద్ద పెట్టున ప్లాంట్ యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. చర్చలకు వచ్చిన ప్లాంట్ ఉన్నతాధికారి ముఖంపై బూడిద కొట్టి మరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది నుంచి ఉద్యమం చేస్తున్నా ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులకు చీమ కుట్టినట్లు ఉండటం లేదు.

ఉద్యమంతోనే అడ్డుకోగలం



ప్రజా ఉద్యమాల ద్వారానే ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యాన్ని అడ్డుకోగలం. పార్టీలకు అతీతంగా అందరూ ఉద్యమానికి సహకరించాలి. ఇప్పటికే వాయు కాలుష్యంతో అల్లాడిపోతున్నాం. జాగ్రత్త పడకపోతే పిల్లల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.

– అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ),
కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యుడు



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

శ్రీగౌరీదేవిగా భ్రమరాంబ

వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం(పాత శివాలయం)లో కార్తీకమాసం నక్త దీక్షా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భ్రమరాంబ అమ్మవారు శ్రీగౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. త్రిశతి ఖడ్గమాల, సహస్రనామార్చన, మల్లేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.



ఇదీ నేపథ్యం..

ఆంధ్రా లయోలా కళాశాల క్రీడా ప్రాంగణంలో లయోలా వాకర్స్ క్లబ్ పేరుతో పాతికేళ్లుగా వేలాది మంది వాకింగ్ చేస్తున్నారు. ప్రతి ఉగాదికి పోటీలు నిర్వహించేవారు. అమరావతి రన్నర్స్ పేరుతో సంఘాన్ని స్థాపించి జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. 2019లో కరోనా సమయం నుంచి యాజమాన్యం గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతించడం లేదు. అప్పటి నుంచి యాజమాన్యాన్ని అనుమతించమని వాకర్స్ అడుగుతున్నారు. రోమ్ నుంచి అనుమతులు రావాలంటూ యాజమాన్యం మాటలు దాటేస్తూ వస్తోంది. దీంతో వాకింగ్ కోసం వాకర్స్ సమీపంలోని రోడ్లు, కాలనీలోని వీఎంసీ పార్కుల్లోకి వెళ్తున్నారు. వాకింగ్‌కు అనుమతించాలని కళాశాల యాజమాన్యాన్ని పలుమార్లు కోరామని, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని వాకర్స్ చెబుతున్నారు.



లయోల క్రీడా ప్రాంగణంలో

లయోల కళాశాల మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న వాకర్స్

వాకింగ్‌కు అనుమతివ్వండి

కళాశాల గేటు ఎదుట వాకర్స్ ఆందోళన..గంట తర్వాత తాత్కాలిక అనుమతులు

భారతీనగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల క్రీడా ప్రాంగణంలో నడిచేందుకు యాజమాన్యం అనుమతించాలంటూ ఆదివారం వాకర్స్ అందరూ ఒక్కసారిగా కళాశాల మెయిన్‌గేటు వద్దకు చేరుకున్నారు. కళాశాల గేటు వద్ద సిబ్బంది అనుమతించకపోవడంతో యాజమాన్యం తీరుపై ఆందోళనకు దిగి నిరసన చేశారు. సుమారు గంట తర్వాత తాత్కాలిక అనుమతులు రావడంతో ప్రాంగణంలోనికి వెళ్లి వాకింగ్ చేశారు.

రోమ్ నుంచి అనుమతులు రావాలంటున్నారు



గ్రౌండ్లో వాకింగ్ చేయడానికి అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో సమీపంలోని రోడ్లపైన వాకింగ్ చేస్తున్నాం. రోడ్లపైన వాకింగ్ కారణంగా ఆరోగ్య సమస్యలతో పాటు ఐదేళ్లలో ముగ్గురు వాకర్స్ ప్రమాదాల కారణంగా మరణించారు. పాతికేళ్ల నుంచి ఈ గ్రౌండ్‌ల్లో వాకింగ్‌కు వస్తున్నా. కరోనా ముందు వరకు ఉదయం ఐదు గంటల నుంచి 7.30 గంటల వరకు వాకింగ్ చేసేవాళ్లం. ఈరోజు వాకింగ్ చేయడానికి వాకర్స్ అందరం వస్తే మమ్మల్ని అడ్డుకోవడానికి పది మంది బాడీ బిల్డర్లను యాజమాన్యం ఉంచింది. ఇది వారు కావాలని చేస్తున్నారని అర్థమవుతోంది. - రావి రమేష్

జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేవారు



ఎంతోమంది ఆంధ్రా లయోలా వాకర్స్ పాతికేళ్లుగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని ప్రకృతి, అమరావతి రన్‌గ్రూపులు ఏర్పడ్డాయి. ఈ వాకర్స్ తరఫున ఏటా కాలేజీలోని పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేవారు. ప్రతి నెలా ఉచిత వైద్యశిబిరం నిర్వహించేవారు.

-రావి తనూజ

20 మెడల్స్ సాధించా



పాతికేళ్ల నుంచి ఈ గ్రౌండ్‌లో వాకింగ్ చేసేవాడిని. యాజమాన్యం గ్రౌండ్‌లోకి అనుమతించకపోవడంతో రోడ్డుపై వాకింగ్ చేయాల్సి వస్తోంది. వాకర్స్ తరఫున జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని 20 మెడల్స్ సాధించాను. గడిచిన మూడేళ్లలో మూడు బంగారు పతకాలు సాధించాను.

-కె.మల్లికార్జున

అన్ని కళాశాలలు అనుమతిస్తున్నాయి



నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు వాకింగ్‌కు అనుమతిస్తున్నాయి. సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, సిద్ధార్థ కళాశాలల్లో ఉదయం, సాయంత్రం పెద్దలు వాకింగ్ చేస్తున్నారు.

- గారపాటి నీలవేణి

10వ డివిజన్ అభివృద్ధికి సహకరిస్తా

- ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హామీ



అక్కినేని పూర్ణచంద్రరావు వీఎంసీ పార్కును సందర్శిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

పటమట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని 10వ డివిజన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. పటమటలోని అక్కినేని పూర్ణచంద్రరావు వీఎంసీ పార్కును ఆదివారం ఆయన సందర్శించారు. పార్కులో ఆగిపోయిన పనులు, కావాల్సిన సదుపాయాలపై ఎంపీకి కార్పొరేటర్ దేవినేని అపర్ణ వివరించారు. పార్కులో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను అభి వృద్ధి చేయాలని ఆమె కోరారు. పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ కోర్టు, ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు మంచి సదుపాయాలతో పార్కును అభివృద్ధి చేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభించేలా చూస్తానన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ వసీంబేగ్, మారుతీ కో-ఆపరేటివ్ కాలనీ ప్రెసిడెంట్, కమిటీ సభ్యులు కేజీ తిలక్, ఎం నాగేశ్వరరావు, ఎస్ ఆర్ ఠాగూర్, పి సురేంద్రనాథ్, రాజ్ బిహారీ గుప్తా పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

- శుక్రవారం డ్రై డేగా పాటించండి
- నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్



నారా చంద్రబాబునాయుడు కాలనీలో డ్రెయిన్‌లో మందు పిచికారీ చేస్తున్న మలేరియా సిబ్బంది

చిట్టినగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు వీఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సహకరించాలని నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ కోరారు. ఆదివారం బెంజ్‌సర్కిల్ నారా చంద్రబాబునాయుడు కాలనీలో దోమల నివారణ చర్యల్లో భాగంగా యాంటీ లార్వా ఆపరేషన్ పనులు చేశామన్నారు. సైడ్ డ్రెయిన్‌లో ఆయిల్ బాల్స్ వేసి, ల్వారా వృద్ధి చెందకుండా ఫైరత్నం స్ప్రేయింగ్ చేయించామన్నారు. డ్రెయిన్‌పై చెప్టా లున్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించామన్నారు. 'నగర వ్యాప్తంగా దోమల నిర్మూలనకు యాంటీ ల్వారా ఆపరేషన్ పనులు నిర్వహిస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక టీమ్‌ల ద్వారా నివారణ చర్యలు చేపడుతున్నాం. రోజూ డివిజన్ వారీగా ఫాగింగ్ చేయిస్తు న్నాం. ల్వారా దశలోనే దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయి స్తున్నాం. దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్నాం. ప్రజలు సహకరించి వారంలో శుక్రవారం డ్రై డేగా పాటించి ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా, కొబ్బరి బొం డాలు, పాతటైర్లు లేకుండా, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసు కోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అని ప్రజలకు సూర్య కుమార్ సూచించారు. ఇంటి పరిసరాల్లో ఎవరికైనా జ్వరంగా ఉంటే వెంటనే సమీపంలో ఆరోగ్య కేంద్రానికి వెళ్లి మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.





సహస్రలింగార్చన చేస్తున్న పండితులు

దుర్గగుడిలో సహస్రలింగార్చన

వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సహస్రలింగార్చన చేశారు. మల్లేశ్వరస్వామి సన్నిధిలో సహస్రలింగాలకు అభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన చేశారు. సాయంత్రం సమయంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఊంజల్ సేవతో మిళితం చేసి భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఆకాశదీపాన్ని వెలిగించి ధ్వజారోహణం చేశారు. సకల జనుల ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ అందరికీ శుభాలు కలగాలని కోరుతూ దుర్గగుడిలో అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అరుణ పారాయణ, సూర్య మంత్ర జపం నిర్వహించి స్వామికి తర్పణ చేశారు.



దుర్గగుడి కళావేదికపై మహా సత్సంగం నిర్వహిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

దుర్గమ్మ సేవలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి దుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న పండితులు

కనకదుర్గమ్మను మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు అనుబోలు రంగశ్రీ దంపతులు, తమ్మిశెట్టి జానకీదేవి దంపతులు, ఆర్.ఎస్.దర్శన్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. ఈవో రామారావు అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.

అన్నవితరణకు రూ.లక్ష వితరణ

దుర్గగుడిలో అన్న వితరణకు హైదరాబాద్, మణికొండకు చెందిన సట్నూరి కావ్య, రాఘవేంద్ర ఈవో కె.ఎస్.రామారావు ద్వారా రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో దేవస్థానానికి అందజేశారు.

కళావేదిక పై మహా సత్సంగం

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు ఆదివారం మహా సత్సంగం పేరున వన్‌టౌన్‌లోని వీధుల్లో భజన చేసుకుంటూ బ్రాహ్మణ వీధి నుంచి కనకదుర్గానగర్‌కు, అక్కడ నుంచి ఆలయానికి పాదయాత్రగా వచ్చారు. అనంతరం కళావేదికపై శివ భజనలు, ఇతర భక్తి కీర్తనలు ఆలపించారు. శివభజనల పాటలకు భక్తులు హర్షధ్వానాలు చేశారు. బృందానికి ఏఈవో సుధారాణి అభినందనలు తెలిపారు.

1 నుంచి టోల్‌గేట్ రుసుం వసూలు

ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డులో టోల్‌గేట్ నిర్వహణ లైసెన్స్‌ను రెండో ఏడాది రద్దు చేయడంతో డిసెంబరు 1వ తేదీ నుంచి దేవస్థానమే టోల్‌గేట్ రుసుమును వసూలు చేయనుంది. అందుకోసం సిబ్బందిని దేవస్థానం సిద్ధం చేస్తోంది. కొండపైన అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకల నియంత్రణ జరుగుతున్నందున రెండో ఏడాది లీజును రద్దు చేసి దేవస్థానమే టోల్‌గేట్ ఫీజును వసూలు చేయనుంది. ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులలో ముగ్గురు చొప్పున సిబ్బంది టోల్ రుసుమును వసూలు చేయనున్నారు.

వస్త్ర వ్యాపారి ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ వస్త్ర వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన వస్త్రవ్యాపారి షేక్ ఇందాస్(33)కు తన భార్యతో మనస్పర్థలు వచ్చి కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. భార్య ఆరు నెలలుగా విడిగా ఉంటోంది. ఇందాస్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనండి

- ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్‌కు ఆహ్వానం



వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర జలగాంలోని నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్‌కు ఆహ్వానం అందింది. ఏపీ ఎన్ఎస్ఎస్ కంటింజెంట్ లీడర్‌గా ఆయన ఎంపికయ్యారని, పరేడ్‌లో పాల్గొనాలని ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ ఉత్తర్వులు పంపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 16 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల నుంచి 22 మంది బాలురు, 22 మంది బాలికలు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శిబిరానికి ఎంపికయ్యారని తెలిపారు. శిక్షణ పొంది ఈనెల 22న తిరిగి వస్తారని అనంతరం జనవరి 26న న్యూఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. రమేష్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, జిల్లా ఆఫీసర్లు, పట్టణ ప్రముఖులు అభినందించారు.





ఈఎస్ఐ బస్టాప్ సెంటర్‌లో రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులు, ఏలూరు రోడ్డులోని మోడల్ డెయిరీ ఎదురుగా డివైడర్ కటింగ్

ప్రమాదాలకు దారితీసేలా..

- ఈఎస్ఐ సెంటర్‌లో రాంగ్‌రూట్‌లో వాహనాలు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్): ఏలూరు రోడ్డులోని ఈఎస్ఐ బస్టాండ్ సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. గుణదల నుంచి ఈఎస్ఐ రోడ్డులోకి ప్రయాణించాల్సిన వాహనదారులు ఈ సెంటర్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుణదల నుంచి ఈఎస్ఐ రోడ్డులోకి వెళ్లాల్సిన వారి కోసం ఏలూరు రోడ్డులో ఈఎస్ఐ బస్సు సెంటరుకు సమీపంలోని మోడల్ డెయిరీ ఎదురుగా మధ్యలో సెంట్రల్ డివైడర్ ఏర్పాటు చేశారు. ఈసెంటర్‌లో ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వాహనదారులు ఈ సెంటర్ ముందున్న డివైడర్ కటింగ్ ద్వారా రాంగ్ రూట్‌లో ఈఎస్ఐ రోడ్డులోని ప్రవేశిస్తున్నారు. ఎదురుగా వస్తున్న వాహనదారులను ఢీకొంటున్నారు. అధికారులు స్పందించి వాహనదారులు రాంగ్‌రూట్‌లో రాకుండా చూడాలని కోరుతున్నారు.

వనం.. జనం





భవానీ ద్వీపంలో..

మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో..



భవానీద్వీపం రెస్టారెంట్‌లోకి వెళుతూ..





నున్న శివారు మామిడి తోటల్లో..



నున్న మామిడి తోటలో మహిళల సెల్ఫీ



బోటులో భవానీద్వీపానికి వెళుతూ..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆదివారం నాడు కార్తీక వన సమారాధనలు విరివిగా జరిగాయి. విజయవాడలోని భవానీ ద్వీపం, నగర శివారులోని నున్న మామిడి తోటల్లో పలు సంఘాలు కుటుంబాలతో వచ్చి సందడి చేశారు. సభ్యులంతా సామూహికంగా వన భోజనాలు చేస్తూ కబుర్లు చెప్పుకొన్నారు. భవానీద్వీపం సందర్శకులతో సందడిగా మారింది. చిన్న పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా ఆటలాడి డ్యాన్సులు చేశారు. కొంత మంది యువతులు ఉయ్యాలలు ఎక్కి ఊగుతూ ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మచిలీపట్నంలోని మంగినపూడి సాగరతీరానికి ఉమ్మడి జిల్లాల నుంచి సందర్శకులు తండోపతండాలుగా వచ్చారు. సముద్రంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సామూహిక భోజనాలు చేసి సాయంత్రం ఇంటిదారి పట్టారు.

నేడు తుమ్మలపల్లిలో అబుల్ కలాం ఆజాద్ జయంతి



ఎంఎస్ బేగ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, మైనార్టీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం మంత్రి ఎన్ ఎండీ ఫరూక్ పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య నేతలు, అధికారులు పాల్గొంటున్నందున ఏర్పాట్లు పక్కాగా ఉండాలని మంత్రి సూచించారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ఎ.కొండూరు, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి చెందిన ఘటన ఎ.కొండూరు చైతన్యనగర్ తండాలో జరిగింది. గ్రామస్తుడు బాణావతు రామ్‌జీ(60) కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల డయాలసిస్ చేయించుకొంటున్నారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థత గురై విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

మిస్సింగ్ కేసులకు ప్రత్యేక టీం

- ఆరుగురితో ఒక బృందం ఏర్పాటు
- టీం హెడ్‌గా ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

విజయవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆడుకోవడానికి వెళ్లిన అబ్బాయి తిరిగి రాలేదు. అమ్మ మందలించిందని అమ్మాయి వెళ్లిపోయింది. ఇలా పలు పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసులివి. కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న మిస్సింగ్ కేసులను ట్రాక్ చేయడానికి ఒక ప్రత్యేక బృందాన్ని పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు నియమించారు. ఈ టీంలో మొత్తం ఆరుగురుంటారు. ఇన్‌స్పెక్టర్ పుల్లా చంద్రశేఖర్‌ను హెడ్‌గా నియమించారు. మహిళా ఎస్ఐ హైమావతి సహా ఇద్దరు హెచ్‌సీలు, మరో ఇద్దరు పీసీలుంటారు. ఈ టీం మొత్తం మిస్సింగ్ కేసులపై పనిచేస్తుంది. ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో 114 మహిళలు, ఏడుగురు బాలికలను పోలీసులు గుర్తించారు. ఇంకా కొంతమంది ఆచూకీ దొరకాల్సి ఉంది. వాటిని ఛేదించడానికి ఈ ప్రత్యేకబృందాన్ని నియమించారు.

రిలయన్స్ స్మార్ట్‌లో సిబ్బంది చేతివాటం

- లక్షల విలువైన వస్తువులు అపహరణ

ఉయ్యూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిలయన్స్ స్మార్ట్‌లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి రూ. 12,43,000 విలువైన వస్తువులు కాజేసినట్టు ఫిర్యాదు అందిందని ఉయ్యూరు పట్టణ ఎస్సై విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. రిలయన్స్ స్మార్ట్‌లో పనిచేసిన ఈడే హర్షిత, వల్లూరి భావన్, కొడాలి వనరాజు కలిసి పథకం పన్నారు. వనరాజు షాపింగ్ చేసిన వస్తువుల్లో ఈడే హర్షిత కొన్ని వస్తువులకు మాత్రమే బిల్ చేయగా గేట్‌కీపర్ భావన్ పథకం ప్రకారం వనరాజును గేట్ వద్ద సరిగా తనిఖీ చేయకుండా పంపేసినట్టు సీసీ టీవీలో గుర్తించారు. కొంతకాలంగా ఆడిట్‌లో తేడాలు రావడంతో ఈ ముగ్గురు మోసానికి పాల్పడ్డారని భావించినట్టు రిలయన్స్ స్మార్ట్ మేనేజర్ ప్రభాకరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

13న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ధర్నాచౌక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిత్రలేఖనంపై ఆసక్తి కల్పించేందుకు బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడెమీ ఛైర్మన్ పి. రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంత్ డైమండ్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల, డ్రీమ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడెమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు స్పా కళాశాల ఆవరణలో జరుగుతాయన్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు ఏదైనా అంశంపై, 6, 7 తరగతుల వారు ల్యాండ్ అండ్ స్కేప్ అనే అంశం, 8,9,10 విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, ఇంటర్ వారు ప్రపంచశాంతి, డిగ్రీ విద్యార్థులకు జాతీయ సమగ్రత అనే అంశాలపై పోటీలుంటాయన్నారు. విజేతలకు 17న బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

మార్క్సిస్టు సిద్ధాంతం ఆచరణకు లెనిన్ కృషి

ధర్నాచౌక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్క్సిస్టు సిద్ధాంతానికి, ఆచరణకు లెనిన్ చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. మెరుగైన సమాజాన్ని నిర్మించగలిగే సిద్ధాంతాన్ని మార్క్స్, ఎంగెల్స్ రూపొందించారన్నారు. దాన్ని ఆచరణలో నిజం చేసిన మొదటి వ్యక్తి లెనిన్ అని పేర్కొన్నారు. రష్యా సోషలిస్టు విప్లవ వార్షికోత్సవం, లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సోషలిస్ట్ ప్రాక్సిస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విప్లవ లక్ష్యాన్ని ఏనాడు విస్మరించకపోవడమే లెనినిజం ప్రత్యేకత అన్నారు. న్యూ సోషలిస్ట్ ప్రాక్సిస్ నేత ఆర్.రఘు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేరళకు చెందిన ప్రముఖ ప్రొఫెసర్ బిపిన్ బలరామ్, న్యూ సోషలిస్ట్ ప్రాక్సిస్ నేతలు జయప్రకాష్, ఎస్. సురేష్ పాల్గొన్నారు.





ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వీఆర్ సిద్ధార్థ పై వంతెన రోడ్డు

ఐదు నెలల్లో అందుబాటులోకి..

- వీఆర్ సిద్ధార్థ పైవంతెన రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం
- నేడు ప్రారంభించనున్న మంత్రి నారాయణ

పెనమలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటకాల్వ రోడ్డులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల పైవంతెన రోడ్డును నేడు పురపాలక మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభించిన పంటకాల్వ రోడ్డు వీఆర్ పై వంతెన నిర్మాణం పూర్తయినా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వంతెనపై సౌండ్ బ్యారియర్లు, క్రింది భాగంలో డ్రెయిన్ నిర్మించకపోవడంతో రోడ్డు వేయలేదు. దీనిపై ఆంధ్రజ్యోతి పలు కథనాలను ప్రచురించింది. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవ తీసుకుని వేగంగా బ్యారియర్లు పూర్తి కావడం, డ్రైన్ నిర్మాణం వేగవంతమవడంతో సిద్ధార్థ అకాడమీ వారు వంతెనపై బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి వంతెనను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. రోడ్డు నిర్మాణం పూర్తవడంతో నేడు మంత్రి నారాయణ, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరి ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుంచి పంటకాల్వ రోడ్డులోకి ప్రవేశించి తాడిగడప వందడుగుల రోడ్డును చేరేందుకు ఈ వంతెనే కీలకంగా ఉంది.



ఇంకెన్నాళ్లు..!

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

అధికారంలోకి వచ్చిన వెంటనే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీఆర్ కళాశాల పైవంతెనను అందుబాటులోకి తెస్తామని ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఇచ్చిన హామీ మేరకు సీఆర్డీయే, తాడిగడప మునిసిపల్ అధికారులు, సిద్ధార్థ అకాడమీ వారు పూర్తి సమన్వయంతో వంతెన పనులు, డ్రైన్ల పనులు, సౌండ్ బ్యారియర్ల పనులను అనుకొన్న సమయంలోనే పూర్తి చేయగలిగారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేని వంతెన పనులను కూటమి ప్రభుత్వం 5 నెలల్లోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే బోడె పేర్కొన్నారు. వంతెన పనులను ఇంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ కానూరు నేత అంగిరేకుల మురళి వ్యాఖ్యానించారు. ఈ వంతెనపై రాకపోకలతో బందరు రోడ్డుపై ప్రయాణ రద్దీ చాలావరకు నియంత్రణలోకి వస్తుందని భావిస్తున్నామన్నారు.

ఇళ్ల స్థలాల సాధనకు లబ్ధిదారులు ముందుకు రావాలి

- 18న సచివాలయాల్లో అర్జీలివ్వాలని పిలుపు
- లబ్ధిదారులకు అండగా ఉండాలని శ్రేణులకు రామకృష్ణ పిలుపు



మొగల్రాజపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ చేపట్టిన కార్యక్రమానికి ఇళ్ల లబ్ధిదారులు ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ, నగర కార్యదర్శులతో ఆయన ఆదివారం నగరంలో పార్టీ కార్యాలయం నుంచి నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జూమ్ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు నివాస స్థలాలిస్తామని ఇచ్చిన హామీ నేరవేర్చాలన్నారు. లబ్ధిదారుల్లో 90 శాతం దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారున్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం సెంటు స్థలం, ఇల్లు కట్టుకోవడానికి రూ.లక్ష 80 వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. అపుడు వేసిన లే అవుట్‌లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. కంకరు, ఇసుక, ఇటుక ఇతర మెటీరియల్స్ ధరలు పెరిగినందున ప్రతి ఇంటి నిర్మాణానికి అదనంగా ఖర్చవుతోందన్నారు. పేదల ఇలాంటి బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సీపీఐ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరించాలని సూచించారు. ఆ లబ్ధిదారులతో ఈ నెల 18న సచివాలయాల వద్ద అర్జీలు సమర్పించాలన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు అప్పటి వైసీపీ ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో పనులు పూర్తికాక లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదన్నారు. బ్యాంకులు రుణాలు చెల్లించమని ఒత్తిడి తీసుకొస్తున్నాయన్నారు. ఇలాంటి విషయాలపై, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు పెంచడంపై నిరసనలు చేపట్టాలని, సభ్యత్వ నమోదు చేపట్టాలని, పాత సభ్యత్వాలను పునరుద్ధరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగర, పట్టణ కార్యదర్శులు పాల్గొన్నారు.



దూండీ రాకేశ్, శావల దేవదత్‌ను అభినందిస్తున్న ఎంపీ శివనాథ్

దూండీ, శావలకు ఎంపీ అభినందన

వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎన్నికైన దూండీ రాకేష్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. గురునానక్ కాలనీ ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం శివనాథ్‌ను దూండీ రాకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీ శుభాకాంక్షలు అందజేసి అభినందించారు. పార్టీకి మరింతగా సేవలందించి ప్రజల మన్ననలను చూరగొని రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు దూండీ తనవంతు కృషి చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారులను వైసీపీ నేతలు ఇబ్బందులకు గురిచేశారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు రాకేష్ పోరాటం చేశారన్నారు. వ్యాపారవర్గాలను ఏకం చేయటంలో రాకేష్ కీలక పాత్ర వహించారని కొనియాడారు. శివనాథ్ రాకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

శావల దేవదత్‌కు శుభాకాంక్షలు

రాష్ట్ర ఆర్గానిక్ ఉత్పత్తుల ధ్రువీకరణల అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన శావల దేవదత్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శుభాకాంక్షలు తెలిపారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని ఆదివారం దేవదత్ మర్యాదపూర్వకంగా కలిశారు. దేవదత్‌కు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి అభినందించారు. ప్రజలకు మరింత సేవ చేసి మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు. తిరువూరు ఇన్‌చార్జిగా ఉంటూ తనకు ఎమ్మెల్యే టిక్కెట్ రాకపోయినా సరే నిరాశపడకుండా క్రమశిక్షణ గల నేతగా పార్టీ గెలుపునకు కృషి చేశారని ఎంపీ కొనియాడారు. దేవదత్ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు యువత ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి మాదల హరిచరణ్ కిట్టు, టీడీపీ నేతలు అర్జునరావు, నవీన్, హుస్సేన్, సుమీత్, ఉమర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల ధర్నా

ధర్నాచౌక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో వివిధ విపత్తుల సందర్భంగా ప్రజలకు అనేక సేవలందించిన 104 డ్రైవర్లు, డీఈవోల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో 104 ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 104 సర్వీస్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు.

అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తమను ఆప్కాస్‌లో విలీనం చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు ఎం.శ్రీనివాస్, రాజేష్, ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.





పోటీల్లో తలపడుతున్న బాలుర జట్లు

ఉత్కంఠగా వాలీబాల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా స్కూల్‌గేమ్స్ అండర్-19 సెక్రటరీ వీ రవికాంత పర్యవేక్షణలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో 68 ఏపీ స్టేట్ (అంతర్ జిల్లాల) వాలీబాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు వారం రెండోరోజు ఉత్కంఠగా సాగాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో 3 రోజుల పాటు జరిగే ఈ పోటీలను 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ కే భానుమూర్తిరాజు పరిశీలించి జట్లను పరిచయం చేసుకున్నారు. బాలుర విభాగంలో విజయనగరంపై విశాఖ, నెల్లూరుపై శ్రీకాకుళం, అనంతపురంపై కడప, కృష్ణాపై తూర్పుగోదావరి జట్లు విజయం సాధించి ముందంజ వేశాయి. ఈ 4 జట్లు సెమీస్‌కు చేరాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళంపై పశ్చిమగోదావరి, కడపపై విజయనగరం, అనంతపురంపై గుంటూరు, కృష్ణాపై విశాఖపట్నం విజయం సాధించగా, పశ్చిమగోదావరి, విజయనగరం, గుంటూరు, విశాఖపట్నం సెమీస్‌కు అర్హత సాధించాయి. ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వరావు, సిద్ధార్థ అకడమిక్ మెంబర్ వినయ్‌కుమార్, టోర్నీ పరిశీలకులు నాగేశ్వరావు పోటీలను పర్యవేక్షించారు.



1500 మీటర్ల పరుగు పందెంలో పాల్గొంటున్న క్రీడాకారులు

హోరాహోరీగా స్టేట్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్

నగరంలోని పటమట బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రెండు రోజులు నుంచి జరుగుతున్న ఏపీ స్టేట్ అండర్-17 హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం జట్లు ఆదివారం సెమీస్‌కు చేరాయి. ఈ పోటీలను రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి కే భానుమూర్తిరాజు పర్యవేక్షించారు. క్రీడలకు తీసుకువస్తున్న కోచ్‌లు, మేనేజర్లు బాధ్యతగా వ్యవహరించి పోటీలనంతరం వారు ఇళ్లు చేరేవరకు జాగ్రత్త వహించాలని సూచించారు. ఏర్పాట్లను పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్ దుర్గారావు పర్యవేక్షించారు.

312 పరుగుల ఆధిక్యంలో రైల్వేస్

- సీకే నాయుడు క్రికెట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 303కు ఆలౌట్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్నల్ సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు రైల్వేస్‌తో పోరాడి తొలి ఇన్నింగ్స్ 303కు ఆలౌటై ఊపిరి పీల్చుకుంది. మూలపాడు వేదికగా జరుతున్న మల్టీడేస్ మ్యాచ్‌లో ఆంధ్ర టీమ్ మూడోరోజు ఆదివారం 179/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఇన్నింగ్స్ ఆరంభించింది. ఎస్ వెంకట్ రాహుల్ సెంచరీ (111), జీఎస్‌పీ తేజ 61 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాట్‌పట్టిన రైల్వేస్ టీమ్ మూడో రోజు ఆట ముగిసేసమయానికి 42 ఓవర్లలో 169/6తో నిలిచింది. అనిస్ యాదవ్ 90 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆంధ్ర బౌలర్ జీ సుమిత్ 3 వికెట్లతో రాణించాడు. దీంతో రైల్వేస్ టీమ్ 312 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ టీమ్ 446 పరుగుల చేసిన విషయం తెలిసిందే.



స్పోర్ట్స్ అథ్లెటిక్స్ తుది ఫలితాలు

పటమట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి జరుగుతున్న జాతీయస్థాయి స్పోర్ట్సు అండ్ గేమ్స్ అథ్లెటిక్స్ తుది ఫలితాలను నిర్వాహకులు తెలిపారు. 1500 మీటర్ల బాలుర వ్యక్తిగత పరుగు పందెంలో సెయింట్ గాబ్రియల్ హైస్కూల్ కాజీపేట విద్యార్థి మహమ్మద్ హబ్బిల్ ఆలీ (ప్రథమ), ఎస్ఎస్ఎంకు పబ్లిక్ స్కూల్ విజయవాడ విద్యార్థి జీకేయాన్స్ (ద్వితీయ), సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్స్ హైస్కూల్ హైదరాబాద్ విద్యార్థి రయాన్ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. 800 మీటర్ల వ్యక్తిగత పరుగుపందెంలో సెయింట్ గాబ్రియేల్ విద్యార్థి మహ్మద్ హబ్బిల్ ఆలీ (ప్రథమ), సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ విద్యార్థి రయాన్ (ద్వితీయ), ఎస్ఎస్ఎం స్కూల్ విద్యార్థి పి ప్రభుతేజ (తృతీయ) స్థానం దక్కాయి. షాట్‌పుట్ లో మౌంట్ ఫోర్డు స్కూల్ రేపల్లి విద్యార్థి వెంకట హర్షవర్ధన్ (ప్రథమ), లిటిల్ ఫ్లవర్ స్కూల్ హైదరాబాద్ శౌర్యజహామ్‌కు (ద్వితీయ), సెయింట్ మార్క్స్ టౌన్ స్కూల్ హైదరాబాద్ విద్యార్థి మహ్మద్ హబ్బిల్ ఆలీ (తృతీయ) స్థానం దక్కాయి. రెట్టించిన ఉత్సాహంతో రెండోరోజు ఆటల పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి వివరించారు.



పోలీసుల స్వాధీనంలో ఉన్న ట్రాక్టర్, గాయపడిన తుమాటి రాజేంద్రప్రసాద్

ప్రభుత్వం మారినా ఇసుక రీచ్‌లో పెత్తనం మాదే!

ట్రాక్టర్‌తో ఢీకొట్టి టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం

కొల్లిపర, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం మారితే అన్నీ మారిపోతాయనుకున్నార్రా? ఇసుక రీచ్‌లో మీకేం పని? ఇక్కడ మేం చెప్పిందే జరగాలి. ట్రాక్టర్‌కు రూ.100 కట్టాలి. లేకుంటే ఇసుక రీచ్‌ను మూసేస్తాం. మీ ప్రభుత్వం ఉందని పెత్తనం చేద్దామనుకుంటే ఎవరికైనా ఇదే జరుగుద్ది. జాగ్రత్త!!' అంటూ కూలి పనికి వెళ్లి వస్తున్న టీడీపీ కార్యకర్తను వైసీపీ నాయకులు ట్రాక్టర్‌తో ఢీకొట్టారు. కిందపడిన అతడిని ఏకంగా తొక్కించి చంపబోయారు. సాధ్యంకాక మూకుమ్మడిగా మీదపడి కాళ్లతో విచక్షణా రహితంగా తంతూ అరాచకం సృష్టించారు. కొల్లిపర మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త తూమాటి రాజేంద్రప్రసాద్‌పై ఆదివారం పట్టపగలు కృష్ణా నదిలో వైసీపీ నేతలు జరిపిన అమానుష దాడి ఇది! కొల్లిపర ఎస్‌ఐ కోటేశ్వరరావు, బాధిత కుటుంబీకుల కథనం మేరకు... గుంటూరు జిల్లా కొల్లిపర మండలం బొమ్ముvానిపాలెంలో ఉచిత ఇసుక రీచ్ నడుస్తోంది. టీడీపీ కార్యకర్త రాజేంద్రప్రసాద్ కూడా పోత కూలీలతోపాటు స్లిప్‌లు రాసేందుకు రీచ్‌లో పనికి వెళుతున్నాడు. కొద్దిరోజులుగా స్థానిక వైసీపీ నాయకులు వీరితో గొడవ పడుతూ.. తాము చెప్పినట్టు చేయకుంటే రీచ్‌ను నడవనివ్వబోమంటూ హెచ్చరించారు. ఇసుక కోసం వచ్చే ఒక్కో ట్రాక్టర్‌కు రూ.100 చొప్పున తమకు చెల్లించాలని, లేకుంటే ఊరుకునేది లేదని వారం క్రితం బెదిరించారు. అయితే, రూ.500 ఇసుక పోసినందుకు, రూ.100 గాలు నిర్వహణ కోసం తీసుకోవాలని, అంతకు మించి అదనంగా వసూలు చేస్తే ఊరుకోమని సబ్‌కలెక్టర్, పోలీసులు హెచ్చరించి వెళ్లారని, దానిని ధిక్కరించి రూ.100 వసూలు చేయలేమని తేల్చి చెప్పేశామని బాధితుడు వారికి వివరించారు. అలా అయితే తాము చెప్పిన ట్రాక్టర్‌లకు ప్రయారిటీ ఇవ్వాలంటూ మరికొన్ని డిమాండ్‌లు పెట్టారు. గొడవలెందుకని అన్నిటికీ ఒప్పుకున్నా, ఇసుక రీచ్ ఉన్నది సొసైటీ భూమి అంటూ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలోనే వారం క్రితం ఒక కూలీపై, రెండు రోజుల క్రితం మరో కార్యకర్త ఇంటిపైకి వెళ్లిమరీ దాడిచేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం కూలిపనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో స్థానిక వైసీపీ నాయకులు దాసరి అనిల్, దాసరి చిన్నబాజీ, అంజి, కిశోర్, పిల్లి హరీష్‌బాబు, మరికొందరు ట్రాక్టర్‌పై వచ్చి.. రాజేంద్రప్రసాద్‌ను నేరుగా ట్రాక్టర్‌తో గుద్దించారు. కిందపడిపోగా తొక్కించి చంపే ప్రయత్నం చేశారు. ఆయన త్రుటిలో తప్పించుకోగా.. ట్రాక్టర్‌లో ఉన్న మిగిలినవారంతా కిందికిదిగి కాళ్లతో విచక్షణారహితంగా తన్నారని రాజేంద్రప్రసాద్ వివరించారు. కాగా, గాయపడిన రాజేంద్రప్రసాద్‌ను తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా.. వెన్నెముక, పక్కటెముకలు విరిగి, లోపల రక్తస్రావమై పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో వైద్యులు గుంటూరు సమగ్ర వైద్యశాలకు రిఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి దాడికి ఉపయోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొందరు వైసీపీ నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, దాడులకు పాల్పడేవారిని వదలేదిలేదని ఎస్‌ఐ కోటేశ్వరరావు వివరించారు.

రుషికొండ ఫైళ్లు మాయం!



- పాత రిసార్టులో 50కోట్ల విలువైన సామగ్రికి రెక్కలు
- ఫర్నీచర్ వివరాలపై ఏపీటీడీసీ వద్ద కనిపించని ఫైల్
- ప్యాలెస్ నిర్మాణంలో ఇద్దరు అధికారుల కీలక పాత్ర
- టూరిజం సెక్రటరీ అనుమతి లేకుండానే ఒకరు రిలీవ్
- విశాఖ డీవీఎం, టూరిజం ఆర్డీగా పదోన్నతి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రుషికొండ విధ్వంసం, కొండపై ప్యాలెస్ నిర్మాణానికి సంబంధించిన ఫైళ్లు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. ప్యాలెస్ నిర్మాణ అనుమతుల ఫైళ్లు, కొన్ని ముఖ్యమైన పేపర్లు ఇప్పటికే కనిపించడంలేదు. ఇప్పుడు కొండపై గతంలో ఉన్న రిసార్టును కూలగొట్టేందుకు తీసుకున్న అనుమతుల ఫైళ్లు కూడా గల్లంతయ్యాయి. ఆ రిసార్టులో 80 గదులతో పాటు ఒక ఫంక్షన్ హాలు, బార్ అండ్ రెస్టారెంట్ ఉండేవి. వాటిల్లో ఉండాల్సిన దాదాపు రూ.50 కోట్ల విలువైన ఏసీలు, ఫ్రిజ్‌లు, ఇతర సామగ్రి ఏమైందో తెలియక ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్యాలెస్ నిర్మాణంలో భాగంగా రిసార్టును కూలగొట్టిన సమయంలో అప్పటి అధికారులు ఈ సామగ్రిని ఏంచేశారో వివరించే ఫైల్ ఏదీ అందుబాటులో లేదు. ఈ ఫర్నిచర్ వివరాలతో కూడిన ఒక ప్రత్యేక ఫైల్ ఏపీటీడీసీ వద్ద ఉండేది. ప్రభుత్వం మారిన తర్వాత అది మాయమైనట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం రిసార్ట్‌ను తొలగించే సమయంలో అందులోని సామగ్రిని ఇతర రిసార్ట్‌లకు పంపడం లేదా వాటికి తగిన ధరను నిర్ణయించి, టెండర్ ద్వారా బయట మార్కెట్‌లో అమ్మడం చేయాల్సి ఉంటుంది. రుషికొండ విషయంలో టూరిజం అధికారులు ఈ నిబంధనలేవీ పాటించలేదు. ప్యాలెస్ నిర్మాణం కోసం ఆగమేఘాల మీద రిసార్ట్‌ను ధ్వంసం చేశారు. ఆ సమయంలో రాష్ట్రంలో కొంతమంది డీవీఎంలను పిలిపించి అక్కడున్న ఫర్నిచర్‌లో ఏమేం కావాలో వాటిని వారి డివిజన్లకు తీసుకువెళ్లాలని సూచించారు. వారు తీసుకెళ్లగా ఇంకా విగిలిన సామగ్రిని ఏపీటీడీసీ అధికారులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేశారు. డీవీఎంలు ఏమేం తీసుకెళ్లారు, మార్కెట్‌లో ఏం అమ్మారనే సమాచారం కార్పొరేషన్ వద్ద లేదు. రుషికొండపై రిసార్ట్ తొలగించే సమయంలో ఈడీగా ఉన్న మల్‌రెడ్డి, ఈఈ రమణ తూతూమంత్రంగా ఫైల్ నడిపించారు. ఇప్పుడు అదీ మాయమైంది. రుషికొండ ధ్వంసం, కొత్త ప్యాలెస్ నిర్మాణంలో వీరిద్దరిదే కీలక పాత్ర. ఒక్క ఫైల్‌కు కూడా కార్పొరేషన్‌కు వెళ్లకుండా, సచివాలయం నుంచి చక్రం తిప్పారని ఆరోపణలున్నాయి.

తెలంగాణకు మల్‌రెడ్డి

రుషికొండపై మాజీ సీఎం జగన్ రూ.500 కోట్ల ప్రజాధనంతో ప్యాలెస్ నిర్మాణం చేపట్టారని, ఇప్పుడా ప్యాలెస్‌ను ఏం చేయాలో పాలుపోవడం లేదని కూటమి నేతలంతా గగ్గోలు పెడుతున్నారు. కానీ అసలు దాని నిర్మాణానికి సహకరించిన అధికారులపై దృష్టి పెట్టడం లేదు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణం వెనక కీలకంగా వ్యవహరించిన మల్‌రెడ్డి 2019లో డిప్యుటేషన్‌పై తెలంగాణ నుంచి ఏపీకి వచ్చారు. అప్పట్లో ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసి మరీ ఆయనను రాష్ట్రానికి రప్పించింది. తిరిగి ఆయన తెలంగాణకు వెళ్లే సమయంలో కూడా ఇదే నిబంధనలు పాటించాలి. కానీ ఏపీటీడీసీ అధికారులు మాత్రం టూరిజం సెక్రటరీ అనుమతి లేకుండా, జీవో ఇవ్వకుండానే ఆయన్ను రిలీవ్ చేసేశారు. ఇప్పుడు ఆయన తెలంగాణలో రిపోర్టు చేసి రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్‌లో విధుల్లో చేరిపోయారు. పైగా ఆ కార్పొరేషన్ ఎండీ పోస్టు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

ఈఈ రమణకు పదోన్నతి!

రుషికొండ ప్యాలెస్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ... ఇరిగేషన్ నుంచి డిప్యుటేషన్‌పై ఏపీటీడీసీకి వచ్చారు. ప్యాలెస్ నిర్మాణాన్ని దగ్గరుండి చూసుకున్నారు. కార్పొరేషన్ అధికారులు ఆయన్ను విశాఖ డివిజనల్ మేనేజర్ పోస్టులో కూర్చోబెట్టడంతో పాటు టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్‌గా బాధ్యతలు కూడా అప్పగించారు. రుషికొండకు సంబంధించిన ఫైళ్లన్నీ డీవీఎం చేతుల్లోనే ఉంటాయి. జగన్ ప్రభుత్వంలో మొత్తం వ్యవహారం నడిపించిన ఈయనకు పదోన్నతులు ఇచ్చి, కీలకమైన పోస్టు కట్టబెట్టడంపై సంస్థ ఉద్యోగులు విస్తుపోతున్నారు. రుషికొండ విషయంలో కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉందో ఈ ఒక్క నిర్ణయంతో తేలిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

సకాలంలో కోర్టు భవనాల నిర్మాణం
పూర్తి చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు

విజయనగరం క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా విజయనగరం జిల్లా కోర్టు భవనాలను ఆధునిక వసతులతో నిర్మిస్తున్నారని, పనులు సకాలంలో పూర్తయ్యేలా శ్రద్ధ వహించాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు సూచించారు. కోర్టు భవనాలు మంజూరు చేసినందుకు జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయమూర్తులకు విజయనగరం జిల్లా బార్ అసోసియేషన్ కృతజ్ఞతాపూర్వక అభినందన సభ ఆదివారం ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేశ్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రాజశేఖరరావు మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ ఐక్యత, సంకల్పం వల్లే నూతనభవనాలు మంజూరయ్యాయని చెప్పారు.

మున్సిపల్ శాఖ కార్యదర్శిగా
కన్నబాబు

- రోనాల్డ్ రోస్‌కు ఆర్థిక శాఖలో బాధ్యతలు
- కార్మిక శాఖ కార్యదర్శిగా గంధం చంద్రుడు

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ విభాగం కార్యదర్శి కె.కన్నబాబుకు మున్సిపల్ శాఖ కార్యదర్శిగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన రోనాల్డ్ రోస్‌కు ప్రభుత్వం ఆర్థిక శాఖలో పోస్టింగ్ ఇచ్చింది. జగన్ ప్రభుత్వం నుంచి కన్ఫర్డ్ ఐఏఎస్ పొందిన బి.అనిల్‌కుమార్ రెడ్డిని స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీగా నియమించింది. ప్రస్తుతం స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న గంధం చంద్రుడిని బదిలీ చేసి.. కార్మిక శాఖ కార్యదర్శిగా నియమించింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డి.హరితను వ్యవసాయ డిప్యూటీ సెక్రెటరీగా నియమించింది. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ కేంద్ర సర్వీస్‌లోకి వెళ్లడంతో ఆయన స్థానంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాముకు ప్రభుత్వం ఇటీవల అదనపు బాధ్యతలు ఇచ్చింది. ఇప్పుడు ఆయనను తప్పించి, కన్నబాబుకు అప్పగించింది.

గన్‌తో కాల్చి చంపినా.. నన్ను అడిగే వాడుండడు!

- వైసీపీ ముఖ్య నేతను.. నా పలుకుబడి తెలుసుకోండి
- ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్ బెదిరింపులు
- రూ.2కోట్లు తీసుకుని ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయించని వైనం
- బాధితుడి ఫిర్యాదుతో అనంతలో కేసు నమోదు



జగన్‌తో నదీమ్ అహ్మద్(ఫైల్)

అనంతపురం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'నేను వైసీపీ మెయిన్ లీడర్‌ను. నాకు చాలా పలుకుబడి ఉంది. మీరు ఎవరితో పెట్టుకుంటున్నారో తెలుసుకోండి. ఇది కంట్రీ మేడ్ పిస్టల్. దీంతో మిమ్మల్ని కాల్చి చంపితే అడిగేవాడు కూడా ఉండడు' అని ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్ అహ్మద్ బెదిరించాడని అనంతపురం నగరానికి చెందిన బుల్లే రాము ఫిర్యాదు చేయడంతో నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు విచారించి నదీమ్‌పై చీటింగ్, బెదిరింపుల కేసు నమోదు చేశారు. అనంతపురంలోని శ్రీనగర్ కాలనీలో హీరియల్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నదీమ్ అహ్మద్, గల్లా వెంకట శ్రీనివాసులు, గల్లా రవీంద్రనాథ్ కలిసి విల్లాలు నిర్మించి ఇచ్చేలా కొందరితో ఒప్పందం చేసుకున్నారు. వీరిలో కొంతమందికి వైసీపీ పలుకుబడితో రిజిస్ట్రేషన్ చేయించారు. కొందరిని రూ.కోట్లు చెల్లించినా విల్లా రిజిస్ట్రేషన్ చేయించకుండా ఇబ్బంది పెట్టారు. గత ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉండటంతో వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రభుత్వం మారినా నదీమ్‌లో మార్పు రాలేదు. వెంకటశ్రీనివాసులు, రవీంద్రనాథ్ ఇళ్లలో ఐటీ దాడులు కూడా జరిగాయి. వీటి వెనుక నదీమ్ ఉన్నట్టు ఆరోపణలు వినిపించాయి. కాగా, హీరియల్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నదీమ్ అహ్మద్‌తో తండ్రీకొడుకులు బుల్లే రాము, గణేశ్ ఫ్లాట్‌నెంబర్ 5కు 2016 ఏప్రిల్ 5న, ఫ్లాట్‌నెంబర్ 4కు 2017 మే 20న ఒప్పందం చేసుకున్నారు. ఫ్లాట్‌నెంబర్ 4కు రూ.95 లక్షలు, ఫ్లాట్‌నెంబర్ 5కు రూ.1.03 కోట్లు ఇచ్చారు. నదీమ్ అహ్మద్ రిజిస్ట్రేషన్ చేయించలేదు. ఈనెల 1న రాము తన కుమారులు గణేశ్, అనిల్‌తో నదీమ్ ఇంటికెళ్లి, రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. దీంతో నదీమ్ కాల్చిచంపుతానని బెదిరించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.2 కోట్లిచ్చినా రిజిస్ట్రేషన్ చేయించకుండా మోసం చేస్తున్నారని వివరించారు. బాధితుడు రాము అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. అయితే, అక్కడ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు తనపైనే ఫిర్యాదు చేశారని రాము వాపోయారు. నదీమ్‌పై శనివారం అనంతపురం ఫోర్త్‌టౌన్ పోలీసులకు రాము ఫిర్యాదు చేశారు. నదీమ్ నుంచి ప్రాణహాని ఉందని, అతడి నుంచి పిస్టల్ స్వాధీనం చేసుకోవాలని కోరారు.

నవ్య | చిత్రజ్యోతి

పల్లెటూరి ప్రేమకథ

'మేం ఫేమస్' చిత్రంతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. నిధి ప్రదీప్ కథానాయికగా పరిచయం అవుతున్నారు. జగపతి బాబు, రాజీవ్ కనకాల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆదివారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. ముహూర్తం షాట్‌కు హీరో శ్రీవిష్ణు క్లాప్ ఇచ్చారు. సురేశ్‌బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, మహేశ్‌బాబు పి. గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను



యూనిట్‌కు అందించారు. నిర్మాత సునీల్ నారంగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ 'యూత్‌ఫుల్ మ్యూజికల్ రొమాంటిక్ కామెడీగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. గోదావరి ప్రాంతంలోని పల్లెల అందాలను తెరపైన అద్భుతంగా ఆవిష్కరించబోతున్నాం. త్వరలో భీమవరంలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం' అని తెలిపారు. ఇదో పల్లెటూరి ప్రేమకథ, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి నాగవంశీ కృష్ణ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సాయిసంతోష్.

వాస్తవ సంఘటనలతో...



నూతన నటీనటులతో తెరకెక్కుతున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. బసవ రాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. టైటిల్‌ను ప్రకటించి, దర్శకుడు మారుతి చేతుల మీదుగా ఫస్ట్‌లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ధర్మ, ఐశ్వర్యశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన తారాగణం. సంగీతం: శ్రీ వసంత్, సినిమాటోగ్రఫీ: ప్రశాంత్ అంకిరెడ్డి



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల జతకడుతున్నారు. 'పుష్ప 2-ది రూల్' చిత్రంలో వీరిద్దరి కాంబినేషన్‌లో స్పెషల్ సాంగ్ చిత్రీకరిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. 'పుష్ప'లో అల్లు అర్జున్- సమంతపై చిత్రీకరించిన 'ఊ అంటావా మావా ఊఊ అంటావా' సాంగ్ జాతీయ స్థాయిలో పాపులర్ అయింది. ఇప్పుడు తాజాగా 'పుష్ప 2' లో చిత్రీకరిస్తున్న ఈ మాసివ్ నెంబర్ దానికి మించి ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, రవిశంకర్ వై. నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రమోషన్స్‌ను పాట్నా, కోల్‌కతా, చెన్నయ్, కొచ్చి, బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నారు. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణతోపాటు నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి.

కొత్త లుక్‌లో కనువిందు

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగార్జున, ధనుష్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'కుబేర'. రష్మిక మందన్న హీరోయిన్. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం ఒక పోస్టర్‌ని విడుదల చేసింది. ముంబై మహాసముద్రం బ్యాక్‌డ్రాప్‌లో అందమైన చిరునవ్వుతో రష్మిక ఆ పోస్టర్‌లో కనిపించారు. మూవీకి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ని ఈనెల 15న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే సినిమాలోని మూడు కీలక పాత్రలను మూడు వేర్వేరు వీడియోలు, పోస్టర్ల ద్వారా మేకర్స్ పరిచయం చేశారు. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న క్యారెక్టర్ బ్యాక్‌డ్రాప్‌ని క్రియేటివ్‌గా ప్రెజెంట్ చేస్తూ విడుదల చేసిన దీపావళి స్పెషల్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది.



కంగువలో సింగర్‌గా

నటిగా శ్రద్ధాదాస్‌కి మంచి పేరుంది. గాయనిగా ఆమె ప్రేక్షకులను అలరించబోతున్నారు. సూర్య కథానాయకుడిగా నటించిన 'కంగువ' చిత్రంలో శ్రద్ధాదాస్ కథానాయికగా నటించారు. ఈ సినిమాలో 'యోలో' అంటూ సాగే ఓ మంచి హుషారైన గీతాన్ని శ్రద్ధా దాస్ ఆలపించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చడంతో పాటు శ్రద్ధాదాస్, సాగర్‌తో కలసి ఆలపించారు. రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించారు. 'కంగువ' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది.




అదిరే కలయిక కుదిరేనా?





బాలీవుడ్ వర్గాలు చెబుతున్నది నిజమైతే ఓ అరుదైన కలయికకు రంగం సిద్ధమైనట్లే. టాలీవుడ్ సంచలన దర్శకుడు నాగ్ అశ్విన్, అగ్రకథానాయిక అలియాభట్ కలయికలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతోందనే వార్త హిందీ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోంది. నాగ్ అశ్విన్ మహిళా ప్రాధాన్య కథతో ఓ పాన్ ఇండియా చిత్రం చేయాలనుకుంటున్నారని, ఈ చిత్రాన్ని కూడా వైజయంతి మూవీస్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నదని ఆ వార్తల సారాంశం. నాగ్ అశ్విన్ తన తర్వాతి చిత్రం కోసం ఒక శక్తిమంతమైన మహిళ కథను సిద్ధం చేశారట. భావోద్వేగాలను అలవోకగా పండించగల అలియా అయితే ఈ పాత్రకు న్యాయం చేయగలుగుతారని ఆయన భావించారట. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై అలియా, నాగ్‌అశ్విన్ మధ్య చర్చలు జరుగుతున్నాయట. త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని చెబుతున్నారు. అలియా ప్రస్తుతం సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్న 'లవ్ అండ్ వార్'తో పాటు 'ఆల్ఫా' చిత్రంలో నటిస్తున్నారు. ప్రభాస్‌తో 'కల్కి 2898 ఏడి' చిత్రం రెండో భాగాన్ని నాగ్ అశ్విన్ సెట్స్‌పైకి తీసుకెళ్లాల్సి ఉంది.

తమిళ నటుడు ఢిల్లీ గణేశ్ కన్నుమూత



తమిళ చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటుడు ఢిల్లీ గణేశ్ (80) శనివారం రాత్రి చెన్నైలో కన్నుమూశారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా గత కొంతకాలంగా బాధపడుతున్న ఆయన స్థానిక రామాపురంలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం ఉదయం ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ తదితర భాషల్లో 400లకు పైగా చిత్రాల్లో నటించిన ఢిల్లీ గణేశ్.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా, విలన్‌గా, హీరోగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రాణించారు. అగ్ర నటుడు కమల్ హాసన్ ఆస్థాన నటుల్లో ఢిల్లీ గణేశ్ ఒకరు. తిరునల్వేలికి చెందిన ఢిల్లీ గణేశ్.. సినిమాల్లోకి రాకముందు ఢిల్లీలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నతోద్యోగిగా వున్నారు. నటనపై ఉన్న ఆసక్తితో ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి, సినీపరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆయన అసలు పేరు గణేశన్ మహదేవన్. కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'పట్టిన ప్రవేశం' చిత్రంలో ఆయన తొలిసారి వెండితెరపై కనిపించారు. ఆయన నటించిన చివరి చిత్రం కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2'. మెగాస్టార్ చిరంజీవి, కన్నడ నటుడు విష్ణువర్ధన్‌కు చెందిన తమిళ చిత్రాలకు ఆయనే డబ్బింగ్ చెప్పారు. 1981లో తమిళంలో కె.బాలచందర్ దర్శకత్వంలో చిరంజీవి నటించిన '147 నాట్గల్', 1990లో ఘన విజయం సాధించిన 'జగదేకవీరుడు అతిలోకసుందరి' తమిళ వెర్షన్ (కాదల్ దేవదై) చిత్రానికి డబ్బింగ్ చెప్పారు. అలాగే, విష్ణువర్ధన్ నటించి 1980లో విడుదలైన 'మళలై పట్టాలం' చిత్రానికి ఆయన డబ్బింగ్ చెప్పారు. ఢిల్లీ గణేశ్ మృతి పట్ల సీఎం స్టాలిన్, అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్, సూర్య, కార్తీ, శివకార్తికేయన్‌లతో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నడిగర్ సంఘం నిర్వాహకులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)


కొత్తగా..

అమ్మనవ్వాలని నాకూ ఉంది




సమంత ప్రధాన పాత్ర పోషించిన 'సీటాడెల్: హనీబన్నీ' వెబ్‌సిరీస్ ఇటీవలే విడుదలై ప్రేక్షకాదరణ పొందిన విషయం తెలిసిందే. ఆ సిరీస్‌లో సమంత తన బిడ్డను కాపాడుకునేందుకు అరాచక శక్తులతో పోరాడే శక్తిమంతమైన తల్లిపాత్రలో ఆకట్టుకున్నారు. ఆ సిరీస్‌లో తను పోషించిన తల్లి పాత్ర గురించి సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'తెరపైనే కాదు నిజ జీవితంలోనూ అమ్మగా పిల్లల ఆలనా పాలనా చూసి మురిసిపోవాలనుంద'ని ఆమె తన మనసులో మాట చెప్పారు. 'పిల్లలతో గడపడం నాకు చాలా ఇష్టమైన విషయం. మాతృత్వాన్ని ఆస్వాదించే విషయంలో నాకంటూ కొన్ని కలలు ఉన్నాయి. తల్లినవ్వాలని నాకూ ఉంది. పిల్లలను ప్రేమ ఆప్యాయతలతో పెంచాలనే కోరిక ఉంది. అయితే అమ్మనయ్యే విషయంలో ఇప్పటికే ఆలస్యం అయిందని నేను అనుకోవడం లేదు' అని సమంత అన్నారు. మయోసైటిస్ వ్యాధి పూర్తిగా నయం కాకపోయినా చాలా వరకూ కోలుకున్నట్లు సమంత చెప్పారు.

కొత్త తేదీన రిలీజ్



అర్జున జంధ్యాల దర్శకత్వంలో అశోక్ గల్లా, వారణాసి మానస హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ముందుగా ఈ చిత్రాన్ని ఈనెల 14న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. అయితే, విడుదల తేదీని మార్చారు. ఈనెల 22న ప్రేక్షకుల ముందుకు మూవీని తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు.

ఏ రోజైతే చూశానో...



'చెక్, బుర్రకథ' తదితర చిత్రాల్లో బాలనటుడిగా నటించిన భరత్ రామ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ ప్రేమకథా చిత్రానికి 'ఏ రోజైతే చూశానో నిన్ను' అనే టైటిల్‌ను నిర్ణయించారు. రాజు బోనగాని దర్శకత్వం వహిస్తున్నారు. ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ప్రస్తుతం మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి.

చాంపియన్స్ ట్రోఫీ రద్దేనా?



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ మొత్తంగా రద్దయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే ఫిబ్రవరి 19 నుంచి మార్చి 19 వరకు పాకిస్థాన్‌లో జరిగే ఈ టోర్నీకి సంబంధించిన ఓ ముఖ్య కార్యక్రమాన్ని సోమవారంలాహోర్‌లో నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆదివారం హఠాత్తుగా ప్రకటించింది. దాంతో టోర్నీ నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ టోర్నీలో ఆడేందుకు పాక్ వెళ్లబోమని ఐసీసీకి బీసీసీఐ శనివారం తెలియజేసింది. ఈ పరిస్థితుల్లో సోమవారం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ఐసీసీ ప్రకటించడం గమనార్హం. అయితే, రద్దుకు కారణమేంటో ఐసీసీ వెల్లడించలేదు. కానీ షెడ్యూల్ ఖరారులో వివాదం, పాక్‌లో పర్యటనకు భారత్ నిరాకరణే కారణమని తెలుస్తోంది. పాక్ వెళ్లేందుకు భారత్ నిరాకరించడంతో టోర్నీని హైబ్రిడ్ విధానంలో జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే హైబ్రిడ్ పద్ధతికి పీసీబీ విముఖత వ్యక్తంజేస్తోంది.

అవును..భారత జట్టు రావడంలేదు: చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు భారత జట్టు తమ దేశం రావడంలేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ధ్రువీకరించింది. ఈమేరకు ఐసీసీ తమకు సమాచారం అందజేసిందని ఆదివారం పేర్కొంది.

కోర్టుకు పాకిస్థాన్?

చాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్ రావడంలేదని భారత్ స్పష్టం చేయడంతో.. అంతర్జాతీయ క్రీడా మధ్యవర్తిత్వం న్యాయస్థానాన్ని (కాస్) పాకిస్థాన్ ఆశ్రయించే అవకాశాలున్నాయి. నిరుడు భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు తాము ఆ దేశం వెళ్లిన విషయాన్ని కాస్‌లో వేసే పిటిషన్‌లో పాక్ బోర్డు ప్రస్తావించనున్నట్టు సమాచారం.

ఆఖర్లో వదిలేశారు

రెండో టీ20లో భారత్ ఓటమి

దక్షిణాఫ్రికాను గెలిపించిన స్టబ్స్
స్పిన్నర్ వరుణ్‌కు ఐదు వికెట్లు



1 ఒకే క్యాలెండర్ ఏడాదిలో రెండు సెంచరీలు బాది, నాలుగు సార్లు డకౌట్ అయిన టీ20 బ్యాటర్‌గా శాంసన్

స్టబ్స్ (47 నాటౌట్)



వరుణ్ చక్రవర్తి (5/17)

గెబెహ: దక్షిణాఫ్రికాతో ఉత్కంఠభరితంగా సాగిన రెండో టీ20లో భారత్ చేజేతులా ఓడింది. స్వల్ప స్కోరును కాపాడే క్రమంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కెరీర్ బెస్ట్ బౌలింగ్ (5/17)తో చెలరేగాడు. దీంతో ఓ దశలో ఆతిథ్య జట్టు 86/7 స్కోరుతో ఓటమివైపు సాగింది. కానీ యువ బ్యాటర్ ట్రిస్టాన్ స్టబ్స్ (47 నాటౌట్) సూపర్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కొట్జీ (19 నాటౌట్)తో కలిసి ఆఖరి మూడు ఓవర్లలో 40 పరుగులతో జట్టును గట్టెక్కించాడు. తద్వారా 3 వికెట్ల తేడాతో గెలిచిన ఆతిథ్య జట్టు సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. అలాగే భారత్ వరుస 11 టీ20 విజయాలకు బ్రేక్ పడింది. బుధవారం మూడో మ్యాచ్ జరుగుతుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 124 పరుగులు చేసింది. హార్దిక్ (39 నాటౌట్), అక్షర్ (27), తిలక్ (20) మాత్రమే రాణించారు. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 19 ఓవర్లలో 7 వికెట్లకు 128 పరుగులు చేసి గెలిచింది. హెన్‌డ్రిక్స్ (24) ఫర్వాలేదనిపించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా స్టబ్స్ నిలిచాడు.

వరుణ్ తిప్పేసినా..: స్వల్ప ఛేదనలో స్పిన్నర్ వరుణ్ ధాటికి దక్షిణాఫ్రికా టపటపా వికెట్లను కోల్పోయింది. బంతులకన్నా చేయాల్సిన పరుగులు కూడా ఎక్కువే కావడంతో భారత్ గెలుపు ఖాయమనిపించింది. కానీ చివర్లో పేసర్లు అవేశ్, అర్ష్‌దీప్ ధారాళంగా పరుగులిచ్చుకోవడం దెబ్బతీసింది. మూడో ఓవర్‌లోనే ఓపెనర్ రికెల్టన్ (13)ను అర్ష్‌దీప్ అవుట్ చేయగా ఆ తర్వాత స్పిన్నర్ వరుణ్ తన వరుస ఓవర్లలో హవా చూపాడు. కెప్టెన్ మార్‌క్రమ్ (3), ఓపెనర్ హెన్‌డ్రిక్స్‌తో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందే వచ్చిన జాన్సెన్ (7) కూడా వరుణ్ చేతిలో బౌల్డయ్యాడు. ఇక 13వ ఓవర్‌లో తను సఫారీలకు అతి పెద్ద షాక్ ఇచ్చాడు. ఒక్క పరుగే ఇచ్చి క్లాసెన్ (2), మిల్లర్ (0)ల వికెట్లను తీయడంతో 66/6తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ క్రీజులో స్టబ్స్ ఉండడంతో సఫారీలు విజయంపై ఆశలు వదులుకోలేదు. దీనికితోడు సిమెలానె (7) తర్వాత కొట్జీ రాకతో భారత్ ఒత్తిడిలో పడింది. 17వ ఓవర్‌లో అతడి భారీ సిక్సర్ స్టేడియంపైన పడగా స్టబ్స్ ఫోర్‌తో 12 రన్స్ వచ్చాయి. ఇక 18వ ఓవర్‌లో కొట్జీ రెండు వరుస ఫోర్లతో సమీకరణం 12 బంతుల్లో 13 రన్స్‌కు మారింది. 19వ ఓవర్‌లో స్టబ్స్ 4 ఫోర్లతో 16 రన్స్ సాధించి మ్యాచ్‌ను ముగించాడు.

బౌలర్లు సమష్టిగా..: వరుసగా రెండో మ్యాచ్‌లోనూ టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఈసారి కూడా టాపార్డర్ నిరాశపర్చగా, మిడిలార్డర్‌లో తిలక్, అక్షర్‌లతో పాటు హార్దిక్ ఆటతీరు పుణ్యాన జట్టు స్కోరు కష్టమ్మీద 120 దాటగలిగింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే పేసర్ జాన్సెన్ మూడో బంతికే సంజూ శాంసన్ (0)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్ (4)ను కొట్జీ దెబ్బతీశాడు. ఇక కెప్టెన్ సూర్య (4)ను సిమిలానె ఎల్బీ చేయడంతో 15/3 స్కోరుతో జట్టు ఇబ్బందుల్లో పడింది. అయితే తిలక్, అక్షర్ జోడీ ఆత్మవిశ్వాసంతో ఎదురుదాడికి దిగడంతో పవర్‌ప్లేలో 34/3తో నిలిచింది. కానీ తిలక్ క్యాచ్‌ను.. కవర్స్‌లో మిల్లర్ గాల్లోకి ఎగిరి ఒంటిచేత్తో పట్టేయడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఆ తర్వాత కాసేపటికే ఊపు మీదున్న అక్షర్ రనౌటయ్యాడు. హార్దిక్ ఆడిన షాట్ స్పిన్నర్ పీటర్ చేతివేళ్లను తాకి నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో వికెట్లను గిరాటేసింది. రింకూ సింగ్ (9) కూడా విఫలమయ్యాడు. మరోవైపు 35 బంతుల వరకు జట్టు నుంచి బౌండరీ కూడా రాలేదు. చివరకు 16వ ఓవర్‌లో అర్ష్‌దీప్ సిక్సర్ బాదాడు. 17వ ఓవర్‌లో హార్దిక్ ఫోర్‌తో స్కోరు వందకి చేరింది. ఆ తర్వాత ఓవర్‌లో అతడి 4,6,4తో 14 రన్స్ సమకూరాయి. ఇక ఆఖరి ఓవర్‌లో హార్దిక్ ఇచ్చిన రెండు క్యాచ్‌లు విఫలం కాగా ఆరు పరుగులే వచ్చాయి. ఇన్నింగ్స్‌లో అత్యధికంగా ఏడో వికెట్‌కు అజేయంగా 37 పరుగులు రావడం విశేషం.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (బి) జాన్సెన్ 0; అభిషేక్ (సి) జాన్సెన్ (బి) కొట్జీ 4; సూర్యకుమార్ (బి) సిమిలానె 4; తిలక్ (సి) మిల్లర్ (బి) మార్‌క్రమ్ 20; అక్షర్ (రనౌట్) 27; హార్దిక్ (నాటౌట్) 39; రింకూ (సి) కొట్జీ (బి) పీటర్ 9; అర్ష్‌దీప్ (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 124/6. వికెట్ల పతనం:** 1-0, 2-5, 3-15, 4-45, 5-70, 6-87. **బౌలింగ్:** జాన్సెన్ 4-1-25-1; కొట్జీ 4-0-25-1; సిమిలానె 3-0-20-1; కేశవ్ 4-0-24-0; మార్‌క్రమ్ 1-0-4-1; పీటర్ 4-0-20-1.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 13; హెన్‌డ్రిక్స్ (బి) వరుణ్ 24; మార్‌క్రమ్ (బి) వరుణ్ 3; స్టబ్స్ (నాటౌట్) 47; జాన్సెన్ (బి) వరుణ్ 7; క్లాసెన్ (సి) రింకూ (బి) వరుణ్ 2; మిల్లర్ (బి) వరుణ్ 0; సిమిలానె (బి) రవి బిష్ణోయ్ 7; కొట్జీ (నాటౌట్) 19; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19 ఓవర్లలో 128/7. వికెట్ల పతనం:** 1-22, 2-33, 3-44, 4-64, 5-66, 6-66, 7-86. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-41-1, అవేశ్ 3-0-23-0, హార్దిక్ 3-0-22-0, వరుణ్ చక్రవర్తి 4-0-17-5, రవి బిష్ణోయ్ 4-0-21-1, అక్షర్ పటేల్ 1-0-2-0.

రుత్విక జోడీకి మిక్స్‌డ్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎన్ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను హైదరాబాద్ అమ్మాయి రుత్విక శివానీ జోడీ కైవసం చేసుకుంది. ఆదివారం ఇక్కడి గోపీచంద్ అకాడమీలో జరిగిన ఫైనల్లో శివానీ-రోహన్ కపూర్ ద్వయం 21-17, 21-19తో తనీషా-హరిహరన్ జంటపై గెలిచింది. పృథ్వీ-సాయి ప్రతీక్ ద్వయం 21-19, 21-17తో అర్జున్-విష్ణువర్ధన్ గౌడ్ జోడీపై నెగ్గి పురుషుల డబుల్స్ విజేతగా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో రుత్విక్, మహిళల సింగిల్స్‌లో ఇషారాణి, డబుల్స్‌లో ప్రియ-శ్రుతి మిశ్రా జంట టైటిళ్లు సాధించారు.

22 ఏళ్ల తర్వాత..

ఆసీస్ గడ్డపై పాక్‌కు సిరీస్
మూడో వన్డేలో ఘనవిజయం

పెర్త్: మహ్మద్ రిజ్వాన్ కెప్టెన్సీలో తొలిసారి బరిలోకి దిగిన పాకిస్థాన్ వన్డే జట్టు అదరగొట్టింది. ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. అలాగే 22 ఏళ్ల (2002) తర్వాత పాక్ జట్టు కంగారూ గడ్డపై సిరీస్ సాధించింది. అలాగే ఓ వన్డే సిరీస్‌లో ఆసీస్ నుంచి ఏ ఒక్క బ్యాటర్ కూడా అర్ధసెంచరీ చేయకపోవడం ఇదే తొలిసారి. పేసర్లు షహీన్, నసీమ్ షా మూడేసి వికెట్లతో కట్టడి చేయగా, ఆసీస్ 31.5 ఓవర్లలో 140 పరుగులే చేసింది. ఎబాట్ (30) టాప్‌స్కోరర్. ఛేదనలో పాక్ 26.5 ఓవర్లలో 143/2 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు సయీమ్ అయూబ్ (42), అబ్దుల్లా షఫీక్ (37), రిజ్వాన్ (30 నాటౌట్), బాబర్ (28 నాటౌట్) రాణించారు. మోరిస్‌కు 2 వికెట్లు దక్కాయి.

మెక్‌స్వీని, ఇన్‌గ్లిస్‌లకు పిలుపు

భారత్‌తో తొలి టెస్టుకు ఆసీస్ జట్టు ఎంపిక

సిడ్నీ: భారత్‌తో జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా తొలి టెస్టు కోసం 13మందితో కూడిన ఆస్ట్రేలియా జట్టును ఆదివారం ప్రకటించారు. ఈనెల 22 నుంచి 5 టెస్టుల సిరీస్ జరుగుతుంది. కమిన్స్ నాయకత్వంలోని జట్టులో జోష్ ఇన్‌గ్లిస్‌తో పాటు యువ సంచలనం నాథన్ మెక్‌స్వీనిలకు తొలిసారి చోటిచ్చారు.

ఆస్ట్రేలియా జట్టు: కమిన్స్ (కెప్టెన్), హెడ్, ఖవాజా, లబుషేన్, మార్ష్, మెక్‌స్వీని, స్మిత్, క్యారీ, ఇన్‌గ్లిస్, హాజెల్‌వుడ్, బోలాండ్, లియోన్, స్టార్క్.

అర్జున్‌కు షాక్

చెన్నై: అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్న తెలుగు కుర్రాడు ఇరిగేసి అర్జున్‌కు చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో అరవింద్ చిదంబరం (తమిళనాడు) షాకిచ్చాడు. ఆదివారం జరిగిన గేమ్‌లో 48వ ఎత్తుల్లో అర్జున్‌కు అరవింద్ చెక్ చెప్పాడు. లెవాన్ అరోనియన్ (అమెరికా)తో గేమ్‌ను విదిత్ సంతోష్ గుజరాతి డ్రా చేసుకున్నాడు. ఆరో రౌండ్ అనంతరం అర్జున్, లెవాన్ 4 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలవగా, అరవింద్ రెండో స్థానంలో ఉన్నాడు. సోమవారం ఆఖరిదైన ఏడో రౌండ్ జరగనుంది. చెన్నై చాలెంజర్స్ చెస్ టోర్నీలో రౌనక్ సాధ్వానితో జరిగిన ఆరో రౌండ్‌ను ద్రోణవల్లి హారిక డ్రాగా ముగించింది. మొత్తంగా 6 రౌండ్లు ముగిసేసరికి ప్రణవ్ టాప్‌లో ఉండగా, హారిక 7వ స్థానంలో నిలిచింది.

లక్ష్యం..మరో టైటిల్

తొలి మ్యాచ్‌లో మలేసియాతో భారత్ ఢీ
నేటి నుంచి మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ



రాజ్‌గిర్ (బిహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీకి సోమవారం ఇక్కడ తెరలేవనుంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగుతున్న సలీమా టేటె సారథ్యంలోని భారత్ తొలి మ్యాచ్‌లో.. తమకంటే తక్కువ ర్యాంకరైన మలేసియాతో తలపడనుంది. చైనా, కొరియా, జపాన్, థాయ్‌లాండ్ టోర్నీలో తలపడుతున్న ఇతర జట్లు. సింగిల్ రౌండ్ రాబిన్ లీగ్ విధానంలో జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు సెమీస్‌కు చేరతాయి. తొలి రోజు జరిగే ఇతర మ్యాచ్‌ల్లో జపాన్‌తో కొరియా, చైనాతో థాయ్‌లాండ్ పోటీపడనున్నాయి.

'డబ్ల్యూటీఏ' క్వీన్.. గాఫ్

అమెరికా స్టార్‌కు రూ. 40 కోట్ల ప్రైజ్‌మనీ



రియాద్: అమెరికా టెన్నిస్ యువ సంచలనం కోకో గాఫ్ సీజన్‌కు గ్రాండ్‌గా వీడ్కోలు పలికింది. సీజన్ ముగింపు టోర్నీ అయిన ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీఏ ఫైనల్స్ ట్రోఫీని గాఫ్ అందుకుంది. శనివారం రాత్రి జరిగిన ఫైనల్లో గాఫ్ 3-6, 6-4, 7-6(2)తో జెంగ్ కిన్వెన్ (చైనా)ను ఓడించింది. విజేత గాఫ్‌కు రికార్డుస్థాయిలో రూ. 40 కోట్లు, రన్నరప్ జెంగ్ రూ. 31 కోట్లు ప్రైజ్ మనీ రూపంలో దక్కింది. 2014లో సెరెనా విలియమ్స్ తర్వాత డబ్ల్యూటీఏ ఫైనల్స్ గెలిచిన తొలి అమెరికా క్రీడాకారిణిగా గాఫ్ రికార్డుకెక్కింది. అంతే కాదు.. 2004లో షరపోవా తర్వాత ఈ ట్రోఫీ నెగ్గిన పిన్న వయసు ప్లేయర్‌గానూ 20 ఏళ్ల గాఫ్ ఘనత సాధించింది.

ఉత్కంఠ పోరులో ముంబా గెలుపు

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11 రెండో అంచె పోటీలు నోయిడాలో మొదలయ్యాయి. ఆదివారం ఆతిథ్య యూపీ యోధాస్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో యు ముంబా 35-33తో నెగ్గింది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 39-23తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది.

ఏపీ, గుజరాత్‌ల్లో రెండు కొత్త యూనిట్లు

2028 నాటికి రూ.2,500 కోట్ల టర్నోవర్
ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో రెండు కొత్త యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ ప్రకటించింది. కంపెనీ ఎండీ అరవింద్ నందా ఈ విషయం వెల్లడించారు. ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ పరిశ్రమలో గట్టి పట్టున్న కంపెనీకి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలోని ఐతవరం, తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్, ఉత్తరాఖండ్‌లోని పంత్ నగర్, కిచ్చ వద్ద నాలుగు ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. వీటికి తోడు ఏపీ, గుజరాత్‌ల్లో కొత్తగా రెండు సమగ్ర యూనిట్లు ఏర్పాటు చేయనుంది. ఇందు కోసం ఇటీవల పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన రూ.600 కోట్లలో కొంత మొత్తాన్ని ఖర్చు చేయనుంది. కొత్త యూనిట్లు, ఉన్న యూనిట్ల ఉత్పత్తి సామర్థ్య విస్తరణ ద్వారా 2028 మార్చి నాటికి రూ.2,500 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు నందా చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ రూ.1,293 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	100
విశాఖపట్నం	111	అనంతపురం	100
గోదావరి	115		

బిజినెస్

నేటితో విస్తారా కథ కంచికి..

ఎయిర్ ఇండియాలో విలీనం



ముంబై/న్యూఢిల్లీ: దేశ విమానయాన రంగంలో మరో కంపెనీ పేరు అదృశ్యమవుతోంది. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి 2015లో టాటా గ్రూప్ ఏర్పాటు చేసిన విస్తారా ఎయిర్‌లైన్స్ సోమవారం నుంచి టాటా గ్రూప్‌లోని ఎయిర్ ఇండియాలో విలీనమవుతోంది. విస్తారా ఎయిర్‌లైన్స్ ఈక్విటీలో ప్రస్తుతం టాటా గ్రూప్‌నకు 51 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 49 శాతం వాటా ఉంది. విలీనం తర్వాత ఎయిర్ ఇండియా ఈక్విటీలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంటుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం దేశీయ విమానయాన కంపెనీల ఈక్విటీలో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతిస్తూ 2012లో నిర్ణయం తీసుకుంది. దీంతో టాటా గ్రూప్ 51 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్ 49 శాతం వాటాతో 2015 జనవరిలో విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ప్రారంభించాయి.

మరింత పట్టు

టాటా గ్రూప్ 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసింది. అక్కడి నుంచి తన నిర్వహణలోని ఎయిర్ ఏషియా ఇండియా, విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఎయిర్ ఇండియాలో విలీనం చేస్తోంది. ఈ విలీనంతో ఎయిర్ ఇండియా ఒక్కటే దేశంలో ఫుల్ సర్వీస్ క్యారియర్‌గా నిలిచిపోనుంది. కాగా గత 17 సంవత్సరాల్లో కింగ్‌ఫిషర్, జెట్ ఎయిర్‌వేస్‌తో సహా ఐదు ఫుల్ సర్వీస్ క్యారియర్స్ మూతపడ్డాయి. విస్తారా విలీనంతో దేశ విమానయాన రంగంపై టాటా గ్రూప్ పట్టు మరింత పెరగనుంది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ రూ.3,195 కోట్ల పెట్టుబడి

విలీనం తర్వాత ఎయిర్ ఇండియా ఈక్విటీలో 25.1 శాతం వాటా కోసం సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్.. టాటా గ్రూప్‌నకు మరో రూ.3,195 కోట్లు సమకూర్చనుంది. ఈ మొత్తం ఈ నెలలోనే టాటా గ్రూప్‌నకు అందనుంది.

పైలెట్ల అసంతృప్తి

అయితే ఈ విలీనంపై ఎయిర్ ఇండియాకు చెందిన కొంత మంది పైలెట్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ పదవీ విరమణ వయసు 58 ఏళ్లకు, విస్తారా పైలెట్ల రిటైర్మెంట్ వయసు 60 ఏళ్లుగా ఉండడం ఇందుకు ప్రధాన కారణం. వెంటనే ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దాలని వారు ఇప్పటికే టాటా గ్రూప్‌ను కోరారు.

ఐదు ట్రేడింగ్ సెషన్స్.. రూ.20,000 కోట్లు

భారీగా ఎఫ్‌పీఐల అమ్మకాలు

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్‌పీఐ) అమ్మకాలు కొనసాగుతున్నాయి. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో (నవంబరు 4-8) ఎఫ్‌పీఐలు దాదాపు రూ.20,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. అక్టోబరు నెల మొత్తానికి చూసినా ఈ సంస్థలు భారత మార్కెట్లో రూ.1.14 లక్షల కోట్ల విలువైన షేర్లను విక్రయించాయి. దేశీయ కంపెనీల షేర్లు అధిక వాల్యుయేషన్‌తో ట్రేడవడం, చైనా మార్కెట్ మన కంటే ఆకర్షణీయంగా కనిపించడం, క్యూ2 ఆర్థిక ఫలితాలు ఆశించినంతగా లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. కాగా డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా ఆకర్షణీయంగా లేకపోతే ఎఫ్‌పీఐల అమ్మకాలకు ఇప్పట్లో తెరపడదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నయా ఫండ్స్..

బజాజ్ ఫిన్‌సర్వ్ కన్జంప్షన్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ.. కన్జంప్షన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది కన్జంప్షన్ థీమ్‌తో రూపొందించిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. వినియోగదారుల ప్రవర్తన, ఖర్చుల ఆధారంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఇండియా కన్జంప్షన్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ) బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 22.

టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్

టాటా అసెట్ మేనేజ్‌మెంట్.. టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఇన్నోవేటివ్ వ్యూహాలు, సరికొత్త థీమ్స్‌ను ఉపయోగిస్తూ ముందుకు సాగుతున్న అన్ని రంగాల్లోని కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. మదుపరులకు దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ నెల 11న ప్రారంభమయ్యే ఈ ఫండ్ 25న ముగియనుంది.

యాక్సిస్ సెప్టెంబరు 2027 ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ ఫైనాన్షియల్ సర్వీసెస్- సెప్టెంబరు 2027 ఇండెక్స్ ఫండ్ పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. వడ్డీ రేటు రిస్క్ తక్కువ ఉన్న, క్రెడిట్ రిస్క్ తక్కువగా ఉన్న వాటిల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ పథకం మెచ్యూరిటీ తేదీ 2027 సెప్టెంబరు 30. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ పథకం ముగింపు తేదీ ఈ నెల 21.

- క్యాప్‌స్టన్ సర్వీసెస్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.168.34 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.3.94 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో రెవెన్యూ రూ.128.99 కోట్లు, లాభం రూ.4.33 కోట్లుగా ఉంది.
- ఆసుస్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా నెల్లూరులో ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను ప్రారంభించింది. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సహా ఆసుస్ ఫ్లాగ్‌షిప్ ఉత్పత్తులన్నీ ఈ స్టోర్‌లో అందుబాటులో ఉండనున్నాయి. కొత్త స్టోర్ ప్రారంభంతో రాష్ట్రంలో ఆసుస్ స్టోర్ల సంఖ్య 10కి చేరింది.
- ఈవీ టెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్ సంస్థ మ్యాటర్ గ్రూప్ అహ్మదాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. ఇక్కడి ఎక్స్‌పీరియన్స్ హబ్‌లో కంపెనీ తొలి గేర్డ్ ఎలక్ట్రిక్ మోటార్‌బైక్ సహా పలు ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి.

టెక్ వ్యూ: 24,000 వద్ద గట్టి పరీక్ష



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ఆరంభంలోనే 500 పాయింట్లు పతనమై బేరిష్ ట్రెండ్‌ను కనబరిచింది. అయితే కీలకమైన 24,000 స్థాయిల వద్ద రికవరీ సాధించి 24,500 స్థాయికి చేరుకున్నప్పటికీ అక్కడ నిలదొక్కుకోవటంలో విఫలమైంది. అంతేకాకుండా ఎలాంటి సానుకూల ట్రెండ్‌ను సూచించలేదు. చివరకు వారాంతంలో 155 పాయింట్ల నష్టంతో 24,150 పాయింట్ల వద్ద క్లోజైంది. 24,000 స్థాయిల వద్ద మద్దతు తీసుకోవాలని ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. టెక్నికల్‌గా చూస్తే మొత్తం ట్రెండ్ బలహీనంగా కనిపిస్తోంది. వారం ప్రాతిపదికన చూస్తే గత వారం మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 150 పాయింట్లు, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 250 మేర పాయింట్ల మేరకు నష్టపోయాయి. గత వారం మార్కెట్ గమనం ప్రకారం చూస్తే ఈ వారం నిఫ్టీ మరోసారి నెగటివ్‌గా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోసారి 24,000 స్థాయిల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొనే వీలుంది. ప్రధాన బాటమ్ స్థాయిలైన 24,000 ఎగువన నిలదొక్కుకుంటేనే సానుకూల ట్రెండ్‌ను కనబరిచే అవకాశం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయిలైన 24,300 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 24,500. ఇది రెండు వారాల క్రితం ఏర్పడిన గరిష్ఠ స్థాయి. ఇక్కడ నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయిలైన 24,000 వద్ద నిలదొక్కుకోవటంలో విఫలమైతే మరింత బలహీనతను సూచిస్తుంది. సానుకూల, రక్షణ కోసం కీలకమైన ఈ మద్దతు స్థాయిలకు ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. బలహీనతను సూచిస్తే మాత్రం స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. తదుపరి మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం సైడ్‌వేస్ ట్రెండ్‌ను కొనసాగించింది. కొద్ది వారాలుగా ఈ సూచీ 52,000 స్థాయిల్లో కదలాడుతోంది. వీక్లీ ప్రాతిపదికన చూస్తే గత వారం ఈ సూచీ 110 పాయింట్ల నష్టంతో 51,560 స్థాయిల వద్ద క్లోజైంది. సానుకూల ట్రెండ్ కోసం ప్రధాన నిరోధ స్థాయిలైన 52,000 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 52,600. ఒకవేళ బలహీనతను సూచిస్తే మాత్రం 51,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 50,400.

పాటర్న్: నిఫ్టీకి 24,000 స్థాయిల వద్ద సమాంతరంగా దిగువకు ఏర్పడిన ట్రెండ్‌లైన్ దగ్గర మద్దతు స్థాయిలున్నాయి. ఒకవేళ ఈ మద్దతు స్థాయి కంటే దిగువకు చేరితే స్వల్పకాలిక బలహీనతను కనబరుస్తుంది. నిఫ్టీ ప్రస్తుతం 24,500 వద్ద అడ్డంగా కిందకు ఏర్పడిన నిరోధ రేఖకు దిగువన ఉంది. సానుకూలత కోసం ఈ రేఖకు ఎగువన బ్రేకౌట్ సాధించాల్సి ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,110, 24,200
మద్దతు	24,000, 23,920

ఇంకా అనిశ్చితే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలవటం, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించటం, క్రూడాయిల్ ధరల్లో మార్పులు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు సూచీల గమనంపై ప్రభావం చూపించే వీలుంది. ఈ వారం నిఫ్టీకి 24,100 వద్ద మద్దతు, 24,250 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. గత వారం ఐటీ, పీఎస్‌యూ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో రంగ షేర్లు కొంతమేరకు రాణించగా రియల్టీ, మీడియా, ఎనర్జీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

మహీంద్రా అండ్ మహీంద్రా: జీవిత కాల గరిష్ఠం తర్వాత ఈ షేరు 17 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కీలకమైన రూ.2,661 వద్ద మద్దతు లభించటంతో అక్కడి నుంచి అప్‌ట్రెండ్ మొదలైంది. తాజా త్రైమాసిక ఫలితాల అనంతరం మూమెంటమ్ పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు 2.89 శాతం లాభంతో రూ.2,974 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,150/3,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

ఇండియన్ హోటల్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. సెప్టెంబరు త్రైమాసికంలో మెరుగైన ఈపీఎస్, అమ్మకాలు నమోదవటంతో మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. నిఫ్టీతో పోలిస్తే మంచి పనితీరును కనబరుస్తోంది. గత శుక్రవారం 7.18 శాతం లాభంతో రూ.732 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.700 శ్రేణిలో ప్రవేశించి రూ.780/850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

అశోక్ లేలాండ్: జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 25 శాతం మేర పతనమైన ఈ కౌంటర్‌లో టర్న్ అరౌండ్ జరిగే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరు త్రైమాసికంలో మంచి ఫలితాలు సాధించటం, డివిడెండ్ ప్రకటించటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి కనబరుస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 2.79 శాతం లాభంతో రూ.221.93 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.210 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.270/290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

మోతీలాల్ ఓస్వాల్: మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో అక్యుములేషన్ జరుగుతోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ భారీగా నమోదవుతోంది. గత శుక్రవారం ఈ షేరు 6.1 శాతం లాభంతో రూ.997 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.960 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

పేటీఎం: ఈ కౌంటర్‌లో మే నెలలో మొదలైన బుల్‌రన్ ఇంకా కొనసాగుతోంది. నష్టాల మార్కెట్లో ఈ షేరు మెరుగ్గా రాణించింది. సెప్టెంబరు త్రైమాసికంలో ఈపీఎస్ 211 శాతం, సేల్స్ 11 శాతం పెరగటంతో మదుపరుల ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం 6.62 శాతం లాభంతో రూ.848 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.825 వద్ద పొజిషన్ తీసుకుని రూ.990/1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

నవ్య

కుటుంబ కదంబం



సంకల్పం

స్పందించే హృదయం

ఎప్పుడూ సమాజం నుంచి ఆశించడమేనా?
సమాజానికి మనం తిరిగి ఏమిస్తున్నాం?
ఈ ప్రశ్న బాల్యంలోనే ఆమెను ప్రభావితం చేసింది.
అది మొదలు... బడుగు జీవుల బతుకు బాగుకు...
మహిళా సాధికారతకే కాదు...
కాలుష్యం లేని ప్రకృతి కోసం... సహజ ఇంధన
వనరులను భావితరాలకు అందించడం కోసం...
నిరంతరం శ్రమిస్తున్నారు.
నిస్వార్థ సేవలకు గానూ ఇటీవలే 'సరోజినీనాయుడు
అంతర్జాతీయ అవార్డు' అందుకున్న సామాజిక కార్యకర్త,
పర్యావరణవేత్త, అమెరికాలో తెలుగు పారిశ్రామికవేత్త...
సుస్మిత ముసునూరు అంతరంగం ఇది.



"చుట్టూ ఉన్న మనుషులు, వాళ్ల స్థితిగతులు... ఊహ తెలిసినప్పటి నుంచీ సామాజిక అంశాలతోనే ముడిపడింది నా జీవితం. వయోధికులకు చదువు చెప్పడం, ఎయిడ్స్ బాధితులకు అండగా నిలవడం, మహిళలకు వృత్తి విద్యలు నేర్పడం... ఇలా వారి అభ్యున్నతికి తోడ్పాటునిచ్చేందుకు నావంతు కర్తవ్యం నిర్వర్తిస్తున్నాను. పర్యావరణ పరిరక్షణలో భాగమయ్యాను. దశాబ్దాలుగా సాగుతోంది ఈ ప్రయాణం. వీటన్నిటికీ గుర్తింపుగా ఇటీవల ప్రతిష్ఠాత్మక 'డాక్టర్ సరోజినీనాయుడు అంతర్జాతీయ అవార్డు' అందుకున్నాను. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందించిన మహిళలకు ఏటా ఈ పురస్కారం ఇస్తారు. 'చాంబర్ ఆఫ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ, ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఫిలిమ్ ఫోరమ్, ఏఏఎఫ్‌టీ యూనివర్సిటీ' సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నాయి.

అది ఉంటే చాలు...

నేనూ అందరిలాంటి అమ్మాయినే. కాకపోతే మన చుట్టూ ఉన్నవారు బాధలు పడుతుంటే మనకెందుకులే అని వదిలేయలేను. నాలో 'నేను' అనే ఆలోచన తక్కువ. 'మనం' అనే భావన కొంచెం ఎక్కువ. స్పందించే హృదయం ఉంటే చాలు... ఎవరైనా ఈమాత్రం సాయం చేయగలరనేది నా అభిప్రాయం. అయితే ఇవాళ చాలామందిలో 'నేను, నా కుటుంబం బాగుంటే చాలు' అనే ధోరణి గమనించాను. నా ఈ అవార్డు అలాంటివారిలో కొంతైనా మార్పు తీసుకురాగలిగితే... సమాజానికి మేలు జరిగినట్టే.

అప్పుడే మొదలైంది...

నాలో ఈ సేవా దృక్పథం రావడానికి కారణం... నేను పెరిగిన నేపథ్యం. మా అమ్మమ్మావాళ్లది గుంటూరు. అక్కడే



పుట్టాను. అయితే పెరిగిందంతా హైదరాబాద్‌లో. మా పెద్దమ్మ, పిన్నీవాళ్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వయోజన విద్య విభాగాల్లో పని చేసేవారు. ఆ వాతావరణంలో పెరిగాను కదా... నాకు ఎనిమిదేళ్లు వచ్చేసరికి మా చుట్టుపక్కల ఉన్న పెద్దవారికి చదువు చెప్పేదాన్ని. కాలేజీకి వచ్చేసరికి వయోజన విద్య తదితర ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగమయ్యాను. డిగ్రీలో ఉండగా ఎయిడ్స్ బాధితుల కోసం పని చేశాను. అప్పట్లో ఒక కుర్రాడు ఆత్మహత్య చేసుకున్నాడు. అతడిని చూసేందుకు ఆసుపత్రికి వెళితే... ఒకే డిస్పోజబుల్ ఇంజక్షన్ సూదిని చాలా మందికి ఉపయోగించడం కనిపించింది. ప్రభుత్వం ఇచ్చిన డిస్పోజబుల్ నీడిల్స్ స్టాక్‌ను బయట అమ్మేసుకుంటున్నారు. ఎయిడ్స్ లాంటి వైరస్‌ల వ్యాప్తికి ఇలాంటి దారుణాలే కారణం. తమకు వైరస్ ఎలా సోకిందో తెలుసుకోకుండా చాలామంది ఆత్మహత్యలు చేసుకునేవారు. దీనిపై సరైన అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో పలు కార్యక్రమాలు తలపెట్టాను. ఆశ్చర్యమేమంటే... మా లెక్చరర్లు నిరుత్సాహపరిచినా, మా తరగతిలో అమ్మాయిలందరూ ముందుకు వచ్చారు. ఎప్పుడైతే ఆడపిల్లలు కదిలారో... అప్పటి నుంచి అబ్బాయిలు కూడా మాతో జత కలిశారు.

అమెరికా వెళ్లినా...

డిగ్రీ అవ్వగానే ఎంబీఏ కోసం అమెరికా వెళ్లాను. తరువాత అక్కడే స్థిరపడ్డాను. మావారిది ఐటీ రంగం. దాదాపు పాతికేళ్లుగా యూఎస్‌లోనే నా నివాసం. అయితే తరచూ భారత్‌కు వచ్చి వెళుతుంటాను. అక్కడ సంపాదించినదాంట్లో అత్యధిక భాగం ఇక్కడి సేవా కార్యక్రమాల కోసమే ఖర్చు చేస్తున్నా. అమెరికాలో ప్రస్తుతం నాకు 'మిడ్‌వెస్ట్ గ్రీన్‌టెక్' కంపెనీ ఉంది. సౌర, పవన విద్యుత్ ఉపకరణాలకు సంబంధించిన సంస్థ ఇది. 2001లో ఐటీ సంస్థగా ప్రారంభమైన మా కంపెనీ, కాలక్రమంలో ఇలా మారింది.

భావితరాల కోసం...

నేను ఈ రంగంలోకి రావడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. నాకు మొదటి నుంచీ పర్యావరణంపై ప్రేమ ఎక్కువ. భారత్‌లో కొన్ని గ్రామాలు దత్తత తీసుకుని, వాటిల్లో వేల మొక్కలు నాటాను. చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూనే, అవి లేకపోతే సంభవించే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నాను. పెట్రోల్, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను భవిష్యత్ తరాలకు లేకుండా మనం విచ్చలవిడిగా వాడేస్తున్నాం. జల, వాయు, సౌర తదితర ప్రత్యామ్నాయ ఇంధనాలు మనకు విస్తారంగా అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకొని, శిలాజ ఇంధనాలను పొదుపు చేస్తే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడతాయి. ఈ ఆలోచనతోనే నేను 'మిడ్‌వెస్ట్ గ్రీన్‌టెక్' కంపెనీ నెలకొల్పాను.

ఆస్తులు ఇవ్వకపోయినా పర్లేదు...

నా లక్ష్యం గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడం. ఇప్పటికే చూస్తున్నాం... ఢిల్లీ కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. భూగోళాన్ని నాశనం చేస్తున్నది ఎవరో కాదు... మానవులు మాత్రమే. మన విధ్వంసంతో మంచు పర్వతాలు కరిగిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. భవిష్యత్తు తరాలకు మనం ఆస్తులు ఇవ్వకపోయినా పరవాలేదు... కానీ ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ఇవ్వగలగాలి. అదే వారికి పెద్ద వరం అవుతుంది. దాని కోసమే నేను సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్‌కు ప్రాధాన్యమిస్తున్నా. అమెరికాతో పాటు భారత్‌లో కొన్ని గ్రామాలను దత్తత తీసుకున్నా.

మహిళా సాధికారత...

ఏ ఆధారం లేని పిల్లలకు విద్య, అట్టడుగు వర్గాల మహిళల సాధికారతకు నిరంతరం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. వీధుల్లో, రైల్వే స్టేషన్ల దగ్గర కాగితాలు ఏరుకొంటూ, బిచ్చమెత్తుతూ కనిపించిన చిన్నారులకు రెసిడెన్షియల్ స్కూల్ ఒకటి ఏర్పాటు చేశాం. తల్లితండ్రులు లేని కొందరు పిల్లలను దత్తత తీసుకున్నాను. వాళ్లకు నేనే అమ్మను. 'మాకూ అమ్మ ఉంది' అని నన్ను చూసినప్పుడు వాళ్ల ముఖంలో కనిపించే ఆనందం వెల కట్టలేనిది. నాతో ఎంతో ఆప్యాయంగా ఉంటారు. అలాగే మహిళలకు కుట్టు పనిలాంటివి కాకుండా డిమాండ్ ఉన్న మగ్గం వర్క్ నేర్పించాను. దానివల్ల ఒక చీరను నాలుగైదు రోజుల్లో తయారు చేయవచ్చు. ఆర్థిక స్తోమత లేని చాలామంది అమ్మాయిలను కాలేజీల్లో చేర్పించాను. పైచదువుల కోసం కొందరిని విదేశీ వర్సిటీలకు పంపించాను. వీటన్నిటికీ నా సొంత డబ్బు ఖర్చు చేశాను. ఎవరి నుంచీ చందాలు తీసుకోలేదు. అంతేకాదు... నేను హెర్బల్ రీసెర్చ్ అవీ చేస్తుంటాను. కరోనా సమయంలో నానో టెక్నాలజీతో అభివృద్ధి చేసిన మెడిసిన్‌ను వ్యాపార కోణంలో కాకుండా... ఇక్కడ ఉచితంగా ఇచ్చాను. దీని కోసం మూడేళ్లు పూర్తిగా భారత్‌లోనే ఉన్నాను.

చంపుతామని బెదిరించినా...

అప్పట్లో యాదగిరిగుట్ట ప్రాంతంలో చిన్నారులను బలవంతంగా వేశ్య వృత్తిలోకి దించుతున్న వారిపై పోరాడాను. అక్కడికి వెళ్లి, వీడియోలు తీసి, వాటిని పోలీసులు, సంబంధిత అధికారులకు ఇచ్చేదాన్ని. కళాశాలల విద్యార్థులను కలుపుకొని, మానవ హారాలు, ధర్నాలవంటివి నిర్వహించాం. నన్ను చంపుతామని బెదిరింపులు, హెచ్చరికలు చాలా వచ్చాయి. వేటికీ బెదరలేదు. చిన్న పిల్లలు... ఎక్కడికీ వెళ్లలేక, తమ ముఖం ఎవరికీ చూపించలేక వేదన అనుభవించేవారు. అవన్నీ తలుచుకొంటే నాకు ఇప్పటికీ నిద్ర పట్టదు. మొత్తంమీద మా ప్రయత్నం ఫలితాన్నిచ్చింది. కొన్నిటిని కోర్టు సుమోటోగా తీసుకుంది. పోలీసులు, అధికారులు, కోర్టుల సహకారంతో చాలా మంది బాలికలకు విముక్తి లభించింది.

నాలానే మా అమ్మాయి...

నిజానికి నాకు పిల్లలు వద్దనుకున్నాను. ఎందుకంటే ఎంతోమంది అనాథ పిల్లలను చేరదీస్తున్నా. వారంతా నా పిల్లలే కదా. 'ఇంతమందిని దత్తత తీసుకొనే అవకాశం ఉన్నప్పుడు మళ్లీ నేను పిల్లల గురించి ఎందుకు ఆలోచించాలి' అనుకున్నాను. కానీ మా అమ్మానాన్నలు, పెద్దలు 'నీకు అక్కర్లేకపోతే మాకు ఇవ్వు. మాకూ మనవళ్లు, మనవరాళ్లతో ఆడుకోవాలని ఉంటుంది కదా' అన్నారు. అలా మా అమ్మాయి దీక్ష పుట్టింది. విశేషమేమంటే ఇప్పటివరకు మా అమ్మాయిని బడికి పంపలేదు. ఒకవేళ స్కూలుకు వెళ్లివుంటే తనను వదిలేసి నేను ఇలా తరచూ భారత్‌కు వచ్చి వెళ్లగలిగేదాన్ని కాదు. దీక్షది కూడా నాలానే... స్పందించే హృదయం. వండర్ కిడ్‌గా ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందింది. ఎనిమిదేళ్లకే టెన్త్ పరీక్షలు రాసింది. ప్రస్తుతం తనకు పన్నెండేళ్లు. ఇంటర్ చదువుతోంది. సేవ చేసే అవకాశం నాకు దొరికిన ఒక మంచి అవకాశం అయితే... దీక్ష పుట్టడం దేవుడు ఇచ్చిన వరం."

● హనుమా

హెల్త్



మధుమేహాన్ని నియంత్రించాలంటే..

రోజూ మనం తీసుకునే ఆహారం నుంచి శరీరం గ్లూకోజ్‌ను గ్రహించి శక్తిగా మారుస్తుంది. ఇందుకు క్లోమగ్రంధి ఉత్పత్తి చేసే ఇన్సులిన్ సహాయం చేస్తుంది. ఇన్సులిన్ సరిగా ఉత్పత్తి కాకపోయినా, ఉత్పత్తి అయినదాన్ని శరీరం ఉపయోగించుకోకపోయినా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి మధుమేహం వస్తుంది. శారీరక వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, సమయానికి నిద్రపోకపోవడం, మద్యపానం తదితర కారణాలవల్ల మధుమేహం బారిన పడే అవకాశం ఉంది. దీని లక్షణాలు, ఇది రాకుండా వుండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

లక్షణాలు

- తరచూ మూత్ర విసర్జన, విపరీతమైన ఆకలి, ఎప్పుడూ నీరసంగా ఉండడం, అధిక దాహం, శరీరంపై గాయాలు మానకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చిగుళ్ల వ్యాధులు, చర్మ వ్యాధులు, కంటి చూపు మందగించడం, పాదాల నొప్పులు కూడా ఉంటాయి.

జాగ్రత్తలు

- ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారపదార్థాలు, ప్రొటీన్స్ ఎక్కువగా ఉండే బీన్స్, పప్పు ధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే పదార్థాలు, కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉండే జామకాయ, పుచ్చకాయ, బొప్పాయి, నారింజలను తీసుకోవాలి. ఆకుకూరలు, చిరుధాన్యాలు, బాదాం, వాల్‌నట్స్ తప్పకుండా తినాలి. అప్పుడే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. వారానికి రెండు సార్లు ఉపవాసం మంచి ఫలితాన్నిస్తుంది. ఒకేసారి ఎక్కువగా తినకుండా తక్కువ పరిమాణంలో ఎక్కువసార్లు తినడం ప్రయోజనకరం.
- చక్కెర, బెల్లంతో చేసిన పదార్థాలు, తేనె, కొబ్బరినీళ్లు, అరటి, మామిడి, సపోటా, సీతాఫలం, ద్రాక్ష, పనస పండ్లను తినకూడదు.
- నేచురల్ ఇన్సులిన్‌గా పనిచేసే తిప్పతీగ రసం, మునగ ఆకు టీ, వేప ఆకు రసం, అశ్వగంధ ఆకుల రసం, కలబంద రసం తీసుకోవడం వల్ల కూడా మధుమేహాన్ని నియంత్రణలో ఉంచవచ్చు.

నవ్విస్తూనే నిలదీస్తారు



సమస్యలపై నిలదీయడం శ్వేతా మంత్రి నైజం. వైకల్యంతో ఉన్నవారి ఇబ్బందుల గురించి గట్టిగా మాట్లాడినందుకు ఆమె అవహేళనలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు అవే మాటలకు హాస్యాన్నీ, వ్యంగ్యాన్నీ జోడించి... స్టాండప్ కమెడియన్‌గా ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తిస్తున్నారు.

"మార్పునకు హాస్యం కూడా ఒక సాధనంగా ఉపయోగించవచ్చనే ఆలోచన నాకు రావడానికి ముందు... ఎన్నో వైఫల్యాలను భరించాను. వైకల్యాలతో ఉన్న వ్యక్తులు ఎదుర్కొనే సమస్యలను, సవాళ్లను వివరిస్తూ ఒక చిత్రాన్ని తీశాను. అది ఆదరణ పొందలేదు సరికదా... నేను అవహేళనలు ఎదుర్కోవాల్సి వచ్చింది. "ప్రతిదానికీ ప్రభుత్వం మీదో, అధికారుల మీదో, సమాజం మీదో ఫిర్యాదులు ఎందుకు చేస్తారు? మీకు అందుబాటులో ఉన్న వనరుల్ని వినియోగించుకొని బాగుపడండి" అని ఒక అధికారి నా ముఖం మీదే అన్నారు. ఎంతో అవమానంగా అనిపించింది. ఇక మా బాధలు ఎవరితో చెప్పుకోవాలనే నైరాశ్యం ఆవరించింది.

ఆ ప్రశ్న వేధించింది...

మా సొంత ఊరు మహారాష్ట్రలోని పుణే. నేను 'స్పైనా బైఫిడా' అనే సమస్యతో పుట్టాను. దీనివల్ల వెన్నెముక సరిగ్గా అభివృద్ధి కాదు. నా పరిస్థితి చూసి తల్లడిల్లిన నా తల్లితండ్రులు ఎన్నో ఆసుపత్రులకు తిరిగారు. శస్త్రచికిత్సలు, ఫిజియో థెరపీ చేయించారు. అప్పటివరకు నిలబడలేకుండా ఉన్న నేను క్రచెస్ ఉపయోగించి నడిచే స్థితికి వచ్చాను. నాకు ఏడేళ్లు వచ్చేవరకూ ఎవరో ఒకరు నన్ను ఎత్తుకొని తీసుకువెళ్లి, బడిలో దించి వచ్చేవారు. ఆ తరువాత ఆటోలో కష్టపడి నన్ను ఎక్కించాల్సి వచ్చేది. అక్కడ దిగాక తోటి విద్యార్థుల సాయంతో తరగతి గదిలోకి వెళ్లేదాన్ని. శారీరకంగా, మానసికంగా అది ఎంతో బాధగా అనిపించేది. కానీ చదువంటే నాకు ఇష్టం కాబట్టి ఓర్చుకున్నాను. కాలేజీకి వచ్చాక... మావాళ్లు నాకు ఎలక్ట్రికల్ వైర్ కొన్నారు. కానీ తరగతి గదివరకూ దాన్ని నడిపించుకు వెళ్లే సదుపాయం లేదు. అక్కడే కాదు, వైకల్యంతో ఉన్నవారికి అనువుగా ఉండే సౌకర్యాలు చాలా చోట్ల ఉండేవి కావు. 2007లో మమ్మల్ని రాజస్థాన్ టూర్‌కు తీసుకువెళ్లారు. పాశ్చాత్య శైలిలో ఉండే టాయిలెట్లు ఆఖరికి హైవేల మీద ఉన్న ధాబాల్లో సైతం ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. వాటి యజమానులను అడిగితే... "అవి విదేశీయుల కోసం" అని చెప్పారు. వేరే దేశాల నుంచి వచ్చేవారికోసం చేసే ఇలాంటి ఏర్పాట్లను వికలాంగుల కోసం దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు ఎందుకు చెయ్యకూడదనే ప్రశ్న నన్ను వేధించింది. అదే కొన్నేళ్ళ తరువాత... చక్రాల కుర్చీకే పరిమితమైన నా స్నేహితుడు విశాల్ సావంత్ తో కలిసి 'గివ్ సమ్ స్పేస్' అనే ప్రాజెక్ట్ ప్రారంభించడానికి నాంది పలికింది. నిధులు సేకరించి పుణేలోని ప్రధాన ప్రాంతాల్లో, పుస్తకాల దుకాణాలు, రెస్టారెంట్లు, విద్యా సంస్థల్లో చక్రాల కుర్చీలతో వెళ్ళడానికి వీలుగా ర్యాంప్‌లు ఏర్పాటు చేశాం.

కొత్త పద్ధతిలో చెప్పాలనుకున్నా...

వైకల్యాలు ఉన్నవారి సమస్యలను సమాజానికి అర్థమయ్యేలా చెప్పాలనే తపనతో... 2014లో ఒక చిత్రాన్ని తీశాను. పలు చోట్ల ప్రదర్శించాను. కానీ నేను ఆశించిన స్పందన రాకపోగా... వ్యతిరేకతను, అవమానాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. దానితో మళ్ళీ అలాంటి ఆలోచన చెయ్యలేదు. మా ప్రాజెక్టుకు, వివిధ సంస్థలతో భాగస్వామ్యానికి పరిమితమయ్యాను. కానీ 2016లో జరిగిన ఒక ప్రమాదంతో కొన్నాళ్ళు ఇంట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో అప్పటివరకూ సాగిన నా ప్రయాణాన్ని, విజయాలను, వైఫల్యాలను సమీక్షించుకున్నాను. సమాజానికి నేను చెప్పాలనుకున్నది కొత్త పద్ధతిలో వినిపించాలనుకున్నాను. దానికోసం స్టాండప్ కామెడీని ఎంచుకున్నాను. కోలుకున్న తరువాత పుణేలో మొదటి ప్రదర్శన ఇచ్చాను. వైకల్యంతో ఉన్న ఒక మహిళ స్టాండప్ కామెడీ చేయడాన్ని జనం ఆమోదించడం కష్టం. నా మాటలతో వారికి హాస్యాన్ని అందిస్తూనే... వికలాంగుల పట్ల వారికి ఉన్న బాధ్యతను కూడా తెలియజేయాలి. నాలాంటి వారి మీద జాలికే పరిమితం కాకుండా... బహిరంగ ప్రదేశాల్లో వారు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఏం చేయగలం? అనే ఆలోచన కలిగించాలి. మళ్ళీ ఇదంతా పాఠం చెబుతున్నట్టో, నిష్ఠూరం ఆడుతున్నట్టో, బతిమాలుతున్నట్టో, నిందిస్తున్నట్టో ఉండకూడదు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని నా స్క్రిప్ట్ రాసుకున్నాను. నా ప్రదర్శనకు మంచి స్పందన వచ్చింది. పలు క్లబ్‌లు, కేఫ్‌ల నుంచి ఆహ్వానాలు వెల్లువెత్తాయి.



ఆదాయంలో అధిక శాతం వారికే...

ప్రదర్శనల ద్వారా నాకు వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వికలాంగుల సౌకర్యాల కోసం ఖర్చు చేస్తున్నాను. అలాగే నా ప్రేక్షకులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాను. వైకల్యాలు ఉన్నవారికి నేను చెప్పగలిగేది ఏమిటంటే... ఎలాంటి పరిస్థితి ఎదురైనా కుంగిపోకండి. మీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోండి. మీదైన అస్తిత్వాన్ని సృష్టించుకోండి. నిర్భయంగా మాట్లాడండి. నిజం అని నమ్మినదాన్ని జంకు లేకుండా చెప్పండి. వేరొకరిలా ఉండాలని ప్రయత్నించకండి. వైకల్యాలు దాదాపుగా మన జీవితాంతం మనతోనే ఉంటాయి. ఈ సత్యాన్ని ఆమోదించాలి. మన హక్కులు సాధించుకోవడానికి నిరంతరం పోరాడుతూనే ఉండాలి."

వదులుకున్నవే ఎక్కువ...

ఇప్పటివరకూ 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. కానీ వదులుకున్నవి అంతకన్నా ఎన్నో రెట్లు ఉన్నాయి. ఎందుకంటే నా ఎడమ కాలు సరిగ్గా పనిచెయ్యదు. ఫిజియోథెరపీ ద్వారా 20 నుంచి ముప్పై శాతం కదల్చగలుగుతున్నాను. కానీ కదలిక ఇప్పటికీ నాకు సమస్యే. ఇది వరకు నేను లెగ్ బ్రేసెస్ లేకుండా ఏడు నిమిషాలు నిలబడగలిగేదాన్ని. ఇప్పుడు ఒక్క నిమిషమే నిలబడగలుగుతున్నాను. ఇక, నాకున్న ఆరోగ్య సమస్య వల్ల తరచూ వాష్ రూమ్‌కు వెళ్ళాల్సి వస్తుంది. సరైన మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బంది మరింత పెరుగుతోంది. అందుకే 'ప్రదర్శన ఇచ్చే వేదికకు వాష్‌రూమ్ దగ్గరగా ఉందా? ఎన్ని మెట్లు ఎక్కాలి? వేదికను చేరడానికి ఎంత సేపు పడుతుంది?' అనే విషయాలనే ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుంటాను."

మీకు తెలుసా!



ఇవి ఔషధాలు...

మన వంటింట్లో అనాదిగా ఉపయోగిస్తున్న అద్భుత పదార్థం పసుపు. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, యాంటీఇన్‌ఫ్లమేటరీ కాంపోనెంట్స్ అధిక మొత్తంలో ఉంటాయి. మొటిమలు, వాటివల్ల ఏర్పడే మచ్చలు, వృద్ధాప్యపు ఛాయలు, సొరియాసిస్ వంటి అనేక చర్మ సమస్యలకు ఔషధంలా పని చేస్తుంది. రోజూ వంటల్లోనే కాకుండా పాలల్లో కూడా పసుపు వేసుకొని తాగితే మంచి ఫలితాలుంటాయి.

తులసిలో విటమిన్ కె, యాంటీఆక్సిడెంట్స్ అధికం. ఇది రక్తప్రసరణను ప్రేరేపించి జుత్తు పెరగడానికి ఉపకరిస్తుంది. ఇందులో యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చర్మంపై నల్లమచ్చలు, మొటిమలు, ఇన్‌ఫెక్షన్లు తగ్గించడంలో దోహదపడతాయి.

చర్మ సంబంధిత ఇన్‌ఫెక్షన్లను నియంత్రించడంలో వేప ఆకు బాగా ఉపయోగపడుతుంది. చర్మంపై మంట తగ్గిస్తుంది. వేప కలిపిన నీటితో స్నానం చేస్తే ఎన్నో చర్మ వ్యాధులను దూరంగా పెట్టచ్చు. వేపలో యాంటీబ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీవైరల్ లక్షణాలు అధికం.

కళ్లపై ఒత్తిడి... ఇలా తగ్గిద్దాం..!


ఇటీవల కాలంలో పిల్లలు డిజిటల్ తెరల నుంచి చూపు తిప్పడంలేదు. దీనివల్ల కళ్లపై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. ఈ పరిస్థితి సుదీర్ఘ కాలం కొనసాగితే నిద్రలేమి వంటి సమస్యలెన్నో తలెత్తుతాయని అంటున్నారు నిపుణులు. కళ్ల అలసటకు గురికాకుండా కొన్ని సూచనలు చేస్తున్నారు.

- డిజిటల్ తెరలను వీక్షిస్తున్నప్పుడు ఆ గదిలో మంచి వెలుతురు ఉండేలా చూసుకోవాలి. అంటే స్క్రీన్ బ్రైట్‌నెస్- రూమ్ లైటింగ్‌ల మధ్య పెద్దగా వ్యత్యాసం లేకుండా జాగ్రత్తపడాలి. మరో ముఖ్య విషయం ఏమిటంటే... మీ పిల్లలు గాడ్జెట్స్‌ను చీకట్లో ఉపయోగించకుండా చర్యలు తీసుకోండి. అలాగే స్క్రీన్‌పై వేరే లైట్ రిఫ్లెక్షన్లు పడకుండా చూడండి.



- కంప్యూటర్, ట్యాబ్, మొబైల్... ఏది చూస్తున్నా వాటి స్క్రీన్‌కి పిల్లల కళ్లకి మధ్య కనీసం ఒకటిన్నర నుంచి రెండు అడుగుల దూరం ఉండాలి. స్క్రీన్ టాప్ వారి కళ్లకు సమాంతర ఎత్తులో పెట్టాలి. దీనివల్ల మీ పిల్లలు స్క్రీన్ చూడడానికి తల అటూ ఇటూ తిప్పి ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు.
- చుట్టుపక్కల పరిసరాలకు తగినట్టుగా స్క్రీన్ బ్రైట్‌నెస్‌ను ఎడ్జెస్ట్ చేయండి. మరీ డార్క్‌గానో... మరీ లైట్‌గానో ఉండకూడదు. స్పష్టంగా కనిపించడానికి కాంట్రాస్ట్‌ను సరి చేయండి. దీనివల్ల కళ్లకు శ్రమ తగ్గుతుంది.
- కంప్యూటర్ స్క్రీన్ మీద ఆబ్జెక్ట్ కానీ, అక్షరాలు కానీ కనిపించీ కనిపించనట్టు ఉండకూడదు. చూడగానే స్పష్టంగా ఉండేలా ఫాంట్ సైజ్ పెంచుకోండి. అవసరమైతే జూమ్ ఆప్షన్‌ని ఉపయోగించండి.
- డిజిటల్ తెరల నుంచి వచ్చే బ్లూ లైట్ మీ పిల్లల నిద్రకు భంగం కలిగిస్తుంది. ముఖ్యంగా నిద్రపోయే ముందు గాడ్జెట్స్‌ని ఉపయోగించడంవల్ల ఈ సమస్య మరింత వేధిస్తుంది. సాయంత్రం వేళల్లో మొబైల్స్, ట్యాబ్‌లు చూసే సమయాన్ని తగ్గించి, గాడ్జెట్స్‌ని నైట్ మోడ్‌లో పెట్టడం వల్ల కొంత ప్రయోజనం ఉంటుంది.

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. ఆయీ నై (స్త్రీ-2)
4. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
5. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
6. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
7. జా రాంరుున్ (దో పత్తీ)
8. అపనా బనాలే (బేడియా)
9. మిలియనీర్ (గ్లోరీ)
10. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

అంతరిక్షంలో చిక్కి..


అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లే ముందు (జూన్ 5న) సునీత


సెప్టెంబరు 24న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆమె ఫొటో

న్యూయార్క్, నవంబరు 10: ఐదు నెలల క్రితం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లి అక్కడే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతావిలియమ్స్ (59) ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది! వెళ్లేటప్పుడు ఆరోగ్యంగా కనిపించిన సునీత.. సెప్టెంబరు 24న తీసిన ఫొటోల్లో బాగా బరువు తగ్గిపోయి, బక్కచిక్కిపోయి, బుగ్గలు పీక్కుపోయి.. పదేళ్ల వయసు పైబడినట్టుగా కనిపిస్తుండడం గమనార్హం. ఈ ఏడాది జూన్ 5న ఆమె స్టార్‌లైన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. షెడ్యూలు ప్రకారం జూన్ 14నే ఆమె తిరిగి రావాల్సి ఉంది. కానీ, వ్యోమనౌకలో హీలియం లీకేజీ వల్ల తిరుగుప్రయాణం సాధ్యం కాలేదు. స్పేస్‌ఎక్స్ వ్యోమనౌకలో వచ్చే ఫిబ్రవరిలో ఆమెను భూమికి తీసుకురానున్నట్టు నాసా ప్రకటించింది. ఆమె ఆరోగ్యంగానే ఉన్నట్టు నాసా ప్రకటన చేసినప్పటికీ.. నానాటికీ క్షీణిస్తున్న ఆమె ఆరోగ్యాన్ని బాగు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. నాసాలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించినదాని ప్రకారం.. వ్యోమగాములు రోదసిలో ఉండగా నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన హైక్యాలరీ ఆహారాన్ని ఆమె తీసుకోలేకపోతున్నారని తెలుస్తోంది. ఎక్కువకాలంపాటు రోదసిలో ఉంటే.. ఆ ప్రభావం వ్యోమగాముల ఆరోగ్యంపై పడుతుంది. పురుషులతో పోలిస్తే మహిళా వ్యోమగాముల ఆరోగ్యంపై ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. బరువు కోల్పోవడం, కండరాలు దెబ్బతినడం, ఎముకలు బోలుగా మారడం వంటి సమస్యలతో బాధపడతారు. ప్రస్తుతం సునీత కోల్పోయిన బరువును తిరిగి పొంది, మునుపటిలా ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకు 3,500 నుంచి 4000 క్యాలరీల ఆహారం తినాలని నాసా వర్గాల సమాచారం.




ముద్దు బొమ్మతో.. పెళ్లై ఆరేళ్లు!

ఒకరి తర్వాత ఒకరు.. వరుసగా ఏడుగురు అమ్మాయిలు ఛీకొడితే ఏమవుతుంది? ఈ కాలం కుర్రాళ్లు.. 'అది పోతే ఇంకోతొస్తది' అని లైట్ తీస్కుంటారు!! కానీ, జపాన్‌కు చెందిన అకిహికో కాండో అనే ఈ వ్యక్తిని ఏడుగురు అమ్మాయిలు ఛీకొడితే.. ఇదుగో ఇలా ఓ కార్టూన్ క్యారెక్టర్‌ని పెళ్లి చేసుకుని ప్రశాంతంగా సెటిలైపోయాడు. ఇటీవలే తమ ఆరో వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకొని ఆ ఫొటోలను ఇన్‌స్టాలో పెట్టి పాపులర్ అయిపోయాడు!!



"ఎనభై రోజుల్లో భూప్రదక్షిణ".. ఎప్పుడో విమానాలు లేని రోజుల్లో, 1872లో ప్రఖ్యాత ఫ్రెంచ్ రచయిత జూల్స్‌వెర్న్ రాసిన కాల్పనిక నవల పేరు ఇది! ఆయన ఆ నవల రాసిన వందేళ్ల తర్వాత.. శబ్దం కన్నా ఎక్కువ వేగంతో (సూపర్‌సానిక్) ప్రయాణించే కంకార్డ్ విమానాలు గాల్లో ఎగిరాయి. 1986 నవంబరులో బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఓ కంకార్డ్ విమానం.. 29 గంటల 59 నిమిషాల్లో భూప్రదక్షిణం చేసింది. ఇప్పుడు వాటినిమించి.. శబ్దవేగానికి ఐదు రెట్ల (హైపర్‌సానిక్) వేగంతో ప్రయాణించే విమానాల తయారీకి కృషి జరుగుతోంది. చైనాకు చెందిన 'స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్' కంపెనీ ఇటీవలే ఆ దిశగా ఒక అడుగు ముందుకు వేసింది. శబ్దానికి నాలుగు రెట్ల వేగంతో ప్రయాణించే విమానాన్ని తయారుచేసింది. దాదాపుగా గంటకు 5 వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ విమానంలో భూప్రదక్షిణ చేయడానికి జస్ట్ 7 గంటలు పడుతుందంతే!!




చైనా తయారుచేసిన హైపర్‌సానిక్ విమానం

7 గంటల్లో భూప్రదక్షిణ!

శబ్దానికి నాలుగు రెట్ల వేగంతో వెళ్లే విమానం

చైనా సంస్థ స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ తయారీ!

శబ్దానికి 9 రెట్ల వేగంతో వెళ్లే విమానాల అభివృద్ధి దిశగా అమెరికన్ కంపెనీల కృషి

శబ్దానికి ఐదు రెట్లు, అంతకుమించిన (మ్యాక్ 5) వేగంతో ఖండాలు దాటి దూసుకెళ్లి లక్ష్యాలను ఛేదించే హైపర్ సానిక్ క్షిపణులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయిగానీ.. అతి తక్కువ సమయంలో సుదూరతీరాలకు ప్రయాణికులను తీసుకెళ్లే వాణిజ్య హైపర్‌సానిక్ విమానాలు మాత్రం చాలాకాలంగా ప్రయోగాల దశలోనే ఉన్నాయి. చైనాకు చెందిన 'స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ (ఈ కంపెనీ చైనా నామధేయం.. 'లింకాంగ్ టియాన్షింగ్ టెక్నాలజీ')' సంస్థ ఆ దిశగా ఒకడుగు ముందుకు వేసినట్టు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' వార్తాసంస్థ ఇటీవల ఒక కథనాన్ని వెలువరించింది. ఈ కంపెనీ తయారుచేసిన వాణిజ్య విమాన నమూనా శబ్దానికి నాలుగు రెట్ల వేగాన్ని సాధించినట్టు అందులో పేర్కొంది. శబ్దవేగం గంటకు 1234.8 కిలోమీటర్లు. దానికి నాలుగు రెట్లంటే.. దాదాపుగా గంటకు 5 వేల కిలోమీటర్లు. లండన్ నుంచి న్యూయార్క్‌కి కంకార్డ్ (సూపర్‌సానిక్) విమానంలో అయితే 2 గంటల 53 నిమిషాల సమయం పట్టేది. ఈ విమానంలో అయితే గంటన్నరలో వెళ్లిపోవచ్చు. అలాగే.. లండన్ నుంచి సిడ్నీకి ప్రస్తుతం అందుబాటులో ఉన్న విమానాల్లో అయితే సుమారుగా 22 గంటల సమయం పడుతుంది. అదే ఈ చైనా కంపెనీ తయారుచేసిన విమానంలో అయితే కేవలం నాలుగు గంటల లోపే పడుతుందన్నమాట. ఈ విమానం 2027 నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని అంచనా. అన్నట్టు.. ఈ విమానికి సదరు చైనా కంపెనీ పెట్టిన పేరు యున్షింగ్. అంటే పరుగుతీయడం అని అర్థం. ఒక్క చైనా కంపెనీయేకాదు.. అమెరికాకు చెందిన వీనస్ ఏరోస్పేస్ కంపెనీ.. 'స్టార్‌గేజర్' అనే హైపర్‌సానిక్ విమానాన్ని అభివృద్ధి చేస్తోంది. 2030 నాటికి అందుబాటులోకి వచ్చే ఈ విమానం.. మ్యాక్ 9 (శబ్దవేగానికి 9 రెట్లు) వేగంతో ప్రయాణిస్తుందని, ఢిల్లీ నుంచి లండన్‌కు కేవలం గంటలో వెళ్లిపోతుందని (ఇప్పుడు 9 నుంచి 10 గంటలు పడుతోంది) దాని రూపకర్తలు చెబుతున్నారు. అంటే.. సరదాగా మధ్యాహ్న భోజనం వేళకు తాజ్‌మహల్‌ని సందర్శించి సాయంత్రం లండన్‌లో బిగ్‌బెన్ గడియారాన్ని చూస్తూ టీ రుచిని ఆస్వాదించవచ్చన్నమాట. ఇలాగే.. అమెరికాకు చెందిన బూమ్‌సానిక్ సంస్థ కూడా హైపర్‌సానిక్ విమానాల తయారీకి చాలాకాలంగా కృషిచేస్తోంది.




అమెరికా తయారుచేస్తున్న హైపర్‌సానిక్ విమానం

పర్యావరణంపై ఆందోళన..

హైపర్‌సానిక్ విమానాలు అందుబాటులోకి రావడం వల్ల దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోయేంత దగ్గరవుతాయన్న మాట నిజమేగానీ.. ఆ విమానాల నుంచి వెలువడే కాలుష్యం పర్యావరణపరమైన ఆందోళనలకు కారణమవుతోంది. నాసా అంచనాల ప్రకారం.. సూపర్‌సానిక్ జెట్ విమానాలు సంప్రదాయ విమానాలతో పోలిస్తే రెట్టింపు ఇంధనాన్ని వినియోగిస్తాయి. పోనీ అందుకు తగ్గట్టుగా పెద్ద సంఖ్యలో ప్రయాణికులను మోసుకెళ్లగలవా? అంటే.. సాధారణ విమానాలతో పోలిస్తే వాటిలో తక్కువమంది మాత్రమే ప్రయాణించే వీలుంటుంది.

ఇంత ఆలస్యమేంటి?

హైపర్‌సానిక్ క్షిపణులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చినా.. ఆ వేగంతో ప్రయాణించే విమానాల రాకకు ఎందుకింత ఆలస్యమవుతోంది? అనే సందేహం చాలా మందికి రావచ్చు. క్షిపణి ప్రయోజనం.. శత్రు దేశంపైకి దూసుకెళ్లి లక్ష్యాన్ని తాకి విధ్వంసం సృష్టించడమే. దాన్ని క్షేమంగా దింపాల్సిన అవసరం లేదు. కానీ, వాణిజ్యపరమైన విమానాలు అలా కాదు. ప్రయాణికుల క్షేమం ముఖ్యం. క్షిపణుల టెక్నాలజీని విమానాలకు వాడితే.. ఆ వేగం వల్ల పుట్టే వేడి, శక్తికే ఆ విమానాలు ధ్వంసమైపోతాయి. కాబట్టి ఉష్ణోగ్రతలను తక్కువస్థాయిలో ఉంచేందుకు వైమానిక రంగ నిపుణులు.. మాగ్నెటో హైడ్రో డైనమిక్స్, సినర్జిటిక్ ఎయిర్ బ్రీతింగ్ రాకెట్ ఇంజన్ వంటి ప్రత్యామ్నాయ చోదక విధానాలను (ప్రొపల్షన్ మీన్స్) పరీక్షిస్తున్నారు. ఈ ఎయిర్ బ్రీతింగ్ ఇంజన్లు.. రాకెట్ తరహాలో దూసుకుపోవడానికి, అదే సమయంలో జెట్ ఇంజన్ తరహాలో ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడతాయి.



'ఐదు రూపాయల డాక్టర్'గా ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలపై విరుచుకుపడి... 'అదిరింది' అనిపించిన విజయ్!

ఓటు విలువ తెలియచేస్తూ... బడా రాజకీయ నాయకులనే ఢీకొట్టిన 'సర్కార్' నాయకుడు!

పార్టీలు, ప్రభుత్వాలు, పథకాలపై అనేక పంచ్ డైలాగులతో అభిమానులకు ఎప్పటి నుంచో 'పొలిటికల్' సంకేతాలు!

ఎట్టకేలకు, ఇప్పుడు రాజకీయ పార్టీ స్థాపన! పేరులో... విజయ్! పార్టీ పేరులోనూ విజయం (వెట్రి)! మరి... తమిళనాడు రాజకీయాల్లో విజయ్‌ని ఆ విజయం వరిస్తుందా? ఆయన చేరే తీరం ఏది?

విజయ్... తీరం చేరేనా!?

తమిళనాట నటుడు విజయ్ కొత్త పార్టీ

పంచ్ డైలాగులతో...

విజయ్ పంచ్ డైలాగులకు థియేటర్లు దద్దరిల్లుతాయి. కానీ... కొందరు రాజకీయ నాయకులకు మాత్రం అవంటే గిట్టదు. ఆ డైలాగులు తమ గురించి, తమ పార్టీ గురించే చెబుతున్నారని వారి ఉద్దేశం. ఆదిలోనే విజయ్ డీఎంకేతో వైరం తెచ్చుకున్నారు. పలుమార్లు తన సినిమాల విడుదల, థియేటర్ల కాంట్రాక్టు వంటి విషయాల్లో తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో... 2011లో విజయ్ అభిమాన సంఘం జయలలిత నేతృత్వంలోని అన్నా డీఎంకేకు మద్దతు పలికింది. జయ విజయం కోసం విజయ్ పరోక్షంగా పని చేశారు. తదనంతరం... జయ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఉచిత మిక్సీలు, గ్రైండర్ల వంటి వాటిని విమర్శిస్తూ విజయ్ సినిమాలో పంచ్ డైలాగులు పేల్చారు. దీంతో... ఆమె సర్కారు సైతం విజయ్ పట్ల కాస్త కఠినంగా వ్యవహరించింది. కొన్నాళ్లు విజయ్ చిత్రాల ప్రదర్శనకు థియేటర్లు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. రాజకీయ నేతల 'పవర్' ఏమిటో విజయ్‌కి తెలిసొచ్చింది. ఈ నేపథ్యంలో 'పొలిటికల్ పవర్' సాధించాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతారు.


నాయకుల చిత్రపటాల వద్ద పూలు జల్లుతున్న విజయ్

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(చెన్నై - ఆంధ్రజ్యోతి)

సినిమాల్లో కథానాయకుడు... రాజకీయాల్లో నాయకుడు కావాలనే ఆశ, లక్ష్యం! ఎప్పటికప్పుడు రాజకీయ రంగ ప్రవేశానికి ఒక అడుగు ముందుకు వేస్తూనే... 'ఇప్పుడు కాదు' అంటూ రెండు అడుగులు వెనక్కి వేసిన నేపథ్యం! ఇప్పుడు... ఎట్టకేలకు ఈ కథానాయకుడు రాజకీయ నాయకుడిగా అవతరించాడు. ఆయనే... విజయ్! తమిళ నటుడే అయినప్పటికీ... తెలుగు సినీ ప్రేక్షకులకూ సుపరిచితుడు! మరో ఏడాదిన్నరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో 'ఇదే సరైన సమయం' అంటూ విజయ్ తన పార్టీ ప్రకటించేశారు. ఆయన తీరేమిటి? భవిష్యత్తు ఎలా ఉండొచ్చు? ఇప్పటికే ఉన్న డీఎంకే, అన్నా డీఎంకేలలో విజయ్ వల్ల ఎవరికి నష్టం? ఎంత నష్టం? సినీ నటుడిగా ఉన్న జనాకర్షణ రాజకీయాల్లోనూ పనికొస్తుందా? ఆయన ఏర్పాటు చేసిన 'తమిళగ వెట్రి కళగం' (తమిళుల విజయం పార్టీ) విజయ తీరాలకు చేరుతుందా? దీనిపై తమిళనాట భారీ చర్చ జరుగుతోంది. డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు వారికీ సుపరిచితుడైన విజయ్ పార్టీపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది.

అభిమానులే ఆలంబనగా రాజకీయ ప్రస్థానం

రాజకీయ నేతల్లేకుండానే పార్టీ ఏర్పాటు

కరుణ, జయ లేని లోటు పూడ్చాలనే లక్ష్యం

డీఎంకే, బీజేపీపై బహిరంగంగా వ్యతిరేకత

టీవీకే ప్రస్థానంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

ఎవరీ విజయ్?

విజయ్ పూర్తి పేరు... జోసఫ్ విజయ్ చంద్రశేఖర్. ఆయన తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ సినీ దర్శకుడు. తల్లి శోభ ఒకప్పటి గాయని, సంగీత విద్వాంసురాలు. శోభ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, చంద్రశేఖర్‌ది 'వేళాలర్' (క్రిస్టియన్) వర్గం. 1974 జూన్ 22న జన్మించిన విజయ్‌కి ఆది నుంచీ సినిమాలపై ఆసక్తి. రాజకీయాలపై ప్రత్యేక ఆసక్తి! అందులో భాగంగా ఆయన 2009లో 'విజయ్ మక్కల్ ఇయక్కం' పేరుతో అభిమానుల సంఘాన్ని ప్రారంభించి, దాని ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే... కరుణానిధి, జయలలిత వంటి హేమాహేమీలు రాజకీయాల్లో ఉండడం, రజనీకాంత్ వంటి వారూ రాజకీయాలపై ఆసక్తి ప్రదర్శిస్తుండటంతో విజయ్ తగిన సమయం కోసం వేచిచూశారు. ఇప్పుడు కరుణానిధి, జయలలిత లేరు! రజనీ రాజకీయాల్లోకి రాలేదు. దీంతో... తమిళ రాజకీయాల్లో తనకు 'చోటు' ఉందనే అంచనాకు వచ్చారు. కొత్త పార్టీని ప్రకటించేశారు.

బలాలు.. బలహీనతలు!

విజయ్ అభిమానుల్లో అత్యధికులు యువతే. 18-35 సంవత్సరాల మధ్య వయస్కుల్లో అధిక శాతం ఓట్లను తాము ఆకర్షించగలమని టీవీకే వర్గాలు భావిస్తున్నాయి. అయితే, ఇందులో ఓటు హక్కు కలిగివున్న వారెందరు? ఓటు వేసే వారెందరు? అని ప్రశ్నిస్తే సమాధానం కోసం తడుముకోవాల్సిన పరిస్థితి. విజయ్ ఎక్కడికెళ్లినా సందడి చేసే యువత.. రాజకీయంగాను అండగా నిలుస్తుందా అన్నది చూడాలి. అందుకే విజయ్ మిగిలిన వర్గాలను ఆకట్టుకోవడం తక్షణావసరమని పలువురు సీనియర్లు సూచిస్తున్నారు. సినీ నటుడుగా విజయ్‌కి మహిళా అభిమానులు ఎక్కువ. విజయ్ క్రైస్తవుడైనప్పటికీ, హిందూ మతాచారాలు పాటిస్తారని ఆయన గురించి బాగా తెలిసిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. ఆయనకు నమ్మకాలు కూడా ఎక్కువే. జనాలతో సరిగ్గా మమేకమవకపోవడం ఆయనకు పెద్ద మైనస్. దీనికి తోడు ముక్కుమీద కోపం! డబ్బును ఆచితూచి ఖర్చు చేస్తారనే పేరూ ఉంది.


బహిరంగ సభకు హాజరైన అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తున్న విజయ్

నేతల్లేకుండానే టీవీకే ఆవిర్భావం..

పార్టీ కొత్తదే కావొచ్చు! కానీ... అప్పటికే రాజకీయాల్లో ఉన్న ప్రముఖులెవరో ఒకరు అందులో చేరడం ఇప్పటిదాకా చూశాం. కానీ... విజయ్ పార్టీలో అలాంటి రాజకీయ నాయకులెవరూ కనిపించలేదు. 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో ఎలాంటి హంగూ ఆర్భాటాల్లేకుండా పార్టీని ప్రారంభించి... తొలి మహానాడును ప్రత్యర్థులు సైతం అచ్చెరువొందేలా 5లక్షలమందితో నిర్వహించారు. నిజానికి పార్టీ ప్రారంభానికి కేవలం అభిమానులతో సన్నాహాలు చేసుకున్న విజయ్.. రాజకీయ నేతలెవ్వరినీ దరిచేరనీయలేదు. ఆయన ఐదుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు ఐఏఎస్‌ల సలహాలు, సూచనలతోనే పార్టీని నడుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఐపీఎస్‌లలో ఇద్దరు ఇప్పటికీ సర్వీసులో ఉన్నారు. వారు కూడా త్వరలో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని విజయ్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దాంతో టీవీకేలో రాజకీయ పార్టీ లక్షణాలే కనిపించడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తమిళనాడులో 2026 మే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ లోపు పార్టీని నిర్మించడం విజయ్ ముందున్న పెద్ద సవాల్.



అన్నా డీఎంకేతో పొత్తుకు చాన్స్!

విజయ్ ఈ ఎన్నికల్లో అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకునే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ మహానాడులో ఆయన డీఎంకే, బీజేపీపైనే విమర్శలు ఎక్కుపెట్టారు. అన్నా డీఎంకేపై ఇప్పటిదాకా ఎలాంటి విమర్శలు చేయలేదు. ఈ పరిణామాలను గమనిస్తే... రెండు పార్టీలు భవిష్యత్తులో కలిసికట్టుగా సాగే అవకాశముందని చెప్పవచ్చు. పోలింగ్‌బూత్ వరకు ఓటర్లను తీసుకురాగలిగిన క్యాడర్ ఇంకా సమకూరకపోవడం, ఆర్థికంగానూ తన శక్తిసామర్థ్యాలు సరిపోవని భావించిన విజయ్.. అన్నా డీఎంకేతో పొత్తుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అధికార డీఎంకే కూటమిని ఢీకొట్టడానికి ప్రస్తుతం అన్నా డీఎంకే నానా తంటాలు పడుతోంది. విజయ్‌తో పొత్తు తమకు కలిసొస్తుందని అన్నా డీఎంకే అధినేత పళనిస్వామి గట్టిగా తలపోస్తున్నారు. అందుకే విజయ్‌పైన గానీ, ఆయన పార్టీపైనగానీ విమర్శలు చేయరాదని పళనిస్వామి తన అనుచరులకు సంకేతాలు పంపారు. అంతేగాక... ఇటీవల జరిగిన టీవీకే మహానాడుకు అన్నా డీఎంకే పరోక్షంగా సహకరించినట్లు తెలుస్తోంది.


ఎవరు తన వైపు?

తమిళనాట డీఎంకే-అన్నాడీఎంకేలకు పటిష్ఠమైన క్యాడర్ ఉంది. పార్టీ చిహ్నాం చూసి ఓటేసే ప్రజలు అధికంగానే ఉన్నారు. ఈ రెండు పార్టీలకు కలిపి 60 శాతానికి పైగా ఓటు బ్యాంకు ఉంటుంది. మిగిలిన 40% ఓట్లను ఇతర పార్టీలతోపాటు విజయ్ పంచుకోవాలి. లేదా... రెండు ప్రధాన పార్టీల ఓట్లకు గండి కొట్టాలి! దీనికోసం ఆయన చాలా శ్రమించాల్సి వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే క్రిస్టియన్ మైనారిటీ ఓట్లను టీవీకే చీల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయ్ తండ్రి సామాజికవర్గమైన వేళాలర్ ఓట్లు తమిళనాడులో 1-2% ఉన్నాయి. ఈ ఓట్లలో అధికభాగం టీవీకేకే పడే అవకాశముంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే..విజయ్ ఒంటరిగా పోరాడితే 7-8 % ఓట్లు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అహంకారం.. ఆర్భాటం వద్దు

- అందరితో సౌమ్యంగా, గౌరవంగా మెలగండి
- పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి
- నామినేటెడ్ పదవులు పొందినవారికి

సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు పొందిన వారంతా పదవుల్ని బాధ్యతగా భావించాలి. ఎక్కడా పదవీ అహంకారం, హడావుడి ఉండకూడదు. అందరితో సౌమ్యంగా, గౌరవంగా వ్యవహరించాలి. నిజాయితీగా, కష్టపడి పనిచేసి, పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ అనే మన నినాదాన్ని గుర్తు పెట్టుకుని, ప్రజలతో మమేకం కావాలి' అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రెండో జాబితాలో నామినేటెడ్ పదవులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టుల ద్వారా మంచి అవకాశాలు పొందారు. మనది పొలిటికల్ గవర్నెన్స్ అనే విధానం అని చెప్పాం. అంటే ప్రజలకు చేసే మంచిలో మీరూ భాగస్వాములు కావడమే. తద్వారా మరింత కచ్చితత్వంతో, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఏర్పడుతుంది. అందుకే మీకొచ్చిన పదవులను బాధ్యతగా భావించి, ప్రజల కోసం పని చేయాలి. పార్టీకి, ప్రభుత్వానికి మంచి 'పేరు తీసుకురండి' అని సీఎం సూచించారు. 'కష్టపడిన వారికి న్యాయం చేయాలనే అంశం ప్రాతిపదికగా ముందుగా మిమ్మల్ని ఎంపిక చేశాం. పార్టీ కోసం మీ పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయి. తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులిచ్చాం. గత ప్రభుత్వ దాష్టీకాలను ఎదుర్కొని, ఐదేళ్లు ధైర్యంగా నిలబడినవారికి ప్రాధాన్యం ఇచ్చాం. ఎన్ని సవాళ్లు వచ్చినా నిలబడి పోరాటం చేసిన వారికి, మహిళలు, యువతకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాం. బూత్ స్థాయి కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చే ఏకైక పార్టీగా టీడీపీ నిలుస్తుంది. చాలామంది బూత్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ, వార్డు అధ్యక్షులకు రాష్ట్ర స్థాయి పదవులిచ్చాం. రానున్న రోజుల్లోనూ మరిన్ని పదవులిస్తాం. గత ఐదేళ్లు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో, పార్టీ సభ్యత్వ నమోదులో, పార్టీ నిర్దేశించిన ఇతర లక్ష్యాలను చేరుకున్న వారికి నామినేటెడ్ పదవులిచ్చాం. పార్టీ కోసం కష్టపడి పని చేస్తే ఎక్కడో మారుమూల గ్రామంలో ఉన్నవారికీ పదవి లభిస్తుందనేది నేటి ఈ పోస్టుల భర్తీ ద్వారా మరోసారి అందరికీ అర్థమైంది. రానున్న రోజుల్లో ఇంకా చాలామందికి ఆయా కార్పొరేషన్ డైరెక్టర్లుగా, ఇతర పదవులిస్తాం. పదవులు వచ్చిన నాయకులు, యువత రెండేళ్ల పదవీ కాలాన్ని సమర్థంగా ఉపయోగించుకుని, ప్రజల కోసం నిజాయితీగా, కష్టపడి పని చేయడం ద్వారా రానున్న రోజుల్లో రాజకీయంగా మరింత ఎదగడానికి ఆస్కారం ఏర్పడుతుంది' అని సీఎం పేర్కొన్నారు. కాగా నామినేటెడ్ పదవుల మొదటి జాబితాలో 20 ఛైర్మన్ పోస్టులు, ఒక వైస్ ఛైర్మన్ పోస్టు భర్తీ చేసిన చంద్రబాబు.. 30వేల దరఖాస్తులను స్వయంగా పరిశీలించిన తర్వాత రెండో జాబితాలో ఏకంగా 60 మందికి ఛైర్మన్ పదవులు, ఇద్దరికి కేబినెట్ హోదాతో సలహాదారు పోస్టులు ఇచ్చారు.

'సూపర్ సిక్స్'కు ఊతం!

(మొదటి పేజీ తరువాయి)

రోడ్లనిర్మాణం లాంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు ప్రవేశపెట్టారు. ఈ రెండు బడ్జెట్లకు కలిపి రూ.2.39 లక్షల కోట్లకు ఆమోదం తీసుకున్నారు. 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్ రూ.3లక్షల కోట్లకు చేరువలో ఉండే అవకాశం ఉంది. ఉదయం 9 గంటలకు కేబినెట్ సమావేశంలో బడ్జెట్ ఆమోదం అనంతరం, ఇ-ఆఫీస్ ద్వారా గవర్నర్‌కు పంపుతారు. గవర్నర్ ఆమోదించిన తర్వాత సభలో ప్రవేశపెడతారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆమోదం తీసుకుంటున్నారు. ఈ ఏడాది మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నాలుగు నెలలకు గాను ఓటాన్ అకౌంట్‌ను గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరో నాలుగు నెలలకు గాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. సోమవారం అసెంబ్లీలో వచ్చే 4 నెలలకు గాను పూర్తిస్థాయిలో 2024-25 ఏడాదికి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు మొదటి 4 నెలలకు రాష్ట్రంలో జీతాల చెల్లింపులు, ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి రూ.1,09,052.34 కోట్లకు ఆమోదం తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.2,86,389.27 కోట్లకు ప్రతిపాదించి 4 నెలల ఖర్చుకు ఆమోదం పొందారు. ఎన్నికలు జరిగి జూన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించాల్సినప్పటికీ ఆర్థిక పరిస్థితులపై అవగాహన, పూర్తి సమాచారం కోసం వాయిదా వేసింది. మరో 4 నెలల కాలానికి తాత్కాలికంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు గవర్నర్ ద్వారా ఆర్డినెన్సు జారీ చేయించారు. ఆగస్టు నుంచి నవంబర్ వరకు ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులు ఇతర నిర్వహణ ఖర్చులకూ కలిపి రూ.1,29,972.97 కోట్లకు అనుమతులు తీసుకున్నారు. ఇప్పటి వరకు 8 నెలల కాలానికి రూ.2,39,025.31 కోట్లకు అనుమతి తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గడిచిన ఐదేళ్లకు గాను ప్రవేశపెట్టిన బడ్జెట్లలో ఎక్కడా తాము చేసిన అప్పులు చూపించలేదు. అదే సమయంలో అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి, కొత్త రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

సభలో కీలక బిల్లులు

దేవాలయాల్లోని పాలకమండళ్లలో అదనంగా మరో ఇద్దరు సభ్యుల నియామకంపై బిల్లును ప్రవేశపెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్‌ను రద్దు చేస్తూ బిల్లు పెడుతున్నారు. జ్యుడీషియల్ అధికారుల వయసును 60 నుంచి 61 ఏళ్లకు పెంచుతూ చట్ట సవరణ చేస్తున్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలంటూ వైసీపీ ప్రభుత్వం గతంలో తెచ్చిన చట్టాన్ని రద్దు చేస్తూ గతంలో ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇచ్చింది. దీనికి బదులు మద్యం దుకాణాల నిర్వహణను ప్రైవేటుకు అప్పగిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతారు. ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు 2024ను సభకు సమర్పిస్తారు.

నేటి నుంచే సభాపర్వం

- 10 రోజుల పాటు సమావేశాలు

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :మరికొన్ని గంటల్లో రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. పది రోజుల పాటు సమావేశాలు జరుగుతాయి. మొదటిరోజునే ప్రభుత్వం సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. బడ్జెట్ ప్రసంగం అనంతరం అసెంబ్లీ వాయిదా పడుతుంది. ఆ వెంటనే స్పీకర్ అధ్యక్షతన జరిగే బీఏసీ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. అసెంబ్లీ ఎన్ని రోజులు నిర్వహించాలి...ఏఏ అంశాలపై చర్చించాలనే అంశాలపై అసెంబ్లీ బిజినెస్‌ను నిర్ణయిస్తారు. ఈనెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. బీఏసీలో దీనిపై నిర్ణయం తీసుకుంటారు. ఈసారి అసెంబ్లీలో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యంగా సోషల్ సైకోలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్న ఆలోచనలో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెట్టాలని భావిస్తోంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెడతారు. అలాగే భూఆక్రమణల నిరోధానికి ప్రత్యేక చట్టాన్ని ఈ సమావేశాల్లోనే తెస్తారు.



అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బందోబస్తుకు వచ్చిన పోలీసులు

పదవి నాపై మరింత బాధ్యత పెంచింది

నైతిక విలువల సలహాదారుడి నియామకం ఆనందంగా ఉంది
నియామక ఉత్తర్వులు అందాక కార్యాచరణ ప్రణాళిక: చాగంటి



సర్పవరం జంక్షన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'హిందూ ధర్మం, సనాతన ధర్మంపై చేసిన ప్రవచనాలు ఆత్మ సంతృప్తినిచ్చాయి. ప్రపంచీకరణ, ఆధునికత వైపు వెంపర్లాటలో ప్రజల జీవనశైలి, అలవాట్లలో మార్పులు వచ్చాయి. తల్లిదండ్రులు, గురువులపట్ల భక్తి, గురుభావం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. యువత ఆలోచనా విధానం మారింది. వీటని అధిగమించేందుకు ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత చింతన అలవాటు చేసుకోవాలి. పెద్దలు, గురువులపై గౌరవంగా ఉండేలా పిల్లలను సత్ప్రవర్తనతో మెలిగేలా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది' అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఆయనను 'స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూ స్ సలహాదారుడి'గా నియమించిన సందర్భంగా కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకొండి లక్ష్మీస్మారక గోశాల ప్రాంగణంలో ఆదివారం పలువురు చాగంటిని కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చాగంటి తనను కలిసిన విలేకరులతో కాసేపు మాట్లాడారు. స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ సలహాదారుడి పదవితో రాష్ట్ర ప్రభుత్వమే వేదిక ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు నైతిక విలువల పెంపు, సమాజహితం కోసం, తల్లిదండ్రులు గర్వించేలా, సమాజం, దేశం కోసం దేశభక్తి నింపేలా ప్రవచనాలు అందించేందుకు తనకు ఒక బృహత్తర అవకాశాన్ని అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. కాగా, విద్యార్థులు-నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా ఎంఏ షరీఫ్‌ను నియమిస్తూ సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులిచ్చింది. వీరిద్దరికి కేబినెట్ హోదా కల్పించింది. వీరు రెండేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు.

జగన్ 'బొమ్మ'కు బిల్లులు!

(మొదటి పేజీ తరువాయి)

బిల్లులు ఇప్పిస్తున్నారు. అంతేగాక అదే రీ సర్వేను ఎలాగైనా మళ్లీ పట్టాలు ఎక్కించాలని చూస్తున్నారు. మరోసారి ప్రభుత్వ సొమ్ముతో భారీగా రోవర్లు, డ్రోన్లు కొనుగోలు చేయించాలని తహతహలాడుతున్నారు. గత కాంట్రాక్టర్లను పేషీకి పిలిపించుకొని మంతనాలు చేయిస్తున్నారు. పాత బిల్లులు ఇవ్వాలంటూ తరచూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కార్యాలయానికి సిఫారసులు పంపిస్తున్నారు. లబ్ధిపొందే వారి జాబితాలో జగన్ ప్రభుత్వంలో కీలక సలహాదారు, వైసీపీ నేత బినామీ కంపెనీ, మరో రిటైర్డ్ ఐఏఎస్ బినామీ కంపెనీలున్నాయి. వారికి లబ్ధి చేకూర్చడం కోసం కూటమి సర్కారులోని ఓ మంత్రి, సీనియర్ ఐఏఎస్ తపన పడిపోతుండటం అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. కమిషన్ల కోసమే అయితే బిల్లులు ఇప్పించాల్సిన పనిలేదు. అంతకువించి మరేదో తెరచాటు మంత్రాంగం సాగుతోంది. రీ సర్వేను పునఃప్రారంభించి భారీగా కొనుగోళ్ల పేరిట ఖర్చు పెట్టించేందుకే మాస్టర్‌ప్లాన్ వేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి రాగానే రీ సర్వేనే నిలిపివేశారు.

నాడు అంతా అడ్డగోలు

జగన్ ప్రభుత్వంలో 2019 డిసెంబరు నుంచి 2024 మార్చి వరకు భూముల సర్వే చేశారు. ఇందుకు కేంద్రం నుంచి వచ్చిన డిజిల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(డీఐఎల్ఆర్ఎమ్‌పీ) నిధులను వాడారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.965 కోట్లు. డ్రోన్లు, రోవర్లు, ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు, ఇతర సాంతికేతను సమకూర్చేందుకు రూ.580 కోట్లు వ్యయం చేశారు. ఇందులోనే సర్వే ఆఫ్ ఇండియాకు ఇచ్చిన నిధులున్నాయి. సర్వే రాళ్ల కొనుగోలు, జగన్ ఫొటోలతో పాసుపుస్తకాల ముద్రణ, రాళ్ల తయారీ కోసం మరో రూ.600 కోట్లు ఖర్చుపెట్టారు. ఇలా మొత్తం రూ.1180 కోట్లు ఖర్చు పెట్టి హడావుడి చేశారు. రీ సర్వేతో కొత్త సమస్యలను కోకొల్లలుగా పుట్టించారు. సర్వే రాళ్ల కొనుగోలులో నాటి గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి పెద్ద దందా నడిపారు. సర్వే కోసం ఆశాఖ భారీగా రోవర్లు, డ్రోన్లు కొనుగోలు చేసింది. జగన్ ఫొటోలతో పాసుపుస్తకాలను ముద్రించే కాంట్రాక్టును గుంటూరుకు చెందిన ఓ ప్రింటర్‌కు అప్పగించింది. ఆయన.. జగన్ హయాంలో కీలక సలహాదారుగా వ్యవహరించిన ఓ రిటైర్డ్ ఐఏఎస్ మనిషి. ఇక రోవర్ల కొనుగోలులో ఓ రాజకీయ సలహాదారు చక్రం తిప్పారు. తమ అస్మదీయ కంపెనీలకే టెండర్లు ఇప్పించారు. ప్రభుత్వ సొమ్ము వందల కోట్లు ఖర్చు పెట్టి కొనుగోలు చేయించిన పరికరాలేవీ ఇప్పుడు పనికొచ్చే పరిస్థితిలో లేవు. డ్రోన్లు మూలనపడ్డాయి. అవి పనిచేయడానికి మళ్లీ భారీగా ఖర్చు పెట్టాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. జగన్ ఫొటోలతో ముద్రించిన పాసుపుస్తకాల కోసం దాదాపు 20 కోట్లపైనే ఖర్చు పెట్టారు. జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి.. రోవర్లు, డ్రోన్లు సరఫరా చేసిన కంపెనీలకు, ప్రింటర్స్‌కు దాదాపు 270 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది.

ఇప్పుడు బిల్లుల చెల్లింపులు

ఎన్నో అక్రమాలు, నిధుల దుర్వినియోగంతో కూడిన రీ సర్వేను కూటమి సర్కారు ఆపేసింది. ఈ నేపథ్యంలో దానిపై విచారణ చేయించాల్సి ఉంది. అయితే చిత్రంగా.. ప్రభుత్వంలో ఈ బిల్లుల చెల్లింపు సాగిపోతోంది. ఇప్పటి వరకు 3 పద్దుల్లో కలిపి రూ.120 కోట్ల మేర చెల్లించినట్లు తెలిసింది. మరో రూ.150 కోట్లు ఉన్నాయి. ఇందులో 65 కోట్లు త్వరలో ఇచ్చేలా ప్రతిపాదనలు వెళ్లాయి. పాసుపుస్తకాలు ముద్రించిన గుంటూరు కాంట్రాక్టర్, డ్రోన్ కాంట్రాక్టర్లు గత కొద్దిరోజులుగా ఆర్థిక శాఖలోని ఓ కీలక అధికారి పేషీలోనే మకాం వేశారు. వారు రోజువారీగా ఓ కీలక మంత్రి పేషీ, ఓ సీనియర్ ఐఏఎస్ ఆఫీసు, ఆర్థిక శాఖ కీలక అధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కీలకమైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నా, రీ సర్వే పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరిగిపోతున్నాయి.

ఇది మర్యాదేనా జగన్!

అసెంబ్లీకి డుమ్మా నిర్ణయంతో సెల్ఫ్‌గోల్.. విపక్ష హోదా ఇస్తేనే వెళ్తానని మారాం

- ఎక్కువ సేపు మైకు ఇవ్వరని వెళ్లరట!
- స్వీయపదవిని ఇచ్చేసుకుని నేటి నుంచి సానుకూల మీడియా ముందు డప్పులు
- సోషల్ సైకోలపై వేటుతో వైసీపీ పెద్దల్లో నిర్వేదం
- బూమరాంగ్ అవుతున్న ఒక్కో నిర్ణయం
- వైసీపీ నేతల్లో ఆందోళన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



'ప్రతిపక్ష నేతగా గుర్తించి.. సభానాయకుడితో సమానంగా మైకు ఇచ్చి.. మాట్లాడేందుకు సమయం ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తా' అని వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆయన సహా 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలను ఎన్నికల్లో గెలిపించి అసెంబ్లీకి పంపింది సభకు వెళ్లకుండా ఎగవేయడానికా అని నిలదీస్తున్నారు. ఆయన తీరు అసలుకే మోసం తెచ్చేలా ఉందని సొంత పార్టీ నేతలే బాహాటంగా అంటున్నారు. 'జనం ఇస్తేనే కదా.. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా నేత పదవి దక్కేది! ఆ పదవి ఇస్తేనే సభకు వెళ్తానని మారాం చేయడమేవిటి' అని ఆక్షేపిస్తున్నారు. సోమవారం నుంచి శాసన సభ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండ్రోజుల కిందట తాడేపల్లిలో తనను ఎదురు ప్రశ్నించని విలేకరులను ముందేసుకుని జగన్ మాట్లాడారు. 'అసెంబ్లీ మొట్టమొదటి సమావేశాల సమయంలోనే స్పీకర్‌ను అడిగా.. అయ్యా.. అసెంబ్లీలో ఉన్నవి రెండే రెండు కూటములు.. ఒకటి అధికారపక్ష కూటమి, రెండోది మేము. ఇవి కాకుండా వేరేపక్షం ఉన్నారా అసెంబ్లీలో! మేం కాకుండా అసెంబ్లీ ఎవడూ ప్రతిపక్షంలో లేకపోతే.. మమ్మల్ని ప్రతిపక్షంగా గుర్తించాలా లేదా? ఆ ప్రతిపక్ష పార్టీకి నాయకుడనే వాడు ఉంటాడు కదా! మరి ఆ నాయకుడిని ప్రతిపక్ష నాయకుడనే కదా అనాలి! మాకు 40 శాతం ఓట్ షేర్ వచ్చింది కరెక్టు కాదా? మమ్మల్ని ప్రతిపక్ష పార్టీగా గుర్తించనంటే దాని అర్థం ఏమిటి? అసెంబ్లీ జరిగినన్ని రోజులూ.. సభలో మాట్లాడినట్లే (అనుకూల) మీడియాతో రోజూ గంట సేపు మాట్లాడతా. ప్రజాసమ్యలను లేవనెత్తుతా' అని ప్రకటించారు. ప్రత్యర్థి పార్టీలు ఆయన వ్యాఖ్యలపై మండిపడ్డాయి. ఆయన చెప్పిందల్లా వింటేనే ప్రజాస్వామ్యమా అని విరుచుకుపడ్డాయి. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తేందుకే జనం శాసనసభ్యులుగా గెలిపించి పంపారని.. ప్రతిపక్ష హోదా వస్తుందనో.. ప్రతిపక్ష నేత పదవి వస్తుందనో కాదని ఆయన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే వైసీపీ ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికార పక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలూ ఇదే డిమాండ్ అందుకున్నాయి. జగన్ బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఎక్కుపెట్టాయి. సభలో పార్టీల సంఖ్యాబలం ప్రకారమే విపక్ష హోదా, విపక్ష నేత హోదా లభిస్తాయని తెలిసీ నాటకాలాడుతున్నారని.. గత ఐదేళ్ల దుష్పరిపాలనపై సభలో అధికార పక్షం నిలదీస్తే జవాబివ్వలేమని ముందే చేతులెత్తేశారని.. దీనిని కప్పిపుచ్చుకునేందుకు 'విపక్ష' సాకులు చెబుతున్నారని ఎద్దేవా చేస్తున్నాయి. ఆయన హయాంలో సంఖ్యాబలం ఆధారంగానే టీడీపీ సభ్యులకు సభలో సమయం కేటాయించారని గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు మాత్రం సభలో సీఎం చంద్రబాబుతో సమానంగా తాను కోరుకున్నప్పుడల్లా మైకు ఇవ్వాలని.. తాను సీఎంగా ఉన్నప్పటి భద్రత కల్పించాలంటూ గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నారని ఆక్షేపిస్తున్నాయి. ఎమ్మెల్యేగా నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించనప్పుడు రాజీనామా చేయాలని పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నాయి. దీంతో జగన్ నిర్ణయం రాజకీయంగా బూమరాంగ్ అవుతోందని వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

> **విపక్ష నేతకు గౌరవం ఇచ్చారా?**
>
> 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి 23 అసెంబ్లీ స్థానాలతో ప్రతిపక్షనేత హోదా దక్కింది. కానీ, ప్రధాన ప్రతిపక్షనేతగా చంద్రబాబుకు .. సభాపతిగా తమ్మినేని సీతారాం ఏనాడూ కోరిన వెంటనే మైక్ ఇవ్వలేదు. పైపెచ్చు సభాపతి స్థానంలో కూర్చున్నానన్న స్పృహను కోల్పోయి .. వైసీపీ అధ్యక్షుడు జగన్ కనుసైగ కోసం చూస్తూ .. అతని మెప్పు పొందేలా చంద్రబాబును గేలి చేసేవారు. సీనియర్ రాజకీయ నాయకుడైన చంద్రబాబును తమ్మినేని గేలి చేయడాన్ని ఏనాడూ జగన్ అడ్డుకోలేదు. పైగా .. గలగలా నవ్వేవారు. 2019-24 మధ్య కాలంలో .. ప్రధాన ప్రతిపక్షాన్ని జగన్ గుర్తించలేదు. పైపెచ్చు .. చంద్రబాబు సహా .. ప్రతిపక్షనేతలను ఏకవచన ప్రయోగంతో జగన్ కించపరచేలా మాట్లాడేవారు. అధికారంలో ఉండగా .. ప్రతిపక్షనేతలను లక్ష్యంగా చేసుకుని పాలనను వ్యతిరేకించినవారిపై రాజద్రోహం కేసులు పెట్టించారు.

ఇదేం సంప్రదాయం?

అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షం అనే రెండు పక్షాలే ఉంటాయి. పాలకపక్షంతో విభేదించే రాజకీయపక్షాలన్నీ ప్రతిపక్షం వరుసలోకే వస్తాయి. వీటికి సంఖ్యాబలంతో నిమిత్తం ఉండదు. సహజంగా వామపక్ష పార్టీల బలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ సింగిల్ డిజిట్‌లోనే ఉండేది. ఏనాడూ వామపక్ష పార్టీ శాసన సభ్యులు మాట్లాడేందుకు సిద్ధమైనప్పుడు .. అసెంబ్లీలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా .. వారి సభ్యుల సంఖ్యాబలాన్ని ఎత్తిచూపుతూ గేలి చేసిన దుస్సంప్రదాయం ఎదురు కాలేదు. ఎందుకంటే .. వామపక్షాలు లేవనెత్తే అంశాలన్ని ప్రజాసమస్యలే కేంద్రంగా ఉంటాయి. కానీ, రాష్ట్రంలో వైసీపీ విషయంలో అలా జరగడం లేదు. సభానాయకుడిని తిట్టేందుకే తనకు ప్రతిపక్షనేత హోదా ఇవ్వాలంటూ జగన్ కోరడాన్ని స్వపక్షం వైసీపీని కూడా ఆశ్చర్యానికి లోను చేస్తోంది. వాస్తవానికి ప్రజా సమస్యలను చట్టసభల ద్వారా ఎత్తిపట్టేందుకు సభ్యుల సంఖ్యాబలంతో సంబంధం లేదని ప్రజాస్వామ్యంలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. జగన్ కోరుకున్నట్లుగా ప్రతిపక్షనేత హోదాను ఇవ్వనప్పటికీ .. వైసీపీ సభ్యులంతా ఒకే చోటు కూర్చొని .. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేలా వ్యవహరించొచ్చని రాజకీయపక్షాలు సూచిస్తున్నాయి. అలా కాకుండా .. అసెంబ్లీ ప్రాంగణానికి వెళ్లకుండానే .. ఇంటి దగ్గరే .. తన అనుకూల మీడియా ముందు స్వీయ ప్రతిపక్షనేతలా .. మరో ముక్కలో చెప్పాలంటే .. స్వీయ ముఖ్యమంత్రిగా ప్రకటించుకుని మాట్లాడేందుకు జగన్ సిద్ధం కావడంపై సొంత పార్టీనేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కరిగిపోతున్న గుండెదిటవు..

సామాజిక మాధ్యమం వేదికగా వ్యక్తిగత ఆరోపణలతో ప్రతిపక్షనేతలు, వారి కుటుంబ సభ్యుల వ్యక్తిత్వ హననానికి వైసీపీ ప్రభుత్వం నాడు పాల్పడింది. తల్లి, చెల్లి, అన్న అనే బాంధవ్యాలను.. వావివరుసలను మరిచి అసభ్య పోస్టులకు జగన్ సమూహం బరితెగించింది. బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేయడాన్ని కూడా వైసీపీ తప్పుబడుతూ వచ్చింది. బాధితులపైనే వైసీపీ సర్కారు ఆనాడు ఎదురు కేసులు పెట్టింది. ఇప్పుడు సోషల్ మీడియా చేష్టలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతుంటే .. జగన్ విలవిల్లాడిపోతున్నారు. పోలీసు చర్యలతో సోషల్ మీడియా సభ్యులు ఒక్కొక్కరుగా జారిపోతుండటంతో .. జగన్‌లో భయం మొదలైందని చెబుతున్నారు. దీంతో అధికారులను లక్ష్యంగా చేసుకున్నారు. తాము నాలుగేళ్లలోనే అధికారంలోకి వచ్చేస్తున్నామని .. అధికారులు సప్తసముద్రాల్లో దాగి ఉన్నా వెతికి వెతికి పట్టుకుంటామంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, డీజీపీ తిరుమలరావుపై వ్యక్తిగత ఆగ్రహం వ్యక్తంచేయడం .. రిటైర్ అయినా పిలిపించి చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు చేశారు. ఏమైనా అధికారాన్ని కోల్పోయాక .. జగన్ వేస్తున్న అడుగులన్నీ తప్పటడుగులేనన్న అభిప్రాయం వైసీపీ నేతల్లోనూ వ్యక్తమవుతోంది.



బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ అయ్యన్నతో సమావేశమైన డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు

సభ సజావుగా సాగేందుకు ఏర్పాట్లు చేయండి

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బందోబస్తు, ఇతర ఏర్పాట్లపై డీజీపీ ద్వారకా తిరుమలరావు, బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి పోలా భాస్కర్, శాసనసభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్‌తో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివారం సమీక్ష నిర్వహించారు. శాసనసభ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు.

నేడు వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి అచ్చెన్న

శాసనసభ సమావేశాల సందర్భంగా సోమవారం తొలిరోజు మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ, అనుబంధ రంగాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టే విధానాన్ని గతంలో టీడీపీ ప్రభుత్వమే చేపట్టింది.

ఆత్మవిమర్శ చేసుకోకుండా పరనిందలా?: పల్లా

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎక్స్ వేదికగా జగన్ అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. జగన్ ట్వీట్‌లో నేరాల సమర్థన, పరనింద తప్ప ఆత్మవిమర్శ లేదని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'అబద్ధాలు చెప్పి, కుట్రలు చేసే దుష్ట లక్షణాలన్నీ వైసీపీవే. రూపాయి ఇచ్చి, పది రూపాయలు దోచేసిన ఘనుడు జగన్ కాదా? వ్యవస్థీకృత నేరాల కింద అరెస్ట్ చేయాల్సింది ఎవరినీ?' అని ప్రశ్నించారు. '38 తీవ్ర నేరాల కేసులతో.. 11ఏళ్ల నుంచి కుంటిసాకులతో కోర్టు వాయిదాలకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నదెవరో ప్రజలందరికీ తెలుసు. చంద్రబాబు సంక్షేమ, అభివృద్ధి పాలనకు బ్రాండ్ అంబాసిడర్ అనేది జగమెరిగిన సత్యం. జగన్ తన దుష్ట లక్షణాలను చంద్రబాబుకు అంటగడితే ప్రజలు నమ్మరు' అని పల్లా పేర్కొన్నారు.

ఏం అవమానం జరిగిందని జగన్ అసెంబ్లీకి వెళ్లరు?

- కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు
- సింహగిరిపై విద్యుద్దీపాల శంఖు, చక్ర, తిరునామాలు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు

సింహాచలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు వెళ్లనని జగన్ అనడం సరికాదని కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. ప్రముఖ వ్యాపార సంస్థ జీఆర్‌టీ ఆర్థిక సహకారంతో సింహగిరిపై సుమారు రూ.1.5కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల శంఖు, చక్ర, తిరునామాలను ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రులుగా నందమూరి తారక రామారావు, చంద్రబాబు అసెంబ్లీలో తమకు జరిగిన అన్యాయాలకు మనస్తాపం చెంది సభకు వెళ్లమని ప్రతినబూనారని, జగన్‌కు అసెంబ్లీలో ఎటువంటి అవమానం జరగలేదని, ఎవరూ నిందించే పరిస్థితి కూడా లేదన్నారు. సమావేశాలకు ఎందుకు హాజరుకానంటున్నారో ఆయనకే తెలియాలన్నారు. సింహగిరిపై చేపడుతున్న 'ప్రసాద్' పనులపై మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో రెండు దేవాలయాల్లో చేపట్టిన పనులు చివరిదశకు చేరాయని, సింహాచలంలో మాత్రం నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లాలి : సీపీఐ

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను లేవనెత్తాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాలను వైసీపీ బాయ్‌కాట్ చేస్తే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల బాయ్‌కాట్ నిర్ణయంపై జగన్ పునరాలోచన చేయలని రామకృష్ణ కోరారు.

రేపటికల్లా అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నది. దీని ప్రభావంతో వచ్చే 36గంటల్లో అంటే ఈ నెల 12నాటికి అల్పపీడనం ఏర్పడనున్నది. అల్పపీడనం పశ్చిమంగా పయనించి 14దీకల్లా తమిళనాడు, శ్రీలంక తీరం దిశగా వెళ్లనున్నదని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో 12 నుంచి 14వరకు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

మూడు రోజుల సీఐడీ కస్టడీకి విద్యాసాగర్

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి జెత్వానీ కేసులో ప్రధాన నిందితుడైన కుక్కల విద్యాసాగర్‌ను మూడు రోజుల సీఐడీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో విజయవాడ జైల్లో ఉన్న విద్యాసాగర్‌ను సీఐడీ పోలీసులు ఆదివారం కస్టడీకి తీసుకొని జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం గుంటూరులోని తమ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. కేసు విచారణ అధికారిగా ఉన్న సీఐడీ ఎస్పీ కేజీవి సరిత నిందితుడు విద్యాసాగర్‌ను సుదీర్ఘంగా విచారించారు. ఈ కేసులో పలువురు ఐపీఎస్ అధికారులు కూడా నిందితులుగా ఉన్న నేపథ్యంలో విచారణను అత్యంత గోప్యంగా కొనసాగిస్తున్నారు. సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా గుంటూరు కార్యాలయానికి వచ్చారు. గంటన్నర పాటు అక్కడే ఉన్నారు. దర్యాప్తు పరంగా తీసుకోవాల్సిన చర్యలతో పాటు విచారణలో రాబట్టాల్సిన అంశాలకు సంబంధించిన ప్రశ్నలను ఎస్పీ సరితకు వివరించారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి: బొప్పరాజు

విజయవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మెప్మా, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా అన్ని శాఖల్లో పనిచేసే డ్రైవర్లు, ఇతర అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఏపీ రెవెన్యూ భవన్‌లో ఆదివారం సమావేశం జరిగింది. ముఖ్య అతిథి బొప్పరాజు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా.. అతి తక్కువ వేతనాలు పొందుతూ, ఎక్కువ గంటలు పనిచేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలయ్యేలా తక్షణం ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు డ్రైవర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కొంతమంది అధికారులు అద్దె వాహనాలను వినియోగిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని పేర్కొన్నారు. ఈ విధానాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నూతన వాహనాలను కొనాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ కాంట్రాక్టు-అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.సుమన్, ప్రధాన కార్యదర్శి ఏ.సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్‌కు ఈఎస్ఐ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రభుత్వ డ్రైవర్లతో సమానంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి, రాష్ట్ర అవుట్ సోర్సింగ్-కాంట్రాక్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పామర్తి నాగరాజు, డొప్పా రమణ పాల్గొన్నారు.

నేలపట్టు విడిదికి అతిథులొచ్చేశాయ్!



వలస విహంగాల నెలవైన తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం నేలపట్టు నవంబరు తొలివారానికే కళకళలాడుతోంది. పచ్చని చెట్లపై వాలిన తెల్లని పక్షులతో నేలపట్టు కొత్త అందాలు సంతరించుకుంటుంది. అడపాదడపా కురుస్తున్న తుపాను వానల వల్ల ఈ విదేశీ అతిథుల రాక ఈసారి అక్టోబరులోనే మొదలైంది. తొలి అతిథులుగా ఓపన్ బిల్ స్టార్క్ (నత్తగుల్ల కొంగ)లు నేలపట్టు చెరువుల్లోని కడప చెట్లమీదకు వచ్చి వాలాయి. ఆస్ట్రేలియా, బర్మాల నుంచి దాదాపు వెయ్యికి పైగా పెలికాన్ (గూడబాతు)లు నేలపట్టుకు చేరుకున్నాయి. గూళ్లు అమర్చుకోవడం మొదలు పెట్టాయి. గుడ్లు పెట్టి, పొదిగి, మార్చి ఆఖరుకు పిల్లల్ని వెంటబెట్టుకుని వెళ్లిపోతాయి. అమెరికా, వెస్టిండీస్‌ల నుంచి దాదాపు 1500 వైట్ ఐబిస్ (తెల్ల కంకణాయి)లు ఇక్కడకు వచ్చి వాలాయి. ఏప్రిల్ దాకా ఇవి ఇక్కడ విడిది చేస్తాయి. అరుదైన వలస పక్షి స్పూన్‌బిల్‌లు మాత్రం కేవలం ఆరు మాత్రమే ఇప్పటిదాకా నేలపట్టుకు చేరుకున్నాయి. వీటితో పాటూ లిటిల్ కార్మోరెంట్స్ (చిన్న నీటి కాకి) వెయ్యికి పైగా వచ్చాయి. లిటిల్ ఎగ్రేట్స్ (స్వాతి కొంగ), నైట్ హెరాన్స్ (శబరి కొంగ), పాండ్ హెరాన్స్ (గుడ్డి కొంగ) వంటివి ఒకటొకటిగా నేలపట్టుకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే అయిదున్నర వేల పక్షులు నేలపట్టుకు చేరుకున్నట్టు అంచనా వేశారు. ఈ నెలాఖరుకు వీటి సంఖ్య 8వేలకు చేరుకోవచ్చు. ఈ వలస పక్షుల్లో అత్యధికం పది నాటికల్ మైళ్ల దూరంలోని పులికాట్‌లో రోజూ చేపల వేటకు వెళ్తాయి. సాయంత్రానికి గూళ్లకు చేరుకుంటాయి.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి



అమరావతి అభివృద్ధికి ముందడుగు!

- ప్రపంచబ్యాంకు, ఏడీబీ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం తాజా ఆమోదం
- నిధులపై ఢిల్లీలో నేడు త్రైపాక్షిక చర్చ.. నిబంధనలు, మార్గదర్శకాలు ఖరారు
- ఆ వెంటనే విడతల వారీగా సొమ్ములు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి అభివృద్ధికి ముందడుగు పడింది. రాజధాని నిర్మాణంలో కీలకమైన అమరావతి నగర సుస్థిరాభివృద్ధి, నిర్మాణాల కోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నుంచి తీసుకుంటున్న రూ.15,000 కోట్ల రుణ వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా రుణ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు నిధుల ప్రతిపాదనపై సోమవారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ సమక్షంలో రాష్ట్రానికి, బ్యాంకుల ప్రతినిధులకు మధ్య త్రైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలకు రాష్ట్రం నుంచి సీఆర్‌డీఏ కమిషనర్ కె. భాస్కర్, ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, ఆర్థిక శాఖ నుంచి డి. సురేంద్ర హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఈ రూ.15,000 కోట్ల రుణానికి సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలు ఖరారుకానున్నాయి. రుణంపై మారటోరియం సమయం, కాలపరిమితి వంటి విషయాల్లో స్పష్టత రానుంది. ఈ నిధులలో 800 బిలియన్ డాలర్లను ప్రపంచబ్యాంకు, 800 బిలియన్ డాలర్లను ఏడీబీ సమకూర్చనున్నాయి. చర్చల అనంతరం విడతల వారీగా నిధులు రాష్ట్రానికి అందనున్నాయి. ఈ నిధుల నిర్వహణ కోసం ప్రత్యేక బడ్జెట్ హెడ్ ఏర్పాటు చేస్తారు. ఏపీసీఆర్‌డీఏ సమర్పించే బిల్లులకు ఈ హెడ్ ద్వారాను సీఎఫ్‌ఎంఎస్ నుంచి నిధులు చెల్లిస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి నిధులు సమకూర్చుకునేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం అధికారం కల్పించింది.

ఏయే పనులు చేపడతారంటే..

ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి అందే నిధుల సాయంతో అమరావతిలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండే ప్రాజెక్టులను చేపడతారు. అదేవిధంగా ట్రంకు రోడ్ల నిర్మాణం, వరద నీటి నిర్వహణ పనులు చేపట్టనున్నారు. రిజర్వాయర్ల పునరుద్ధరణ, వరదను తట్టుకునే వ్యవస్థలు, రోడ్లు, పార్కుల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను చేపడతారు. అలాగే, ప్రజలకు ఉపయోగపడే భవనాల నిర్మాణం, నిరంతరాయంగా సురక్షిత నీటి సరఫరా పనులను చేపట్టనున్నారు.

అధికారులను బెదిరిస్తే సుమోటో కేసులు

వారిపై ఈగ వాలినా బెదిరించిన వారే బాధ్యులు

- ఐపీఎస్‌లు లక్ష్యంగా గత ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తప్పు.. సుమోటోగా చర్యలు
- ఏ ఆడబిడ్డకు ఇబ్బంది కలిగినా ఊరుకోను
- సింగపూర్ తరహా శిక్షలు అమలు చేయాలి
- అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను బెదిరిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అధికారులకు ఇంకోసారి హెచ్చరికలు వంటివి చేస్తే సుమోటోగా చర్యలు తీసుకుని, కేసులు పెడతామన్నారు. అధికారులపై ఈగ వాలినా, చిన్న గీత పడినా బెదిరింపులకు దిగిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రిటైర్ అయినా, సప్త సముద్రాలు దాటినా ఐపీఎస్ అధికారులే లక్ష్యంగా గత ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరిస్తామని జగన్‌ను ఉద్దేశించి అన్నారు. ఆదివారం గుంటూరులోని అరణ్యభవన్‌లో జరిగిన రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, అటవీ అమర వీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. పవన్ ప్రసంగిస్తూ... "తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు సప్త సముద్రాల అవల ఉన్నా వదలమని గత ముఖ్యమంత్రి అంటున్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను బెదిరిస్తే ఊరుకునేది లేదు. కర్తవ్య నిర్వహణలో ఉన్న అధికారులు ఎవరూ బెదిరింపులకు బెదిరిపోరు. 20 ఏళ్లు తమ ప్రభుత్వం ఉంటుందని మభ్య పెట్టి గత ప్రభుత్వంలో పోలీసు అధికారులతో తప్పిదాలు చేయించారు. రోడ్డు మీద నిరసనను చూస్తున్న మహిళలపై కూడా హత్యాయత్నం కేసులు పెట్టారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలీసులు ఎన్నిసార్లు ఇబ్బంది పెట్టినా బాధ్యతగా వ్యవహరించమని కోరామే తప్ప.. ఏనాడూ అంతు చూస్తామని మాట్లాడలేదు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి అధికారులను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేయడం తప్పు. మీరు ఇంట్లో కూర్చుని రోడ్డు మీద ఆడబిడ్డల సంరక్షణ లేదని విమర్శలు చేస్తున్నారు. ఆడబిడ్డలపై దాడులు ఎప్పుడు మొదలయ్యాయి? రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఉన్మాదులు ఎందుకిలా పేట్రేగిపోతున్నారు? గత ప్రభుత్వంలో పాలకులు బాధ్యతా రాహిత్యంగా నోటికి వచ్చిందల్లా మాట్లాడేశారు. నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం సతీమణిని తిట్టారు. ఇళ్లల్లోకి వచ్చి బిడ్డలను రేప్ చేస్తామని మాట్లాడారు. పాలించే నాయకులే ఇష్టారాజ్యంగా మాట్లాడితే.. క్రిమినల్స్‌కు తప్పులు చేసినా పర్వాలేదన్న ధైర్యం వస్తుంది. సామాజిక మార్పుతోనే ఆడబిడ్డలపై అఘాయిత్యాలు ఆగుతాయి. నా కళ్ల ముందు ఏ ఆడబిడ్డకి ఇబ్బంది కలిగినా చూస్తూ ఊరుకోను. పోలీసులు కూడా ఫిర్యాదు చేసిన వారిని క్రిమినల్స్‌గా చూడొద్దు. నేరం మీద ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు ఇబ్బంది పెడతారన్న ఆలోచన రాకూడదు. నేరగాళ్లకు కులమతాలు ఉండవు. ఎన్ని చట్టాలు తెచ్చినా వాటిని అమలు చేసే వ్యక్తుల్లో చిత్తశుద్ధి లేకపోతే ఫలితం ఉండదు. నిర్భయ కేసు తర్వాత కూడా అలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. సింగపూర్ తరహా శిక్షలు అమలు చేయాలి. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడి కులాల వెనుక దాక్కుంటామంటే కుదరదు. ఏ కులం అయినా, మతం అయినా తప్పు చేస్తే శిక్షించి తీరాలని ముఖ్యమంత్రి, డీజీపీకి చెప్పాం. ఆడబిడ్డల సంరక్షణకు ముందుగా చుట్టుపక్కన వారి పర్యవేక్షణ ఉండాలి. పూంచ్ సెక్టార్ మాదిరి విలేజ్ డిఫెన్స్ సిస్టం ఉండాలి. ప్రాంతాల వారీగా యువత, పెద్దల కలయికతో డిఫెన్స్ కమిటీలు ఏర్పాటు కావాలి. విద్యాలయాల్లో నిరంతరం స్వీయ రక్షణ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం" అని పవన్ అన్నారు.



గుంటూరు అరణ్యభవన్‌లో అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్

చెట్ల నరికివేతపై వాల్టా చట్ట ప్రకారం చర్యలు

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరుతో రోడ్ల పక్కన చెట్లను ఇష్టారాజ్యంగా నరికేశారని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీశాయని, ఈ వ్యవహారంలో వాల్టా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెట్ల నరికివేతపై చర్యలు మొదలు పెడితే వైసీపీలో చాలామంది నాయకులు ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుందన్నారు. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక ముఠాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన అటవీ అమర వీరుల త్యాగాలను వృథా కానివ్వమని చెప్పా రు. అటవీ రక్షణలో ఒక ఐఎఫ్‌ఎస్ అధికారితో పాటు 23 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

కర్మ వెంటాడుతుంది

- సోషల్ మీడియాను దుర్వినియోగం చేయొద్దు: డిప్యూటీ సీఎం

కర్మ తప్పకుండా వెంటాడుతుందని, సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే ముందు వందసార్లు ఆలోచించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులకు ఎక్స్ వేదికగా ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు. 'ప్రజాస్వామ్యంలో నిర్మాణాత్మకమైన విమర్శలు మంచివి. అనేక విషయాలపై విభేదించవచ్చు, అసమ్మతిని వ్యక్తం చేయవచ్చు, అంతవరకే పరిమితం చేయాలి. కుటుంబాలు, వ్యక్తులు, మత విశ్వాసాలు, నిస్సహాయంగా, సౌమ్యంగా ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేయవద్దు. మీ దగ్గర అంగబలం, అర్థబలం, క్రిమినల్ ముఠాలున్నప్పటికీ సగటు పౌరుడిని ఎప్పటికీ బయపెట్టలేవు. గతంలో మాదిరిగా క్రిమినల్ గ్యాంగ్‌లు, సోషల్ మీడియాను దుర్వినియోగం చేసేవారు పోస్టులు చేసే ముందు వందసార్లు ఆలోచించాలి' అనిపోస్ట్ చేశారు.

సజ్జల భార్గవ్‌పై అట్రాసిటీ కేసు

జగన్ మేనల్లుడు, వర్రాపై కూడా...

- నమోదు చేసిన పులివెందుల పోలీసులు
- అసభ్య పోస్టులు తీసేయాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని వర్రా డిమాండ్
- లేకుంటే చంపి పాతిపెడతానని బెదిరింపు
- కులం పేరుతో దూషించారని ఫిర్యాదు



సజ్జల భార్గవరెడ్డి

కడప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సకల శాఖా మంత్రిగా ఖ్యాతిగాంచిన సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు, వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి, జగన్ చిన్నాన్న వైఎస్ ప్రకాశ్‌రెడ్డి కుమార్తె కొడుకైన సింగారెడ్డి అర్జున్‌రెడ్డితో పాటు సోషల్ సైకో వర్రా రవీంద్రరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పులివెందులలోని టీడీపీ ఆఫీసులో పనిచేసే సింహాద్రిపురానికి చెందిన కొండప్పగారి హరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వర్రా పోస్టుల వెనుక భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డి, వైసీపీ సోషల్ మీడియా టీం ఉందని తెలిసిందని, అసభ్య పోస్టులపై ప్రశ్నించడానికి వెళ్లిన తనను కులం పేరుతో దూషించడంతో పాటు పోస్టు తీయాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపి పాతిపెడతానని బెదిరించారని హరి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు 196, 308 (5), 351(3), 353 (సి), 112(2)(బి) ఆర్/డబ్ల్యు3 (5) బీఎన్‌ఎస్ సెక్షన్ 3(1ఆర్) ఎస్‌ఆర్, ఎస్సీ ఎస్టీ యాక్ట్ 2015, 67ఆఫ్ ఐటీ యాక్ట్ మేరకు కేసు నమోదు చేశారు.

కడప ఎమ్మెల్యేపై అసభ్యంగా పోస్టులు

కడప కార్పొరేషన్‌లో ఈ నెల 7న జరిగిన సమావేశంలో కమిషనర్‌ను కాసేపు ఉండాలంటూ ఎమ్మెల్యే మాధవీరెడ్డి చెబుతున్న వీడియోను మార్ఫింగ్ చేసి కమిషనర్‌కు కన్ను కొట్టినట్లుగా మార్చారు. ఈ మేరకు 'వైఎస్ జె ద వార్' పేరుతో గ్రూప్ క్రియేట్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వ్యక్తులపై పోలీసులు కేసు పెట్టారు.

రాజమండ్రి జైలుకు బోరుగడ్డ తరలింపు

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత బోరుగడ్డ అనిల్‌కు కర్నూలు పోలీసు కస్టడీ ముగిసింది. ఆదివారం రాత్రి కర్నూలు త్రీటౌన్ పోలీసులు బోరుగడ్డ అనిల్‌ను కర్నూలు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. బోరుగడ్డ అనిల్‌కు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు బోరుగడ్డ అనిల్‌ను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. సీఎం చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను సోషల్ మీడియా వేదికగా అసభ్యపదజాలంతో దూషించిన బోరుగడ్డ అనిల్‌ను కర్నూలు త్రీటౌన్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి, ఓ ప్రత్యేక బృందం అతడిని రెండు రోజుల పాటు విచారించారు. బోరుగడ్డను త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచి విచారించడంతో రెండు రోజుల పాటు పోలీస్ స్టేషన్ చుట్టూ ఆంక్షలు విధించారు.

వర్రాకు బిగుస్తున్న ఉచ్చు!

- రాష్ట్ర వ్యాప్తంగా 20కిపైగా కేసులు నమోదు
- బీఎన్‌ఎస్, సైబర్ సెక్షన్ల కింద సైకోలకు చెక్
- అసభ్యకర పోస్టులపై జిల్లాల్లో జల్లెడ పడుతున్న పదిమందితో కూడిన పోలీసు సాంకేతిక బృందం
- వర్రాపై మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫిర్యాదు



మడకశిర ఏఎస్‌ఐ ముత్యాలన్నకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అత్యంత హేయమైన భాషను ఉపయోగించి పోస్టులు చేసిన ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు, జగన్ సతీమణి భారతి పీఏ వర్రా రవీంద్రా రెడ్డికి ఉచ్చు బిగుస్తోంది. పులివెందుల నియోజకవర్గం వేముల మండలానికి చెందిన ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, పీసీసీ చీఫ్ షర్మిల సహా కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టిన పాపం ఇప్పుడు వర్రాను వెంటాడుతోంది. ఇటీవల కడప చిన్నచౌక్ పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి తీసుకెళ్లినప్పుడు ఎంపీ అవినాశ్‌రెడ్డి పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి తప్పించారు. దీంతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌తో పాటు చిన్నచౌక్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో తేజోమూర్తిపై వేటు పడింది. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ రంగంలోకి దిగి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వర్రా కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఈ సైబర్ సైకోపై వచ్చిన ఫిర్యాదులు అన్నింటినీ పోలీసులు సీరియస్‌గా తీసుకుని ఎక్కడికక్కడ కేసులు నమోదు చేస్తున్నారు. అనధికారిక సమాచారం మేరకు ఆదివారం సాయంత్రానికి 20కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు తెలిసింది. కడప, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, కర్నూలు, విజయవాడ, గుంటూరు జిల్లాల్లోని పలు పోలీసు స్టేషన్లలో వర్రాపై కేసులు నమోదయ్యాయి. అతని పోస్టుల్లోని వ్యాఖ్యల్లో తీవ్రత, వీడియోల్లో అశ్లీలత, ఫొటోల్లో అసభ్యత ఆధారంగా బీఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్లు ఎఫ్ఐఆర్‌లలో చేర్చినట్లు తెలిసింది. అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలకు బలమైన అండగా ఉండే కులాల మధ్య చిచ్చుపెట్టేలా పెట్టిన పోస్టులపై బీఎన్‌ఎస్ 111 కింద.. ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు పోస్టు చేయడంపై 67ఏ ఆఫ్ ఐటీ యాక్ట్, జుగుప్సాకరంగా ఉన్న వీడియోలకు సంబంధించి బీఎన్‌ఎస్ 353(2), సమాజంలో గౌరవప్రదమైన వ్యక్తులపై పెట్టిన పోస్టులకు బీఎన్‌ఎస్ 336(4) సెక్షన్ల కింద కేసులు బుక్ చేసినట్లు సమాచారం. వర్రా రవీంద్రా రెడ్డి చేసిన పోస్టులకు ఈ సెక్షన్లన్నీ వర్తిస్తాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బీఎన్‌ఎస్ 111, చైల్డ్ అబ్యూజ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తే ఆ వ్యక్తి జీవితం ఇక జైలుకే పరిమితం అవుతుంది. వర్రాతో పాటు రాష్ట్రంలో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరెవరు, ఎప్పుడెప్పుడు చేశారనే వివరాలను ప్రతి జిల్లాలో పది మందితో కూడిన పోలీసు టెక్నికల్ బృందం వెలికి తీస్తోంది. ఎక్కడికక్కడ బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుని సోషల్ సైకోలను వీలైనంత ఎక్కువకాలం జైలుకు పంపేందుకు పోలీసులు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నారు. దీనికితోడు అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని బిల్లు రూపంలో పెట్టే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అది అమల్లోకి వస్తే సోషల్ మీడియాలో జుగుప్సాకరమైన పోస్టులు పెట్టిన సుమారు 80మందికి పైగా వైసీపీ సోషల్ సైకోలను ఏళ్ల తరబడి జైల్లో పెట్టే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. కాగా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడం ద్వారా వర్రా రవీంద్రా రెడ్డి తన ప్రతిష్ఠకు భంగం కలిగించారనీ, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు ఆదివారం మడకశిర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అడ్డగోలు పోస్టులు.. నిజామాబాద్ వాసి అరెస్టు

వైసీపీ సోషల్ మీడియా ముసుగులో టీడీపీ, జనసేన ముఖ్య నేతలను కించపరుస్తూ పోస్టులు పెడుతున్న వ్యక్తిని మంగళగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ కథనం మేరకు.. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా మెడోరా గ్రామానికి చెందిన బద్దం అశోక్‌రెడ్డి వైసీపీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి నారా లోకేశ్ తదితర ముఖ్యనేతల ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారు. అశోక్‌రెడ్డిపై రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి అశోక్‌రెడ్డిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడ్ని మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించిందని డీఎస్పీ తెలిపారు.

సోషల్ సైకోలపై ఫిర్యాదుల వెల్లువ

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కించపరుస్తూ పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ సైకోలపై రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఫేస్‌బుక్‌లో ఫొటోలు మార్ఫింగ్ చేయడం ద్వారా ఒక వర్గం మనోభావాలను కించపరిచే విధంగా, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు చేశారంటూ అనంతపురం జిల్లాకు చెందిన వైసీపీ నేత హరికృష్ణారెడ్డి కల్లంపై టీడీపీ నేత యర్రాకుల రామాంజనేయులు ఫిర్యాదు మేరకు బాపట్ల జిల్లా అద్దంకిలో కేసు నమోదైంది. చంద్రబాబు, కుటుంబసభ్యులపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన హరీశ్వరరెడ్డిపై టీఎన్‌ఎస్‌ఎఫ్ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ్ల ప్రవీణ్ చక్రవర్తి ఫిర్యాదు మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టడంపై బల్లికురవ సర్పంచ్ పందిరి అంజిబాబు ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన రాజశేఖరరెడ్డిపై కేసు నమోదైంది. అలాగే మేకా వెంకట్రామిరెడ్డి పేరుతో ఉన్న అకౌంట్ నుంచి ఈ ఏడాది మార్చిలో చంద్రబాబు, పవన్‌పై అసభ్యకరమైన పోస్టులు చేశారంటూ బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా కన్వీనర్ వెంపరాల వెంకటప్రసాద్ ఫిర్యాదు చేయగా, ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు జిల్లా కావలి టీడీపీ నాయకుడు దావులూరి దేవకుమార్ ఫిర్యాదు మేరకు మేకా వెంకట్రామిరెడ్డిపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వెంకట్రామిరెడ్డిపై గుంటూరులో కేసు నమోదు కాగా, అక్కడి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు గ్రామానికి చెందిన ఇందుకూరి శ్రీనివాస రాజుపై చినగంజాం గ్రామ సర్పంచ్ రాయిని ఆత్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చినగంజాం పోలీసులు కేసు నమోదు చేశారు.

మురళి.. మహా అవినీతి!

- డిప్యూటీ కలెక్టర్ ఆస్తులు 150 కోట్లు!



తిరుపతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మాజీ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్. మురళి మహా అవినీతి బట్టబయలైంది. అక్రమ మార్గాల్లో ఆయన కూటబెట్టిన ఆస్తులపై శనివారం మొదలైన ఏసీబీ తనిఖీలు ఆదివారం వరకు సాగాయి. మురళి నివాసంలో కిలో బంగారం, 800 గ్రాముల వెండి, ఆస్తులకు సంబంధించిన 33 డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. అదేవిధంగా 20 బ్యాంకుల్లో ఖాతాలతోపాటు ఏడు ఇళ్లు, ఒక హోటల్, 12 స్థలాలను గుర్తించినట్టు తెలిసింది. మార్కెట్ ధరల ప్రకారం ఈ ఆస్తుల విలువ సుమారు రూ.150 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. తనిఖీలు ముగియడంతో ఆదివారం డిప్యూటీ కలెక్టర్ మురళిని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు నెల్లూరులో ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచేందుకు తరలించారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో కొన్నాళ్ల కిందట అగ్నిప్రమాదం సంభవించి ఫైళ్లు దగ్ధమైన ఘటనలో మురళి సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును సీఐడీ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు మురళికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో అవినీతి నిరోధక విభాగం(ఏసీబీ) రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి శని, ఆదివారాల్లో తిరుపతి, చిత్తూరు, వి.కోట, పలమనేరు, మదనపల్లె, కడప, నెల్లూరు తదితర చోట్ల తనిఖీలు చేపట్టారు. తిరుపతి, వి.కోటల్లోని మురళి నివాసాలతో పాటు ఆయన బంధువులు, మిత్రులు, బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తుల నివాసాల్లోనూ సోదాలు చేశారు. మురళి కూడబెట్టిన అక్రమాస్తులలో 80 శాతం వరకు బినామీల పేరిట పెట్టినట్టు ఏసీబీ గుర్తించింది. దీనికనుగుణంగా బినామీలపైనే అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. దీనిలో భాగంగా మురళి వద్ద పనిచేసిన కిందిస్థాయి రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల పేరిట ఆస్తులు రిజిస్టర్ చేశారని, బినామీలలో రిటైర్డు ఉద్యోగులు ఉన్నారని సమాచారం.

ఎక్కడ పనిచేస్తే అక్కడే!

మురళి ఎక్కడ పనిచేస్తే అక్కడే అక్రమాస్తులు కూడబెట్టినట్టు అధికారులు గుర్తించారు. వ్యవసాయ భూములు వి.కోట, పలమనేరు, చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, నెల్లూరు, తిరుపతి పరిసరాల్లో ఉన్నాయని, తిరుపతిలోని ఓటేరు, పలమనేరు, మదనపల్లెల్లో ఇళ్లు ఉన్నాయని గుర్తించారు. అలాగే, తిరుపతిలోని ఎంకే నాయుడు కాలనీ, మదనపల్లె, వి.కోట, కడప, నెల్లూరు, ఒంగోలు, పలమనేరుల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయని అధికారులు నిగ్గు తేల్చారు. తిరుపతిలో డిప్యూటీ కలెక్టర్ కుటుంబీకులు నడుపుతున్న హోటల్‌కు సంబంధించి రెండు డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిలో ఒకటి మురళి పేరిట ఉండగా మరొకటి కుటుంబీకుల పేరిట ఉన్నట్టు తెలిసింది. వాస్తవానికి హోటల్ స్థలాన్ని నేరుగా మురళీనే తనపేరిట కొనుగోలు చేశారని, కుటుంబీకుల పేరిట కొన్నట్టు పేర్కొంటున్న రెండవ డాక్యుమెంట్ నకిలీదై ఉంటుందని భావిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.